Email:prajamantalu@gmail.com
www.prajamantalu.com

# ప్రజా మంటలు

తెలంగాణ జాతీయ దినపత్రిక
సంపుటి : 4 సంచిక : 137
పేజీలు - 8 వెల - రూ 5:00
ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు

శుక్రవారం 17, నవంబర్-2023

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak,Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yadadri Bhuvanagiri

## బిఆర్ఎస్‌ది తెలంగాణతో పేగుబంధం



4లో..

## ఎన్నికల తరవాత బిఆర్ఎస్ దుకాణం క్లోజ్

### ప్రచారంలో సిఎల్పీ నేత భట్టి ఆరోపణ



ఖమ్మం,నవంబర్16 : తెలంగాణలో నవంబర్ 30 తరువాత రాష్ట్రంలో బీఆర్ఎస్ ఉండదని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీకి భవిష్యత్తు లేదని.. కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావాలని ప్రజలు నిర్ణయించారని తెలిపారు. ఆరు గ్యారంటీలను ప్రభుత్వం ఏర్పాటైనా 100 రోజుల్లో అమలు చేస్తామని పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా మధిర మండలంలో భట్టి విక్రమార్క గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ 10 సంవత్సరాలు రాష్ట్ర సంపదను దోచుకున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ప్రజలు వదిలించుకోవాలనుకుంటున్నారన్నారు. ఈ క్రమంలో రామచంద్రపురం గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ నుంచి భట్టి సమక్షంలో 30 కుటుంబాలు కాంగ్రెస్‌లో చేరాయి.

## ప్రవీణ్‌ను అరెస్ట్ చేయొద్దు : హైకోర్టు



హైదరాబాద్,నవంబర్16 : బీఎస్పీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌ను అరెస్ట్ చేయవద్దని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. కొంతమంది బీఆర్ఎస్ నాయకులపై దాడి చేశారని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌పై కాగజ్ నగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదయింది. దీంతో ఆయన హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. ఉత్తర్వులు వెలువడే వరకు అరెస్ట్ చేయవద్దని హైకోర్టు ఆదేశించింది. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సిర్పూర్ కాగజ్ నగర్ నుంచి బీఎస్పీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న విషయం తెలిసిందే.

# మరింత అభివృద్ధికై బీఆర్ఎస్‌ను గెలిపించాలి

- ఒకప్పుడు నర్సాపూర్‌కు మంచి నీళ్లు రాకపోయేది
- కోమటిబండ నుంచి మంచినీళ్లు తీసుకొచ్చాం
- పిల్లుట్ల కాలువ పూర్తయితే వజ్రపు తునకలా నర్సాపూర్
- రెండు నదుల మీ చెక్ డ్యాంలు కట్టొద్దని బ్యాన్ పెట్టిండ్రు
- నర్సాపూర్‌లో బాధలు తీరాయి
- మదన్ రెడ్డి గౌరవప్రదమైన పదవిలో ఉంటారు
- అసైన్డ్ భూములపై కాంగ్రెస్ అసత్య ప్రచారాలు
- కాంగ్రెసోళ్లు అబద్ధాలు చెప్పటంలో పెద్ద మొనగాళ్లు
- ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్





నర్సాపూర్,నవంబర్16 : ఒకప్పుడు నర్సాపూర్ నియోజకవర్గానికి మంచి నీళ్లు రాకపోయేది.. కానీ ఇప్పుడు కోమటిబండ నుంచి మంచినీళ్లు తీసుకొచ్చాం.. ఇప్పుడు మంచినీళ్ల బాధ లేదు.. ఇక పిల్లుట్ల కాలువ ద్వారా సాగునీరు తీసుకొస్తే, నర్సాపూర్ వజ్రపు తునకలా తయారవుతదని అని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. నర్సాపూర్ నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్ పాల్గొని ప్రసంగించారు. మంజీరా నది, హల్దీ నది ఎట్ల ఉండేది కాంగ్రెస్ రాజ్యంలో. ఎవరన్న పట్టించుకున్నడా..? ఇంకా వాళ్ల తెలివికి ఏం చేసింండ్రు అంటే ఈ రెండు నదుల మీ చెక్ డ్యాంలు కట్టొద్దని బ్యాన్ పెట్టింండ్రు. ఈ రోజు రెండు నదుల మీద చెక్ డ్యాంలు కడితే అవి ఇప్పుడు జీవనదుల్లా ఉంటున్నాయి. హల్దీ వాగుకు అయితే కాళేశ్వరం నీళ్లు పోసి ఎండకాలంలో మత్తళ్లు దుంకుతున్నాయి. బ్రహ్మాండంగా పంటలు పండుతున్నాయి అని కేసీఆర్ తెలిపారు. ఒకప్పుడు నర్సాపూర్‌లో మంచీనీళ్లకు బాధలు ఉండే. కోమటిబండ నుంచి మీకు మంచి నీళ్లు వస్తున్నాయి. అనేకమైన బాధలు తీరినయి. ఒకసారి పిల్లుట్ల కాల్వ అయిపోయింది అంటే బ్రహ్మాండమైన నీటి పారుదల మిగతా 4లో..

# కేసీఆర్, మల్లారెడ్డి- తోడు దొంగలు

- భూ కబ్జాలకు పాల్పడుతున్నారు
- తెలంగాణను కేసీఆర్ ఆగమాగం చేశారు
- డంపింగ్ యార్డు తరలింపునకు కోర్టు ఆదేశాలు ఇచ్చింది
- ఇప్పటివరకు సీఎం కేసీఆర్ పట్టించుకోలేదు
- జవహర్‌నగర్ కార్నర్ మీటింగ్‌లో రేవంత్ రెడ్డి విమర్శలు



హైదరాబాద్,నవంబర్16 : సిఎం కేసీఆర్, మంత్రి మల్లారెడ్డి కలిసి మేడ్చల్‌లో తోడు దొంగల్లా భూములను కబ్జా చేస్తున్నారని.. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా జవహర్‌నగర్, మేడ్చల్‌లో కాంగ్రెస్ కార్నర్ మీటింగ్‌లో పాల్గొన్న రేవంత్‌రెడ్డి.. బీఆర్ఎస్‌పై విమర్శలు గుప్పించారు. ప్రజలు కాంగ్రెస్ పార్టీకే ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో పేదలు బతికే పరిస్థితి లేదని.. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్?.. తెలంగాణను ఆగమాగం చేశారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో భాగంగా.. జవహర్‌నగర్‌లో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో రేవంత్ ప్రసంగించారు. ఇక్కడి ప్రజలకు కేసీఆర్ ఇచ్చిందేంలేదని.. జవహర్?నగర్ డంపింగ్ యార్డేనని ఎద్దేవా చేశారు. ఇక్కడి ప్రాంతంలోని డంపింగ్ యార్డు తరలింపునకు కోర్టు ఆదేశాలు ఇచ్చినా.. సీఎం కేసీఆర్ పట్టించుకోలేదని మండిపడ్డారు. సీఆర్?, మంత్రి మల్లారెడ్డి మేడ్చల్? జిల్లాలో.. తోడు దొంగల్లా భూ కబ్జాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. నియోజకవవర్గంలో మల్లారెడ్డి పేదోళ్ల గుడిసెలు కూల్చి.. వారికి నిలువ నీడ లేకుండా చేశాడని దుయ్యబట్టారు. పేదలపై ప్రతాపం చూపే అధికారులు.. చెరువులను మింగిన మల్లారెడ్డిపై చర్యలెందుకు తీసుకోరని ఆగ్రహం వ్యక్తం చేశారు. చెరువుల పక్కన భూములు కొని.. చెరువులను మింగిన ఘనుడు మల్లారెడ్డి అని ఆరోపించారు. టికెట్లు అమ్ముకున్న మల్లారెడ్డికి.. కేసీఆర్ మళ్లీ ఎమ్మెల్యే టికెట్ ఇచ్చాడని దుయ్యబట్టారు. మరీ కేసీఆర్ ఎన్ని వందల కోట్లకు టికెట్ అమ్ముకున్నారని ప్రశ్నించారు. జవహర్ నగర్ డంపింగ్ యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కేసీఆర్ లక్ష కోట్లతో కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు మూడేళ్లకే కుంగిందని.. తెలంగాణను ఆగం చేసిన కేసీఆర్‌ను పొలిమేరలు దాటే వరకు తరమాలని ప్రజలను కోరారు. మేడ్చల్?కు.. రాష్ట్రప్రభుత్వం తెస్తామన్న ఐటీ పార్కు ఎక్కడికి పోయిందని ప్రశ్నించారు. ముదిరాజ్‌లకు ఒక్కసీటు కూడా కేసీఆర్ ఇవ్వలేదని తెలిపారు. బీఆర్ఎస్ పదేళ్లు అధికారంలో ఉన్నా మేడ్చల్‌కు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. మేడ్చల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ హయాంలో జరిగిందే తప్ప బీఆర్ఎస్ చేసిందేం లేదని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే.. మేడ్చల్‌కు డిగ్రీ కాలేజీ, వందపడకల హాస్పిటల్ తెస్తామని హామీ ఇచ్చారు. పేదల ప్రభుత్వం రావాలంటే.. దొరల రాజ్యం కూలాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కేసీఆర్‌ను గద్దె దింపే సమయం ఆసన్నమైందన్నారు. కాంగ్రెస్ పార్టీకే ఓటు వేసి గెలిపించాలని.. ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే.. సోనియా గాంధీ ప్రకటించిన ఆరు హామీలను అమలుచేసి తీరుతామన్నారు. సీఎం కేసీఆర్, మంత్రి మల్లారెడ్డి మేడ్చల్ జిల్లాలో తోడు దొంగల్లా భూ కబ్జాలకు మిగతా 4లో..

# బీఆర్ఎస్, కాంగ్రెస్ దొందు దొందే

### పైసలిచ్చి మహిపాల్ రెడ్డి టికెట్ తెచ్చుకున్నారు
### ప్రధాని మోడీ ఇచ్చే పైసలతో డబుల్ బెడ్ రూం కట్టారు
### బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్



సంగారెడ్డి,నవంబర్16 : సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు నియోజకవర్గంలోని రామ చంద్రాపురం సండే మార్కెట్ లో బీజేపీ బహిరంగ సభకు బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా భారీ ర్యాలీగా పటాన్ చెరు మైత్రి గ్రౌండ్ నుంచి బండి సంజయ్ కు స్వాగతం పలికారు బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి నందీశ్వర్ గౌడ్, పార్టీ శ్రేణులు. ఈ నేపథ్యంలో బండి సంజయ్ మాట్లాడుతూ.. పైసలిచ్చి మహిపాల్ రెడ్డి టికెట్ తెచ్చుకున్నారని, మియాపూర్ నుంచి సంగారెడ్డి వరకు మెట్రోరైలు విస్తరణకు కృషి చేస్తామన్నారు బండి సంజయ్. ప్రధాని మోడీ ఇచ్చే పైసలతో డబుల్ బెడ్ రూం కట్టారు. ఆసుపత్రులు కట్టారని, నీళ్లు, నిధులు,నియమకాలు పేరుతో అధికారంలోకి వచ్చిన కేసీఆర్ ఆయనకు మాత్రమే తప్ప ఎవరికీ ఉద్యోగాలు రాలేదన్నారు బండి సంజయ్. అంతేకాకుండా.. 'బీఆర్ఎస్, కాంగ్రెస్ దొందు దొందే. రెండు పార్టీలు ప్రజలను మభ్యపెట్టి పబ్బం గడుపుకునే ప్రయత్నం చేస్తుంది. కేసీఆర్, కాంగ్రెస్ పార్టీలు కూర్చుని ఆరు గ్యారంటీ పథకాలు సృష్టించారు. సమర్థ పాలన కేవలం బిజేపి తోనే సాధ్యం. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు అధికారంలోకి వస్తే తెలంగాణ మరో శ్రీలంక అవుతుంది. పోడు భూముల కోసం, నిరుద్యోగుల కోసం కొట్లడితే మాపై మిగతా 4లో..

## ప్రజానాడి



# కాంగ్రెస్ కావాలా కరెంట్ కావాలా?

- దండుపాళ్యం బ్యాచ్ బయల్దేరింది
- కేసీఆర్‌ను ఓడించేందుకు కుట్రలు పన్నుతోంది
- హస్తం పార్టీకి ఇప్పటికే ఎన్నో ఛాన్సులు ఇచ్చినం
- మళ్లీ ఇప్పుడొచ్చి మరో ఛాన్స్ అడుగుతున్నారు
- కరెంటు కావాలో.. కాంగ్రెస్ కావాలో ప్రజలు ఆలోచించుకోవాలి
- వికారాబాద్ బీఆర్ఎస్ రోడ్‌షోలో కేటీఆర్



వికారాబాద్,నవంబర్16 : ఎన్నికలు రాగానే కాంగ్రెస్, బీజేపీలు ప్రజలను ఆగమాగం చేస్తాయని.. ఓటు వేసేటప్పుడు ప్రజలు ఒక్కసారి ఆలోచించాలని మంత్రి కేటీఆర్ విజ్ఞప్తి చేశారు.హస్తం పార్టీకి ఇప్పటికే ఎన్నో ఛాన్సులు ఇచ్చినా.. మళ్లీ ఇప్పుడొచ్చి మరో ఛాన్స్ అడుగుతున్నారని ఎద్దేవా చేశారు. ఈ క్రమంలోనే కేసీఆర్‌ను ఓడించేందుకు కాంగ్రెస్ దండుపాళ్యం బ్యాచ్ బయల్దేరిందని.. కరెంటు కావాలో.. కాంగ్రెస్ కావాలో ప్రజలు ఆలోచించుకోవాలన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్? పాలనలో రాష్ట్రంలో 24 గంటల కరెంట్ ఇస్తున్నామని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. కరెంట్‌పై రేవంత్‌కు అనుమానం ఉంటే విద్యుత్ తీగలను పట్టుకోవాలని చురకలంటించారు. కరెంట్‌పై మాట్లాడే అర్హత కాంగ్రెస్ నేతలకు లేదన్నారు. ఈ క్రమంలోనే గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో తాగు నీటి సమస్య మిగతా 4లో..

# ప్రభావం చూపుతున్న ఫార్వర్డ్ బ్లాక్

### ప్రధాన పార్టీల గెలుపు, ఓటముల ప్రభావితం

(రామ కిష్టయ్య సంగన భట్ల)

హైదరాబాద్-ప్రజామంటలు ప్రస్తుత శాసనసభ సాధారణ ఎన్నికలలో ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ అభ్యర్థులు సింహం గుర్తుతో చాలా స్థానాల్లో పోటీకి దిగారు. గల్ఫ్ బాధితులతో పాటు రాజకీయంగా అన్యాయానికి గురైన వారికి నేతాజీ స్థాపించిన ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ ఎమ్మెల్యే టికెట్లు ఇచ్చి ప్రోత్సహించింది. అవిభక్త ఆంధ్ర ప్రదేశ్ దివంగత ముఖ్యమంత్రి జలగం వెంగళ రావు కుమారుడు, మాజీ ఎమ్మెల్యే జలగం వెంకట్రావు (కొత్తగూడెం), చెరుకు రైతులు, గల్ఫ్ కార్మికులు, బీడీ కార్మికులు బలపరిచిన చెన్నమనేని శ్రీనివాస్ రావు (కోరుట్ల), పి. విష్ణువర్ధన్ రెడ్డి (షాద్ నగర్), తెలంగాణ ఉద్యమకారుడు మున్నూరు రవి (మహబూబ్ నగర్), గొంగల్ల రంజిత్ కుమార్ (గద్వాల్), పిల్లుట్ల రఘు (హుజూర్ నగర్), పిల్లి రామరాజు యాదవ్ (నల్గొండ), డా. ఎం. అంజి యాదవ్ (కోదాడ), బద్దం భోజారెడ్డి (ముధోల్) తొమ్మిది మంది గట్టి పోటీ ఇస్తున్నారు. అలాగే ఫార్వర్డ్ బ్లాక్ టికెట్ పై సింహం గుర్తుతో పోటీ చేస్తున్న గల్ఫ్ సంఘాల నాయకులు గుగ్గిల్ల రవిగౌడ్ (వేములవాడ), స్వదేశ్ పరికిపండ్ల (నిర్మల్), బూత్కూరి కాంత (ధర్మపురి), బూస రాకేష్ యాదవ్ (ఆర్మూర్) లతో పాటు సిరిసిల్లలో ఇండిపెండెంటుగా టీవీ రిమోట్ గుర్తుపై పోటీ చేస్తున్న గల్ఫ్ కార్మిక ఉద్యమకారుడు క్రిష్ణ దొనికెని ప్రధాన పార్టీల అభ్యర్థుల గెలుపు, ఓటములను ప్రభావితం చేసే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

All India Forward Bloc

# ప్రభుత్వాన్ని గద్దె దించాలి

## కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి



హైదరాబాద్,నవంబర్16 : రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం అబ్దుల్లాపూర్‌మేట్ మండలంలోని ఇనాంగూడ, నాగంపల్లి, పోల్కంపల్లి, మన్నెగూడ, నెర్రపల్లి దండు మైలారం రాయపోల్ వివిధ గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు. గ్రామాలలో కాంగ్రెస్ పార్టీకి మంచి ఆదరణ ఉందని తెలంగాణ ఇచ్చిన సోనియమ్మకు మన ఈసారి కాంగ్రెస్ పార్టీని గెలిపించి రుణం తీర్చుకోవాలని, అదేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను పేద ప్రజల కోసం ప్రవేశపెట్టిందని కనీస సౌకర్యాలు కల్పించని ప్రభుత్వంని గద్దె దించాలని ప్రజలకు వివరిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేసి అధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించి చేతి గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. నియోజకవర్గంలో ఎక్కడ చూసినా స్వచ్ఛందగా ప్రజలు కాంగ్రెస్ ప్రచారం నిర్వహిస్తున్నారన్నారు. ఇబ్రహీం పట్నం నియోజకవర్గంలో అవినీతిపరుడు ఎమ్మెల్యే గా ఉన్నాడని%ో%ప్రజల భూములు లాకున్నడని ఆరోపించారు. ఎమ్మెల్యే నియోజకవర్గంలో ఎక్కడ కూడా అభివృద్ధి చేయలేదన్నారు. గతంలో తాను ఉన్నపుడే నియోజకవర్గం అభివృద్ధి చెందింది అని అన్నారు. ఈ ఎన్నికల్లో కచ్చితంగా బీఆర్ఎస్ ను ఓటమి పాలు చేయడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

# విజయ రమణారావు బహిరంగ చర్చకు సిద్ధం కావాలి

## మాజీ ఎమ్మెల్యే గోనె ప్రకాష్



**హైదరాబాద్,నవంబర్16 :** పెద్దపల్లి జిల్లా కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే గోనె ప్రకాష్ రావు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెద్దపల్లి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయ రమణారావుపై ఈడీ, ఆదాయపన్ను శాఖ అధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. విదేశీ అకౌంట్లు, పలు కంపెనీల్లో పెట్టుబడులపై ప్రజలకు జవాబు చెప్పాల్సిందేనన్నారు. ఐదు రోజుల్లో ఢిల్లీకి వెళ్లి హోంశాఖతో పాటు ఈడీకి ఫిర్యాదు చేస్తానని, దేశంలోనే పేరున్న ఆడిటర్ తో విదేశీ ఖాతాలు, పెట్టుబడులపై ఆరా తీస్తామన్నారు. 2018లో 2023లో వేర్వేరు పాన్ కార్డు నెంబర్లు ఎందుకు ఇచ్చారని, సూట్ కేస్ కంపెనీల్లో పెట్టుబడులపై సంబంధిత అధికారులు విచారణ చేసి నిజానిజాలు తేల్చాల్సిన అవసరం ఉందన్నారు గోనె ప్రకాష్ రావు. విజయ రమణారావు బహిరంగ చర్చకు సిద్ధం కావాలని, విదేశీ ఖాతాలపై ప్రజలకు జవాబు ఇవ్వాల్సిన అవసరం ఉందని, ఈడీ రాకముందే పోటీ నుండి తప్పుకుంటున్నట్లు ప్రకటించాలని డిమాండ్ చేశారు.

# ఆనం వెంకటరమణారెడ్డికి టీటీడీ ఈవో ధర్మారెడ్డి సవాల్

**అమరావతి,నవంబర్16 :** టీడీపీ అధికార ప్రతినిధి ఆనం వెంకట రమణా రెడ్డి ఆరోపణలపై టీటీడీ ఈవో ధర్మారెడ్డి స్పందించారు. వెంకట రమణారెడ్డి ఆరోపణలపై బహిరంగ చర్చకు తాను సిద్ధమన్నారు. దేవాదాయశాఖ చట్టం మేరకు టీటీడీ ఈవోగా నియమితులవ్వాలంటే జిల్లా కలెక్టర్ లేదా సమాన హోదాలో పని చేసి వుండాలన్నారు. 1991 బ్యాచ్‌కి చెందిన తాను ప్రిన్సిపల్ సెక్రటరి హోదా కంటే ఎక్కువ హోదాలో వున్న పోస్టులో భాధ్యతలు నిర్వర్తించాననని ఆయన చెప్పారు. తన నియామకంపై హైకోర్టులో పిల్ దాఖలు చేస్తే దానిని హైకోర్టు కొట్టివేసిందన్నారు. 2014లో ఢిల్లీ కంటోన్మెంట్ డిఫెన్స్ సీఈఓగా వున్నప్పుడు అక్రమ కట్టడాలపై చట్టపరంగా చర్యలు తీసుకున్నామన్నారు. 2020లో వారు కోర్టులో ప్రైవేట్ కేసు వేస్తే దానికి సంబంధించి సమన్లు గత ఏడాది జారీ చేశారన్నారు. సమన్లు స్క్వాష్ చేయాలని కోర్టులో కేసు వేస్తే దానిపై స్టే విధించారన్నారు. టీటీడీ ఈవో ధర్మారెడ్డి మాట్లాడుతూ.. "నేను టీటీడీలో అవినీతి చేసానని ఆరోపిస్తున్నారు.. నేను టీటీడీకి వచ్చిన గత నాలుగున్నర సంవత్సరాల కాలంలో ఫిక్స్‌డ్ డిపాజిట్ల ద్వారా రూ.4800 కోట్లు.. బంగారం 3885 కేజీల డిపాజిట్లు, శ్రీవాణి ట్రస్ట్ ద్వారా రూ.1021 కోట్లు నిధులు జమ అయ్యాయి. దాతల సహకారంతో 175 కోట్లతో చిన్నపిల్లల హస్పిటల్స్, 135 కోట్లతో మ్యూజియం అభివృద్ధి, 274 కోట్లు స్విమ్స్‌లో 1200 పడకల హాస్పిటల్‌గా అభివృద్ధి పరుస్తున్నాం." అని అన్నారు.

# టీటీడీ దేవస్థానం అధికారపార్టీ నేతల అవినీతికి అడ్డాగా మారింది

## టీడీపీ అధికార ప్రతినిధి ఆనం వెంకటరమణా రెడ్డి

**అమరావతి,నవంబర్16 :** తిరుమల తిరుపతి దేవస్థానం అధికారపార్టీ నేతల అవినీతికి అడ్డాగా మారిందని టీడీపీ అధికార ప్రతినిధి ఆనం వెంకటరమణా రెడ్డి ఆరోపించారు. భూమన కరుణాకర్ రెడ్డి టీటీడీ ఛైర్మన్ అయ్యాక దేవస్థానం డబ్బుల్ని తన కొడుకు అభినవ రెడ్డి ఎన్నికల ప్రచారానికి ఖర్చు చేస్తున్నారని ఆరోపణలు చేశారు. తిరుపతి పరిధిలో ఏ పనికైనా 10శాతం తీసుకుంటున్న భూమన కరుణాకర్ రెడ్డిని ఇప్పటికే 10 శాతం కరుణాకర్ రెడ్డిగా పిలుస్తున్నారన్నారు. టీటీడీ ఉద్యోగులకు కేటాయించిన స్థలాల చుట్టూ అభినవ రెడ్డి 5.45 ఎకరాలు ఎలా కొనుగోలు చేశాడో కరుణాకర్ రెడ్డి సమాధానం చెప్పాలన్నారు. తిరుమల శ్రీవారి సొమ్ము తిన్న ప్రతీ రూపాయిని తెలుగుదేశం అధికారంలోకి రాగానే కక్కిస్తామన్నారు. తాడేపల్లి ప్యాలెస్‌లో సజ్జల ఎలాగో టీటీడీలో ధర్మారెడ్డి వ్యవహారం అలానే ఉందని ఆయన ఆరోపించారు. ధర్మారెడ్డి అవినీతిపై 14 సెక్షన్ల కింద ఢిల్లీలో క్రిమినల్ కేసు నమోదైందని అన్నారు. తనపై ఉన్న క్రిమినల్ కేసుని దాచిపెట్టి ధర్మారెడ్డి టీటీడీ ఈవో అయ్యాడని ఆనం వెంకటరమణారెడ్డి చెప్పారు. అదే అవినీతి టీటీడీలో చేయడని నమ్మకం ఏంటని ఆయన ప్రశ్నించారు. ఐఏఎస్‌లను కాదని, క్రిమినల్ కేసులు ఉన్న వ్యక్తికి టీటీడీలో కీలక పదవి ఎలా ఇస్తారని ప్రశ్నలు గుప్పించారు. టీటీడీని అడ్డం పెట్టుకుని ఢిల్లీలో ధర్మారెడ్డి లాబీయింగ్ చేస్తున్నాడని ఆరోపించారు. ఢిల్లీలో నమోదైన కేసుపై తీర్పు వచ్చే వరకూ ధర్మారెడ్డిని టీటీడీ బాధ్యతల నుంచి తప్పించాలన్నారు.

# ఫిబ్రవరి నాటికి మరో 5 లక్షల ఇళ్లు పూర్తి

## గృహ నిర్మాణ శాఖపై ఏపీ ముఖ్యమంత్రి సమీక్ష

**అమరావతి,నవంబర్16 :** గృహ నిర్మాణ శాఖపై ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. హౌసింగ్ కింద ఇళ్ల నిర్మాణం వేగాన్ని పెంచాలని అధికారులను సీఎం ఆదేశించారు. ఇందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. గడిచిన అక్టోబరులో 7.43 లక్షల ఇళ్లను ఇప్పటికే మహిళలకు అందించామని అధికారులు సీఎంకు తెలిపారు. ఫిబ్రవరి నాటికి మరో 5 లక్షల ఇళ్లు పూర్తి చేసే దిశగా ముందుకు సాగుతున్నామని అధికారులు చెప్పారు. వీటికి సంబంధించిన పనులు చాలా చురుగ్గా సాగుతున్నాయని వెల్లడించారు. కాలనీల్లో మౌలిక సదుపాయాలపై నిరంతరం పర్యవేక్షణ జరపాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ఎక్కడ ఏ సమస్యను గుర్తించినా వెంటనే దాన్ని సరిదిద్దేలా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కరెంటు, తాగునీరు, సోక్ పిట్స్ ఉన్నాయా? లేవా? అన్నవాటిపై ఆడిట్ చేయించాలన్నారు. ఇళ్ల నిర్మాణం కోసం ఇప్పటిరకూ 12,72,143 మంది అక్కచెల్లెమ్మలకు పావలా వడ్డీకే రూ.35వేల చొప్పున రుణాలు అందించామన్నారు సీఎం జగన్. రూ.4,483 కోట్ల రుణాలు అక్కా చెల్లెమ్మలు అందుకున్నారన్నారు. పావలా వడ్డీ రుణాలపై చెల్లించాల్సిన మిగిలిన వడ్డీ భారాన్ని ప్రభుత్వం భరించనుందన్నారు. ఇప్పటి వరకూ తీసుకున్న రుణాలపై వడ్డీ డబ్బు విడుదలకు సన్నద్ధం కావాలని సీఎం అధికారులను ఆదేశించారు. టిడ్కో ఇళ్ల నిర్మాణంపైనా సీఎం సమీక్ష నిర్వహించారు. టిడ్కో ఇళ్ల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్న సీఎం ఆదేశించారు. లబ్ధిదారులతో ఏర్పాటు చేసిన అసోసియేషన్లు సమర్థవంతంగా పని చేసేలా వారికి తగిన అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వం ఇచ్చిన లక్షల విలువైన ఆస్తిని ఎలా నిర్వహించుకోవాలన్నదానిపై వారికి అవగాహన ఇవ్వాలన్నారు.

# భాస్కర్ రావు ఇంట్లో అధికారుల సోదాలు

- నా దగ్గర డబ్బులు లేవు..
- ఎక్కడైనా ఉన్నట్టు చూపిస్తే మీకే ఇచ్చేస్తా
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే భాస్కర్ రావు



రాష్ట్రంలో శాసనసభ ఎన్నికల వేళ మరోసారి ఐటీ దాడులు కలకలం రేపుతున్నాయి. తాజాగా హైదరాబాద్, నల్గొండ, మిర్యాలగూడలో సోదాలు జరుగుతున్నాయి. మిర్యాలగూడ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి నల్లమోతు భాస్కర్ రావు ఇంట్లో ఆదాయపన్ను శాఖ అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. మిర్యాలగూడలో వైదేహీనగర్‌లోని ఎమ్మెల్యే బంధువు.. కాంట్రాక్టర్, స్థిరాస్తి వ్యాపారి ఇంజం శ్రీధర్ ఇంట్లో సోదాలు చేస్తున్నారు. తెల్లవారుజామున 4 గంటల నుంచే మొత్తం 40 బృందాలు ఏకకాలంలో సోదాలు నిర్వహించగా.. 30 బృందాలు ఒక్క నల్గొండలోనే దాడులకు దిగడం గమనార్హం. ప్రస్తుతం మిర్యాలగూడ ఎమ్మెల్యేగా కొనసాగుతున్న నల్లమోతు భాస్కర్ రావుకు దేశవ్యాప్తంగా వ్యాపారాలున్నట్లు సమాచారం. పలు పవర్?ప్లాంట్లలో ఆయన పెట్టుబడులు కూడా పెట్టినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే భారీగా డబ్బులు నిల్వ చేశారనే ఆరోపణలతో.. అధికారులు తనిఖీలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఎమ్మెల్యే భాస్కర్ రావు బంధువులు, అనుచరుల ఇండ్లలోనూ ఐటీ అధికారులు దాడులు చేస్తున్నారు. రైస్‌మిల్ యజమానులు రంగా శ్రీధర్, రంగా రంజిత్, బండారు కుశలయ్య ఇళ్లలో ఐటీ అధికారుల తనిఖీలు కొనసాగుతున్నాయి. త్రిపురారం మండలం ముకుందాపురం సాల్వెంట్ ఆయిల్ మిల్లులో, నిడవునూరు మండలంలోని శాఖాపురంలో గల భాస్కర్ నివాసంలో కూడా సోదాలు జరుపుతున్నారు. అదేవిధంగా నల్గొండలోని రవీందర్‌నగర్, పాతబస్తీలోనూ దాడులు నిర్వహిస్తున్నారు. మహేంద్ర ఆయిల్ మిల్ యజమాని కందుకూరు మహేందర్ ఇంటితో పాటు.. ఆయనకు చెందిన రైస్ మిల్లు, మరో 7 చోట్ల సోదాలు చేపట్టారు. నల్గొండ రైస్ మిల్లర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడి ఇంట్లోనూ.. హాలియాలోని చిట్టిపోలు యాదగిరి ఇంట్లో, అనుములలోని వజ్రతేజ రైస్ మిల్లులోనూ సోదాలు కొనసాగుతున్నాయి. వేములపల్లిలో బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు.. ఐడీ దాడులపై స్పందించారు. తన బంధువులు, అనుచరుల ఇళ్లలో ఆదాయపన్ను శాఖ సోదాలు జరగలేదని చెప్పారు. ఐటీ అధికారులు ఎవరూ తనను కలవలేదని అన్నారు. రైస్ మిల్లులపైనే దాడులు జరుగుతున్నాయని.. రైస్ మిల్లర్లకు, తనకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. వారితో ఎలాంటి లావాదేవీలు లేవని తెలిపారు. కుట్రలో భాగంగానే తనపై ప్రతిపక్షాల ఆరోపణలు చేస్తున్నాయని మండిపడ్డారు. ఎన్నికల్లో గెలవలేక ఇలాంటి కుట్రలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. తనకు ఎలాంటి కంపెనీలు లేవని.. తన దగ్గర డబ్బులు కూడా లేవని.. ఎక్కడైనా చూపిస్తే మీకే ఇచ్చేస్తానని ఎమ్మెల్యే భాస్కర్ రావు వ్యాఖ్యానించారు. ఇటీవలే పలువురు కాంగ్రెస్ నాయకుల ఇళ్లలో ఐటీ అధికారులు దాడులు నిర్వహించిన విషయం తెలిసిందే. ఖమ్మంలోని పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి నివాసానికి చేరుకున్న ఆదాయపన్ను శాఖ అధికారుల బృందం.. ఏకకాలంలో పొంగులేటి నివాసాలు, కార్యాలయాలపై మూకుమ్మడిగా తనిఖీలు చేశారు. తదుపరి విచారణ కోసం హైదరాబాద్ రావాలని.. పొంగులేటి కుటుంబీకులకు ఆదాయపన్ను శాఖ అధికారులు సూచించారు. హైదరాబాద్‌లో పలువురు కాంగ్రెస్ నాయకుల ఇళ్లలో ఐటీ అధికారులు సోదాలు చేపట్టారు. మహేశ్వరం హస్తం పార్టీ అభ్యర్థి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డితో పాటు బడంగపేట్ మేయర్ పారిజాత నర్సింహ్మారెడ్డి ఇళ్లలో దాడులు నిర్వహించారు.

# నెల రోజుల్లో బోథ్‌ను రెవెన్యూ డివిజన్ చేస్తా

- బీఆర్ఎస్ పార్టీ పుట్టిందే తెలంగాణ కోసం
- రైతుల సంక్షేమం కోసమే రైతు బంధు, రైతు బీమా
- కాంగ్రెస్ వస్తే కచ్చితంగా దళారీల రాజ్యం వస్తోంది
- రాష్ట్రంలో పోడు భూముల పట్టాలను పంపిణీ చేశాం
- ప్రజలు ఆలోచించి అభ్యర్థులకు ఓటు వేయాలి
- బోథ్ ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్



**బోథ్,నవంబర్16 :** బీఆర్ఎస్ చేసిన అభివృద్ధిని ఊరూవాడ వెళ్లి కార్యకర్తలు ప్రజలకు వివరించాలని బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ సూచించారు. ఆనాడు తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ చచ్చుడో అన్నట్లు పోరాటం చేశానని గుర్తు చేశారు. బీఆర్ఎస్ పార్టీ పుట్టిందే తెలంగాణ కోసమని మరోసారి తెలిపారు. నిజామాబాద్ జిల్లా బోథ్ నియోజకవర్గంలో జరిగిన బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్ పాల్గొని.. ప్రసంగించారు. ఈసారి ఎన్నికల్లో బీఆర్?ఎస్ గెలవగానే నెల రోజుల్లో బోథ్‌ను రెవెన్యూ డివిజన్ చేస్తానని సీఎం కేసీఆర్ మాట ఇచ్చారు. రైతులకు 24 గంటల కరెంటు కన్నా 3 గంటల కరెంటు సరిపోతుందని పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి అంటున్నారని విమర్శించారు. రైతుబంధు దుబారా అని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారని ధ్వజమెత్తారు. రైతుల సంక్షేమం కోసమే రైతు బంధు, రైతు బీమా అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ధరణి ని బంగాళాఖాతంలో కలిపేస్తామని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అంటున్నారని సీఎం కేసీఆర్ గుర్తు చేశారు. ఇప్పుడు ధరణిని తీసేస్తే రైతు బంధు, ధాన్యం డబ్బులు ఎలా వస్తాయని ఓటర్లను ప్రశ్నించారు. కాంగ్రెస్ వస్తే కచ్చితంగా దళారీల రాజ్యం వస్తోందని హెచ్చరించారు. ఈ పోర్టల్ వల్ల రైతులు గడప దాటకుండానే ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామని హర్షించారు. అలాగే బీఆర్ఎస్ హయాంలో రాష్ట్రంలో పోడు భూముల పట్టాలను పంపిణీ చేశామని వివరించారు. ప్రజలు ఆలోచించి అభ్యర్థులకు ఓటు వేయాలి. ఎన్నికల్లో ప్రజలు గెలవాలి. అందుకు ప్రజలకు ఉన్న ఏకైక ఆయుధం ఓటు. 1964 ఉద్యమంలో 400 మందిని కాంగ్రెస్ కాల్చి చంపింది. ఆ తర్వాత తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత చెరువుల్లో పూడిక తీసి.. భూగర్భ జలాలు పెంచేందుకు కృషి చేశాం. కానీ కాంగ్రెస్ 58 ఏళ్ల పాలనలో ప్రజలను ఇబ్బందులకు గురి చేసింది. వారి పాలనలో కరెంటు, నీటి కష్టాలు ఉండేవి. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత సాగునీటిపై పన్నును రద్దు చేశామని తెలిపారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం వచ్చి పదేళ్లు అయిందని సీఎం కేసీఆర్ అన్నారు. దేశవ్యాప్తంగా 157 వైద్య కళాశాలలు ఏర్పాటు చేస్తే ఒక్కటి కూడా రాష్ట్రానికి ఇవ్వలేదని దుయ్యబట్టారు. కేంద్రం ఒక్క సైనిక పాఠశాలను కూడా రాష్ట్రానికి కేటాయించలేదన్నారు. శాసనసభ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలిస్తే బోథ్ నియోజకవర్గంలో కుట్టి రిజర్వాయర్‌ను నిర్మిస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ హయాంలో పింఛను రూ.200.. అలాంటి పింఛన్‌ను బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చి రూ.2000 చేసిందని పేర్కొన్నారు.

# యువత భవిష్యత్తుపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం

- యువతకు ఉద్యోగాలు రావాలంటే కేసీఆర్ ప్రభుత్వం పోవాలే
- ఈ ఎన్నికలు తెలంగాణ భవిష్యత్తుకు ముడిపడి ఉంది
- కేసీఆర్ ఉద్యోగం ఊడిపోవడం ఖాయం
- నీళ్లు, నిధులు, నియామకాల ఆకాంక్ష నెరవేర్చలేదు
- రాజ్యసభ సభ్యుడు, బీజేపీ నేత లక్ష్మణ్?



**హైదరాబాద్,నవంబర్16 :** రాజ్యసభ సభ్యుడు, బీజేపీ నేత లక్ష్మణ్ తెలంగాణ ఉద్యమ ఆకాంక్ష.. నియామకాలను చేపట్టడంలో ప్రభుత్వం పూర్తిగా విఫమైందని.. బీజేపీ నేత లక్ష్మణ్ విమర్శించారు. యువత భవిష్యత్తుపై.. రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉందని ఆరోపించారు. సీఎం కేసీఆర్‌ను ఓడించడమే లక్ష్యంగా.. నిరుద్యోగ యువత పనిచేస్తోం దన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలను సీఎం కేసీఆర్ మోసం చేశాడని.. రాజ్యసభ సభ్యుడు, బీజేపీ నేత కె.లక్ష్మణ్ ఆరోపించారు. బీజేపీ మీడియా సెంటర్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పాల్గొన్న లక్ష్మణ్?.. బీఆర్ఎస్‌పై విమర్శలు గుప్పించారు. ఈ ఎన్నికలు తెలంగాణ భవిష్యత్తుకు ముడిపడి ఉన్నవని.. అందుకే విస్తృతంగా ప్రచారం చేస్తున్నామన్నారు. బీఆర్ఎస్‌కు ఓటు వేసేందుకు ఏ వర్గం సిద్ధంగా లేరన్నారు. కేసీఆర్ ఉద్యోగం ఊడిపోవడం ఖాయమన్నారు. నిరుద్యోగ యువతే.. తెలంగాణ భవిష్యత్తుకు ఊపిరి పోయనున్నారని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్‌ను ఓడించడమే లక్ష్యంగా నిరుద్యోగ యువత ప్రచారం చేస్తోందన్నారు. తెలంగాణ ఉద్యమ ఆకాంక్ష.. నీళ్లు, నిధులు, నియామకాలను నెరవేర్చలేదన్నారు. రాష్ట్రంలో వివిధ శాఖల్లో మూడు లక్షలకు పైగా ఉద్యోగ ఖాళీలు ఉంటే.. భర్తీ చేయలేదని దుయ్యబట్టారు. తెలంగాణ ఆవిర్భావం తరువాత.. ఇప్పటివరకు గ్రూపు-1 పరీక్ష నిర్వహించలేదన్నారు. రాష్ట్రంలో ఉపాధ్యాయులు లేక ప్రభుత్వ పాఠశాలలు మూతపడ్డాయని.. ఉద్యోగాల భర్తీ చేయకుండా ఉన్న ఉద్యోగాలను ఊడదీశారని విమర్శించారు. రాజకీయ పరమైన ఉద్యోగాలను మాత్రం క్రమబద్ధీకరించుకున్నారని మండిపడ్డారు. కేసీఆర్ కుమార్తె కవితను ప్రజలు ఓడగొడితే.. దొడ్డిదారిన పదవి తెచ్చుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగాలు ఇవ్వని బీఆర్ఎస్‌కు ఎందుకు ఓటు వేయాలని యువత ప్రశ్నిస్తోందన్నారు. నిరుద్యోగ యువత తల్లిదండ్రులు కూడా ఆలోచించాలని.. ఉద్యోగాలు రావాలంటే కేసీఆర్ ప్రభుత్వం పోవాలని పిలుపునిచ్చారు. రెండు వేల ఫించన్ కావాలా.. మీ పిల్లలకు 50వేల జీతాలు కావాలా అని ప్రశ్నించారు. కేసీఆర్‌ను ఓటు ద్వారా రద్దు చేయకపోతే.. పరీక్షలురద్దవుతూనే ఉంటాయని ధ్వజమెత్తారు. భారత రాజకీయ చరిత్రలోనే అబద్ధాల ముఖ్యమంత్రిని ఎక్కడా చూడలేదని ఎద్దేవా చేశారు. అమిత్‌షా రెండు రోజుల పర్యటన నిమిత్తం తెలంగాణకు వస్తున్నారని..గద్వాల్, వరంగల్, మెదక్ సభల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. అనంతరంఎమ్మార్పీఎస్ నాయకులతో ప్రత్యేకంగా సమావేశం అవుతారని తెలిపారు. ప్రభుత్వానికి పదేళ్ల నుంచి గుర్తుకురాని రేషన్ కార్డు ఇప్పుడు గుర్తుకు వచ్చిందా? అని ప్రశ్నించారు. పదేళ్ల నుంచి ఒక్క రేషన్ కార్డు ఇవ్వని మీకు.. ప్రజలు ఎందుకు ఓటు వేయాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓట్ల కోసం కొత్త రేషన్ కార్డులు ఇస్తామంటూ.. అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారన్నారు. "తెలంగాణ ఉద్యమ ఆకాంక్ష.. నియామకాలను చేపట్టడంలో ప్రభుత్వం పూర్తిగా విఫమైంది. యువత భవిష్యత్తుపై.. రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉంది. రాష్ట్రంలో వివిధ శాఖల్లో మూడు లక్షలకు పైగా ఉద్యోగ ఖాళీలు ఉంటే.. భర్తీ చేయలేదు. సీఎం కేసీఆర్‌ను ఓడించడమే లక్ష్యంగా.. నిరుద్యోగ యువత పనిచేస్తోందన్నారు.

# యూపీలో దొంగల దారుణం

## మహిళపై గ్యాంగ్ రేప్, సిగరెట్లతో కాలుస్తూ అఘాయిత్యం

**బిజ్నోర్,నవంబర్16 :** ఉత్తర్ ప్రదేశ్‌లో దారుణం జరిగింది. మహిళపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. మంగళవారం రోజు ఓ వ్యాపారి ఇంటిని దోచుకోవడానికి వచ్చిన దొంగలు అతని భార్యను కట్టేసి గ్యాంగ్ రేప్‌కి పాల్పడటమే కాకుండా సిగరెట్లతో దారుణంగా హింసించారు. ఈ ఘటనపై పోలీసులు విచారణ ప్రారంభించారు. వివరాల్లోకి వెళ్తే.. యూపీలోని బిజ్నోర్‌లో ఘటన చోటు చేసుకుంది. హార్డ్‌వేర్-పెయింట్ వ్యాపారం చేసే ఓ వ్యక్తి తన తల్లి, పిల్లలతో కలిసి మెడిసిన్స్ కొనుగోలు చేయడానికి బయటకు వెళ్లిన సమయంలో ఈ దారుణం చోటు చేసుకుంది. ఐదుగురు వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి అల్మారాలను పగలగొట్టి బంగారు ఆభరణాలు, రెండు కిలోల వెండి, రూ.1.5 లక్షల విలువైన నగదును దోచుకున్నారు. మహిళను ఓ గదిలో రాత్రి 7.30 గంటల ప్రాంతంలో ఇంటి పైకప్పు నుంచి దొంగలు ఇంట్లోకి ప్రవేశించినట్లు వ్యాపారి తన ఫిర్యాదులో పేర్కొన్నాడు. తన భార్యను కొట్టడవంతో పాటు ఆమెను బం ధించి, స్పృహ తప్పేలా చేశారని, సామూ హిక అత్యాచారం చేసి, సిగరెట్లతో కాల్చారని ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై కేసు నమో దు చేసి మహిళను వైద్య పరీక్షల నిమిత్తం పంపినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై మూడు టీంలతో నిందితులను పట్టుకు నేందుకు వెతుకుతున్నట్లుఎస్పీరామ్అర్జ్ తెలిపారు.

# జర్మనీ వ్యాప్తంగా భారీగా సోదాలు

## ఇస్లామిక్ సంస్థలు, హిజ్బుల్లా టార్గెట్‌గా సోదాలు

**హాంబర్గ్,నవంబర్16 :** ఇటీవల కాలంలో యూరప్ లోని పలు దేశాల్లో ఇస్లామిక్ తీవ్రవాదం చాపకింద నీరులా పెరుగుతోంది. ఇజ్రాయిల్-హమాస్ యుద్ధ నేపథ్యంలో పలు దేశాల్లో ఆందోళన కార్యక్రమాలు జరుగుతున్నాయి. ముఖ్యం యూదులకు వ్యతిరేకంగా, పాలస్తీనా, హమాస్‌కి మద్దతుగా భారీ ర్యాలీలను నిర్వహిస్తున్నారు. ఇవి ఆయా దేశాల్లో హింసకు దారి తీస్తున్నాయి. ముఖ్యంగా బెల్జియం, జర్మనీ, ఫ్రాన్స్, యూకేల్లో ఇలాంటి ప్రో పాలస్తీనా నిరసనలు ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయి. ఇదిలా ఉంటే ఇరాన్ మద్దతు ఉన్న హిజ్బుల్లా గ్రూపుతో అనుమానిత సంబంధాలు ఉన్నాయనే ఆరోపణల నేపథ్యంలో జర్మనీ వ్యాప్తంగా గురువారం భారీ సోదాలు జరిగాయి. దేశంలోని వివిధ ప్రాంతాల్లో పోలీసులు రైడ్స్ చేశారు. ఇజ్రాయిల్-హమాస్ యుద్ధం నేపథ్యంలో యూదు వ్యతిరేకతను అరికట్టేందుకు జర్మనీ ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోంది. ఇజ్రాయిల్‌పై హమాస్ ఉగ్రవాదులు అక్టోబర్ 7న జరిపిన దాడి తర్వాత జర్మనీలో హమాస్ కార్యకలాపాలతో పాటు సంబంధిత సంస్థలపై అక్కడి ప్రభుత్వం నిషేధం విధించింది.

# 24 గంటల్లో బంగాళాఖాతంలో "మిధిలి తుఫాన్"

## బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం

**అమరావతి,నవంబర్16 :** బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం మరో 24 గంటల్లో తుఫానుగా మారుతుందని భారత వాతావరణ శాఖ(ఐఎండీ) తెలిపింది. తుఫానుగా మారిన తర్వాత బంగ్లాదేశ్ లో తీరం దాటే అవకాశం ఉందని వెల్లడించింది. బలమైన అల్పపీడనం ఉత్తర-ఈశాన్య దిశగా గంటకు 17 కిలోమీటర్ల వేగంతో కదులుతోందని, ఇది తుఫానుగా మారిన తర్వాత 'మిధిలీ'గా పేరు పెట్టనున్నట్లు ఐఎండీ తెలిపింది. ఈ పేరున మాల్దీవులు సూచించింది. మిధిలీ తుఫాన్ శనివారం ఉదయం బంగ్లాదేశ్ లోని ఖేపుపరా, మోంగ్లా మధ్య తీరాన్ని తాకే అవకాశం ఉంది. గురువారం ఉదయం 8.30 గంటలకు ఆంధ్రప్రదేశ్ లోని విశాఖపట్నానికి తూర్పు-ఆగ్నేయంగా 390 కిలోమీటర్లు, ఒడిశాలోని పారాదీప్‌కి దక్షిణం ఆగ్నేయంగా 320 కిలోమీటర్ల దూరంలో తుఫాన్ వ్యవస్థ కేంద్రీకృతమై ఉన్నట్లు ఐఎండీ తన ప్రకటనలో తెలిపింది. ఇదిలా ఉత్తర-ఈశాన్య దిశగా కదులుతూ.. 24 గంటల్లో తుఫానుగా బలపడి బంగ్లాదేశ్ తీరాన్ని మోంగ్లా, ఖేపుపరా మధ్య 60-70 కిలోమీటర్ల వేగంతో దాటే అవకాశం ఉందని, తెల్లవారుజామున 80 కి.మీ వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది. తుఫాను ప్రభావంతో ఒడిశాలోని అనేక ప్రాంతాల్లో, ముఖ్యంగా తీరప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తాయని, గంటకు 40 కి.మీ నుంచి 70కి.మీ వేగంతో గాలులు వీస్తాయని ఐఎండీ తెలిపింది. పశ్చిమబెంగాల్ లోని కోస్తా జిల్లాల్లో గురు,శుక్ర వారాల్లో, ఉత్తర ఒడిశాలోని కోస్తా జిల్లాల్లో గురువారం భారీ వర్షాలు పడే అవకాశం ఉందని చెప్పింది. నాగాలాండ్, మణిపూర్, మిజోరాం, త్రిపుర, దక్షిణ అస్సాం, తూర్పు మేఘాలయ ప్రాంతాల్లో గురువారం నుంచి శనివారం వరకు తెలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉంది. సముద్రం అల్లకల్లోలంగా ఉండటంతో మత్స్యకారులు శనివారం వరకు సముద్రంలోకి వెళ్లవద్దని సూచించింది. ప్రస్తుతం ఉన్న నమూనాల ప్రకారం తుఫాన్ బంగ్లాదేశ్ తీరం వైపు కదులుతున్నట్లు ఐఎండీ తెలిపింది.

## తూర్పుగోదావరి జిల్లాలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు

### ఎస్సీ యువకుడు మహేంద్ర ఆత్మహత్య..

### హెూం మంత్రి రాకను అడ్డుకున్న స్థానికులు

**తూర్పుగోదావ,నవంబర్16 :** బుధవారం ఎస్సీ యువకుడు మహేంద్ర ఆత్మహత్య తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం దొమ్మేరులో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. దొమ్మేరులో బుధవారం ఎస్సీ యువకుడు మహేంద్ర ఆత్మహత్య చేసుకోగా.. కుటుంబసభ్యులను పరామర్శించేందుకు హెూం మంత్రి తానేటి వనిత వచ్చారు. హెూం మంత్రి రాకను తీవ్రంగా వ్యతిరేకించిన స్థానికులు అడ్డుకునేందుకు భారీగా చేరుకున్నారు. దీంతో పోలీసులు పెద్ద సంఖ్యలో మోహరించి స్థానికులను నిలువరించేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో రెండు వర్గాల మధ్య తీవ్ర వాగ్వాగం చోటుచేసుకుంది. హెూం మంత్రి రాజీనామా చేయాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ప్రభుత్వం, హెూం మంత్రి వనిత, పోలీసుల తీరుపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్సీ యువకుడు మహేంద్ర.. పోలీసులు తన పట్ల వ్యవహరించిన తీరు పట్ల తీవ్ర మనస్తాపం చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. ప్రాణాపాయస్థితిలో ఉన్న యువకుడ్ని విజయవాడ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మరణించాడు. దొమ్మేరులో వైసీపీకి చెందిన ఓ ఫ్లెక్సీ చిరిగిపోయిన వివాదంలో.. ఎస్సీ యువకుడు మహేంద్రను పోలీసులు స్టేషన్‌కు తీసుకెళ్లారు. పొలం పనులు చేసుకుంటున్న సమయంలో అక్కడికి చేరుకున్న పోలీసులు.. సీఐ రమ్మంటున్నారని చెప్పి.. యువకుడ్ని స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఫ్లెక్సీ వివాదంతో సంబంధం లేదని చెప్పినా.. సాయంత్రం వరకూ స్టేషన్‌లోనే ఉంచారు. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన మహేంద్ర.. పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. స్థానిక ఆస్పత్రుల్లో చికిత్స అనంతరం.. మెరుగైన వైద్యం కోసం విజయవాడ ఆస్పత్రికి మహేంద్రను తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ.. యువకుడు మృతిచెందాడు. యువకుడి మృతదేహాన్ని తీసుకుని పోలీసులు తెల్లవారుజామున దొమ్మేరుకు తీసుకురాగా.. స్థానికులు పోలీసులపై ఆగ్రహంతో విరుచుకుపడ్డారు. సీసాలు, రాళ్లతో దాడికి దిగారు. దీంతో పోలీసులు అక్కడి నుంచి పరుగులు తీశారు. ఈ క్రమంలో ఏఎస్పైకు గాయాలయ్యాయి. పోలీసుల వ్యవహారశైలి వల్లే మహేంద్ర మృతిచెందాడని కుటుంబసభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మృతుడి కుటుంబసభ్యులను తెలుగుదేశం, జనసేన నాయకులు, ప్రజాసంఘాల నేతలు పరామర్శించారు. వైసీపీ పాలనలో ఎస్సీ లపై జరుగుతున్న దాడులు, అరాకచంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ క్రమంలోనే బాధిత కుటుంబాన్ని పరామర్శించేందుకు హెూం మంత్రి తానేటి వనిత, మంత్రి మేరుగ నాగార్జున దొమ్మేరుకు రాగా.. వారి రాకను స్థానికులు.. ముక్తకంఠంతో తీవ్రంగా ఖండించారు. గ్రామంలోకి వారిని రానివ్వబోమని.. అడ్డుకునేందుకు భారీ సంఖ్యలో తరలివచ్చారు. పోలీసు బలగాలు భారీగా చేరుకుని.. స్థానికులను నిలువరించేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో తీవ్ర వాగ్వాదం, తోపులాట చోటుచేసుకున్నాయి. మంత్రి మేరుగ నాగార్జున.. స్థానికులు, మృతుడి కుటంబసభ్యులతో మాట్లాడి.. వారికి సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. హెూం మంత్రి వనితపై స్థానికులు తీవ్ర ఆగ్రహెూద్రిక్తులు కావడంతో.. ఆమెను పోలీసులు గ్రామానికి దూరంగానే నిలిపేసి.. ఎస్సీ కాలనీకి వెళ్లనీయలేదు. ఆత్మహత్య చేసుకున్న మహేంద్ర కుటుంబానికి రూ.20 లక్షల పరిహారాన్ని అందజేశారు. మంత్రి మేరుగు నాగార్జున, ఎమ్మెల్యే తలారి వెంకటకృష్ణ ప్రభుత్వం తరఫున మృతుడి కుటుంబానికి రూ.10 లక్షల చెక్కు అందజేశారు. మరో 10 లక్షల రూపాయల చెక్కును ప్రభుత్వ సలహాదారు రాజీవ్ కృష్ణ అందజేశారు.

## మరింత అభివృద్ధికై బీఆర్‌ఎస్‌ను గెలిపించాలి

(మొదటిపేజీ తరువాయి)

వచ్చి నర్సాపూర్ నియోజకవర్గంలో రైతులు మంచి పంటలు పండిస్తరు. వజ్రపు తునకలా తయారవుతుంది. పిల్లుట్ల కాల్వ అయిపోతే నేనొచ్చి కొబ్బరికాయ కొట్టి నీళ్లు తీసుకువస్తాను. ఆ బాధ్యత నాదే అని కేసీఆర్ స్పష్టం చేశారు. కులం, మతం అనే తేడా లేకుండా ముందుకు పోతున్నాం. దౌల్తాబాద్, కాసాలా మున్సిపాలిటీ కావాలని కోరారు. తప్పకుండా చేస్తాం.. అదేమీ గొంతెమ్మ కోరిక కాదు. రంగంపేట మండలం కావాలని కోరారు. దాన్ని తప్పకుండా చేసుకుందాం. కౌడిపల్లికి డిగ్రీ కాలేజీ మంజూరు చేశాం. ఐటీఐ తప్పకుండా మంజూరు చేస్తాం. నర్సాపూర్‌లో చాలా చక్కగా అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయి. మరింత అభివృద్ధి జరగాలంటే బీఆర్ఎస్‌ను గెలిపించాలి. తెలంగాణను బంగారం లాగా కాపాడుకోవాలి అని కేసీఆర్ కోరారు. మదన్ రెడ్డి ఖాళీగా ఉండడు. ఆయన సముచితమైన, గౌరవప్రదమైన పదవిలో ఉంటారు. ఆయన నాకు చిరకాల, పాత మిత్రుడు. ఇవాళ కొత్తగా కాదు. ఆయన ఎమ్మెల్యే కావడానికి నేను ఎన్నో బాధలు పడ్డాను. ఆ విషయాలన్నీ మీకు తెలుసు. సునీతా లక్ష్మారెడ్డి, మదన్ రెడ్డి కలిసి నర్సాపూర్‌ను బ్రహ్మాండంగా అభివృద్ధి చేస్తరు. సునీతా లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతున్నాను అని పేర్కొంటూ కేసీఆర్ తన ప్రసంగాన్ని ముగించారు. అసైన్డ్ భూములపై అసత్య ప్రచారాలు చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులపై ముఖ్యమంత్రి కేసీఆర్ నిప్పులు చెరిగారు. కాంగ్రెసోళ్లు పచ్చి అబద్ధాలు చెప్పటంలో పెద్ద మొనగాళ్లు.. ఈ అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మాల్సిన అవసరం లేదు.. ఇది పూర్తి తప్పుల తడక, అబద్ధం అని కేసీఆర్ స్పష్టం చేశారు. న కాంగ్రెసోళ్లు పచ్చి అబద్ధాలు చెప్పటంలో పెద్ద మొనగాళ్లు. పరంపోగు భూములు, ఎవరికైతే అసైన్‌మెంట్ ఇచ్చామో.. ఎస్సీలు కావొచ్చు, ఎస్టీలు కావొచ్చు, బీసీలు కావొచ్చు. వాటిని గుంజుకుంటున్నాం అని చెబుతున్నారు. ఎవరన్న గుంజుకుంటారా..? ఇంత అబద్ధాలు చెప్పొచ్చునా..? మొన్ననే ఎలక్షన్ల మేం చెప్పినం. మేనిఫెస్టోలో కూడా చెప్పినం. ఈ అసైన్‌మెంట్ ఇచ్చిన భూములకు వారికి అధికారం లేకుండా పోతుంది. మాముళ్లు వారు అయితే అమ్ముకుంటున్నరు.. కొనుక్కుంటున్నరు. వీళ్లకు కూడా కొంతకాలం దాటిన తర్వాత పట్టా ఇవ్వాలని చెప్పినం. దళిత, గిరిజన ఎమ్మెల్యేలు కూడా పట్టాలు ఇవ్వాలని కోరారు. డెఫినెట్‌గా అసైన్డ్ భూములకు పట్టా చేసి హక్కులు వారికే ఇస్తామని మనవి చేస్తున్నా. అవి భూములు ఎవరికి పోవు. ఈ అసత్య ప్రచారాలు నమ్మాల్సిన అవసరం లేదు. ఇది పూర్తి తప్పుల తడక అబద్ధం అని మనవి చేస్తున్నా అని కేసీఆర్ పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకులు ధరణి తీసేస్తాం అని చెబుతున్నారు. మేం చెప్పంగ కూడా మాకు ప్రజలు ఓటేసింద్రు. గ్యారెంటీగా తీసేస్తాం అంటరు. అప్పుడు కేసీఆర్ కూడా చేయగలిగేది ఏం ఉండదు. మీరు ఆలోచన చేయండి. ఇది చిన్నసన్న విషయం కాదు. అరిచేది కాదు. డెఫినెట్‌గా ఇది చాలా సీరియస్ మ్యాటర్. పదేండ్ల నుంచి మేం కష్టపడి, మా తలకాయ పగులగొట్టుకొని, మూడు సంవత్సరాలు కష్టపడి ధరణి తెచ్చాం. రైతుల భూములు సేఫ్‌గా ఉండాలి.. ఈ జుట్లు ముడేసి పంచాయితీ పోవాలని ధరణికి రూపకల్పన చేశాం. లేకపోతే ఇవాళ భూముల ధరలు ఎంత పెరిగినయి తెలంగాణలో. ఇవాళ పెరిగిన ధరలకు ఎన్ని హత్యలు, కొట్లాటలు అయితుండే. ఎన్ని తలకాయలు పగిలిపోతుండే. ఎంత సీరియస్ మ్యాటర్ అయితుండే. ఈ విషయం మీరు ఆలోచించాలి. ఇవాళ మీరు దరఖాస్తు పెట్టకుండా, ఏ ఆఫీసు చుట్టు తిరగకుండా నేరుగా మీ ఖాతాలో డబ్బులు పడుతున్నాయి. వడ్లు అమ్మితే కూడా నేరుగా మీ ఖాతాలో డబ్బులు జమ అవుతున్నాయి. ఇంత మంచి సదుపాయం వస్తే, వాళ్లు ఉన్ననాడు చేయ చేతకాలేదు. వారికి తెలివిలేదు. ఇవాళ మేం చేస్తే దాన్ని తీసేస్తాం అంటున్నారు. కాంగ్రెస్ ఆలోచన సరళి ఈ విధంగా ఉంది. ఏది కావాల్నో మీరు నిర్ణయించాలి అనికేసీఆర్ ప్రజలకు సూచించారు.

## కేసీఆర్, మల్లారెడ్డి- తోడు దొంగలు

(మొదటిపేజీ తరువాయి)

పాల్పడుతున్నారు. మేడ్చల్‌కు.. రాష్ట్రప్రభుత్వం తెస్తామన్న ఐటీ పార్కు ఎక్కడికి పోయింది. ఇక్కడి ప్రజలకు కేసీఆర్ ఇచ్చిందేంలేదు.. జవహర్‌నగర్ డంపింగ్ యార్డే. తెలంగాణను ఆగం చేసిన కేసీఆర్‌ను పొలిమేరలు దాటే వరకు తరమాలని అన్నారు. మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కేసీఆర్.. ఏ హామీని నెరవేర్చలేదు. మంత్రి మల్లారెడ్డి ఇంజినీరింగ్? కాలేజీలకు, విశ్వవిద్యాలయానికి అనుమతి ఇచ్చాడు.. కానీ మేడ్చల్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు మాత్రం అనుమతి ఇవ్వలేదు. ఎందుకుంటే పేద పిల్లలు చదువుకుని.. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తారని కేసీఆర్‌కు భయం పట్టుకుందని అన్నారు.

## బీఆర్ఎస్, కాంగ్రెస్ దొందు దొందే

(మొదటిపేజీ తరువాయి)



కేసులు పెట్టారు. కాంగ్రెస్ పార్టీ నేతలు ఎవరికోసమైనా కొట్లాడి జైలుకు పోయారా? బీసీ ముఖ్యమంత్రి డిక్లరేషన్ చేసి బిజేపి సంచనం సృష్టించింది. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కోసం బిజేపి గెలవాలి. కేసీఆర్ దారుసలాంకు సలాం చేయడు దారుకే సలాం చేస్తాడు. మైనారిటీలను కాంగ్రెస్, బీఆర్ఎస్ మోసం చేశాయి. ఓటు బ్యాంకుగానే వారిని చూస్తున్నారు. హిందుత్వాన్ని కాపాడుకోవాలి, హిందు ధర్మం కాపాడుకోకపోతే పెను ప్రమాదం తప్పదు. రాష్ట్రంలో బిఆర్ఎస్ రజాకార్ల పాలన కొనసాగుతోంది.. కేసీఆర్ నిజాం నిరంకుశ పాలనకు చరమగీతం పాడాలి.' అని బండి సంజయ్ వ్యాఖ్యానించారు.

# ధరణితో రైతులకే అధికారం ఇచ్చాం

- కాంగ్రెస్ వస్తే మళ్లీ పట్వారీ వ్యవస్థ తప్పదు
- పైరవీకారులు, దళారులు కూడా వస్తారు
- మీ భూములను కాపాడుకుంటారా లేదా
- ఏ పార్టీ అయితే మేలు చేస్తుందో ఆలోచించాలి
- నిజామాబాద్ ప్రచారంలో సిఎం కెసిఆర్



**నిజామాబాద్,నవంబర్16 :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన ధరణి పోర్టల్‌తో రైతుల భూములు సేఫ్‌గా ఉన్నాయని ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. మీ భూములను కాపాడుకునేందుకు మీ బొటనవేలికే ప్రభుత్వం అధికారం ఇచ్చిందని.. మరి ఈ అధికారాన్ని మీరు కాపాడుకుంటారా.. కాంగ్రెస్‌కు అప్పజెప్పి పొడగొట్టుకుంటారా.. అని కేసీఆర్ ప్రశ్నించారు. నిజామాబాద్ రూరల్ నియోజక వర్గంలో ఏర్పాటు చేసిన ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్ పాల్గొని ప్రసంగించారు. ధరణి పోర్టల్ వల్ల రైతుల భూములు సేఫ్‌గా ఉన్నాయి. మీ భూములను కాపాడుకునేందుకు మీ బొటన వేలికి అధికారం ఇచ్చింది ప్రభుత్వం. మీ భూమి హక్కు మార్చే అధికారం ముఖ్యమంత్రికి కూడా లేదు. ఈ అధికారం ప్రభుత్వం మీకు ఇచ్చింది. ఈ అధికారాన్ని మీరు కాపాడుకుంటారా..? కాంగ్రెస్‌కు అప్పజెప్పి పొడగొట్టుకుంటారా..? మీరు నిర్ణయం చేయాలి. రైతుబంధు డబ్బులు ఎలా వస్తున్నాయి.. మేం హైదరాబాద్‌లో విడుదల చేస్తే సెల్‌ఫోన్లు టింగ్ టింగ్‌మని మోగుతున్నాయి. బ్యాంక్‌కు వెళ్లి చూస్తే డబ్బులు మీ ఖాతాలో ఉంటున్నాయి. ఆ డబ్బులతో ఎరువులు, విత్తనాలు కొంటున్నారు. మరి ఇవాళ ధరణి ఎత్తేస్తే రైతుబంధు డబ్బులు ఎలా వస్తాయి. ఇవన్నీ పోతే వైకుంఠం ఆటలో పెద్ద పాము మింగినట్టు అవుతది అని కేసీఆర్ అన్నారు. కాంగ్రెస్ రాజ్యం వస్తే మళ్లీ పైరవీకారులు, దళారులు వస్తరు. ఇప్పుడు ఎవరికి లంచం ఇవ్వకుండానే మీ ఖాతాలో డబ్బులు పడుతున్నాయి. కాంగ్రెస్ గవర్నమెంట్ వచ్చుడంటే మళ్లా భూ కబ్జాలు, పైరవీకారులు, పాత రిజిస్ట్రేషన్ పద్ధతి, పడిగాపులు పడి ఉండాలి, పట్టా కోసం ఏడాది తిరగాలి, దానికి ముట్టజెప్పేది ముట్టజెప్పాలి. ఇవన్నీ చూశాం. భూమి అమ్మితే, కొంటే ఆర్డీవో ఆఫీసుకు పోవాలి.. ఇచ్చేటోనికి ఇవ్వాలి. ఇవాళ ఆ బాధ లేదు.. ఇవాళ నిమిషాల్లో మ్యుటేషన్, రిజిస్ట్రేషన్ అయిపోతుంది. బాజప్త వెబ్‌సైట్‌లో వచ్చేస్తుంది. దాన్ని ఎవరూ కూడా కదిరలించలేరు. ఇలాంటి ధరణిని తీసేస్తరట. ఇంత క్లీన్‌గా ఉన్న వ్యవహారం మళ్లీ మురికి కుంటగా కావాల్నా..? ఇది పెద్ద ప్రమాదం. కాంగ్రెస్ పార్టీ వస్తే ఇవన్నీ ఎత్తేస్తామని వాళ్లు కుల్లా చెప్తున్నారు.. నిర్ణయం తీసుకోవాల్సింది ప్రజలు. కాబట్టి చర్చ పెట్టి ఏ పార్టీకి అధికారం ఇస్తే బాగుంటదని ఆలోచించాలి అని కేసీఆర్ సూచించారు. మనం కృష్ణా, గోదావరి నదుల మధ్య ఉన్నాం. కేసీఆర్ కంటే ఎత్తు, దొడ్డుగా ఉన్నోళ్లు సీఎంలు అయ్యారు. కానీ మంచినీళ్ల గురించి ఆలోచించలేదు.. తీసుకురాలేదు. ఎన్ని బాధలు పడ్డాం మంచినీళ్లకు. ఇప్పుడు ఆ బాధ లేదు. ప్రతి ఇంటికి నీళ్లు ఇస్తున్నాం. ఈ మాత్రం పని వారు ఎందుకు చేయలేదు. కేసీఆర్ కిట్ గురించి ఎవరూ ఆలోచించలేదు. గర్భిణులను అమ్మ ఒడి వాహనం ద్వారా ఆస్పత్రికి తీసుకెళ్లి, కాన్పు అయ్యాక మళ్లా ఇంటి దగ్గర వదిలిపెడుతున్నాం. హాస్పిటల్‌కు డబ్బులు కట్టేది పోయి ఉల్టా గవర్నమెంట్ పైసలు ఇస్తుంది. దీంతో పేదలకు బాధ తప్పింది. కంటి వెలుగు ప్రోగ్రాం ద్వారా 3 కోట్ల మందికి పరీక్షలు చేసి 80 లక్షల మందికి కండ్లద్దాలు ఇచ్చాం. ఇవన్నీ మానవీయ కోణంలో చూశాం. సంపద పెరిగిన కొద్ది పంచుకుంటూ పోతున్నాం. ప్రజల సొమ్ము ప్రజలకే చెందాలని చెప్పి ఇన్ని కార్యక్రమాలతో ప్రజల ముందుకు వస్తున్నాం. దయచేసి ఇవన్నీ ఉండాల్నా.. పదేండ్లు పడ్డ శ్రమ వృథా కావాల్నా.. అద్భుతంగా అభివృద్ధి చెందిన ఈ రాష్ట్రంలో మళ్లీ పాత కథనే రావాల్నా..? ఇవన్నీ ఆలోచించాలి అని కేసీఆర్ సూచించారు. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ప్రజల నాయకుడు.. ఆయన ఇండి నిండా ఎప్పుడు చూసినా ప్రజలే ఉంటారని ముఖ్యమంత్రి కేసీఆర్ పేర్కొన్నారు. ప్రజల పనులు చేసిపెట్టే ప్రజా నాయకుడిని భారీ మెజార్టీతో గెలిపించాలని కేసీఆర్ పిలుపునిచ్చారు. ఇక్కడ మంచిప్ప రిజర్వాయర్ పనులు జరుగుతున్నాయి. అది త్వరలోనే పూర్తవుతది. ఇజ్రాయెల్ టెకన్నాలజీతో మూడు ఎకరాలకు ఒక ఔట్‌లెట్ పెట్టి ఈ నీళ్లు తీసుకువస్తాం. ఈ ప్రాజెక్టు కింద బాల్కొండ, నిజామాబాద్ రూరల్ కలిసి ఉంది. అది పూర్తయితే ఈ రెండు నియోజకవర్గాలకు నీళ్లు వస్తాయి. ఆ రిజర్వాయర్ బాధితులు ఉంటే మంచి నష్టపరిహారం ఇద్దాం. ఈ విధంగా అన్ని కార్యక్రమాలు ప్రజల కోసం చేస్తున్నాం అని కేసీఆర్ తెలిపారు. బీడీ కార్మికులకు ఏ ప్రభుత్వం కూడా పెన్షన్ ఇవ్వలేదు. బీడీ కార్మికుల బాధలను కండ్లారా చూశాను. 16 రాష్టాల్లో బీడీ కార్మికులు ఉన్నారు. బీడీ కార్మికులకు పెన్షన్ ఒక్క తెలంగాణలోనే ఇస్తున్నారు. కొత్త వారికి కూడా పెన్షన్ ఇస్తాం. రాష్ట్రం ఏర్పడ్డాక 103 డయాలసిస్ కేంద్రాలు నెలకొల్పాం. గతంలో మూడే సెంటర్లు ఉండే. కిడ్నీ రోగులకు కూడా 2 వేలు పెన్షన్ ఇచ్చి ఆదుకుంటున్నాం. పెన్షన్ అందుకుంటున్న వారంతా పేదోళ్లు కాబట్టి 5 వేలకు పెంచుతామని ఇటీవలే ప్రకటించానని కేసీఆర్ గుర్తు చేశారు. కేసీఆర్ బీమా చేపిస్తాం అని చెప్పినం. అందరికి చేపిస్తాం. గల్ఫ్ వలసపోయిన కుటుంబాలకు కూడా బీమా వర్తింపజేస్తాం. ప్రతి ఒక్కరికి బీమా వస్తది. కులం, మతం, జాతి అనే తేడా లేకుండా అందరూ సమానమని భావించి, ప్రజల అవసరాన్ని బట్టి వాళ్లకు చేసుకుంటూ పోతున్నాం. ఈ విధంగా మంచి పద్ధతుల్లో రాష్ట్రాన్ని ఒక దరికి తెచ్చాం. మరి దాన్ని కాపాడాల్సిన అవసరం ఉంది. ఒక్క కేసీఆరే కొట్లడడు. మీరు కూడా కొట్లాడాలి. ఈ ఎలక్షన్లనో మీరే కొట్లాడాలి అని కేసీఆర్ పిలుపునిచ్చారు. వాళ కాంగ్రెస్ మాటలు నమ్మి మోసపోవద్దు జాగ్రత్తగా ఆలోచించి ఓటేయాలి. గోవర్ధన్ ప్రజల నాయకుడు. ఆయన ప్రజా ఎమ్మెల్యే. ఆయన ఇంటి నిండా ఎప్పుడు చూసినా ప్రజలే ఉంటరు. ఎంత మంది వచ్చినా వారి పనులు చేసి పెడుతడు. సీనియర్ నాయకుడు.. మంచి నాయకుడు కాబట్టి పెద్ద మెజార్టీతో గెలిపించాలి. ఆయన కోరినటువంటి పనులను చేసి పెట్టే బాధ్యత నాది. అందులో ఏం ఇబ్బంది లేదు. మంచి నాయకుడిని గెలిపించాలని కోరుతున్నానని కేసీఆర్ కోరారు. కార్యక్రమంలో అభ్యర్థి బాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబు మెడికల్ రిపోర్ట్స్‌పై అనుమానాలు

- గుండె సమస్యంటూ నివేదికను కోర్టుకు సమర్పణ
- అరెస్ట్‌కు ముందు..తరవాత ఘటనపై సజ్జల సందేహాలు



**అమరావతి,నవంబర్16 :** ఏపీ మాజీ సీఎం చంద్రబాబు మెడికల్ రిపోర్ట్సును ఆయన లాయర్లు హైకోర్టుకు సమర్పించారు. అందులో ఆయనకు గుండె సమస్య ఉందని నివేదిక ఉండటంపై ఏపీ ప్రభుత్వం ముఖ్య సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి అనుమానాలు వ్యక్తం చేశారు. చంద్రబాబు మెడికల్ రిపోర్ట్స్ పై తనకు అనుమానాలు ఉన్నాయన్నారు. చంద్రబాబు మెడికల్ బెయిల్ మీద మరింతకాలం ఉండడానికి వీలుగా మెడికల్ రిపోర్టు ఇచ్చినట్టుందన్నారు. ఏఐజీ ఆసుపత్రి రిపోర్టు చూస్తే వైద్యులా, పొలిటికల్ డాక్టర్లా అన్నట్టు కనిపిస్తుందని సజ్జల దుయ్యబట్టారు. పబ్లిక్ లైఫ్‌లో ఉంటారు కనుక ఒక అంబులెన్స్ ఉండాలి అని ఇవ్వడం చూస్తే అర్థం అవుతుందన్నారు. చాలా క్యాజువల్‌గా రిపోర్టు ఇచ్చారన్నారు. అరెస్ట్ కాకముందు సభల్లో... వయసు తనకో సమస్య కాదన్న చంద్రబాబు... అరెస్టయ్యాక వయసు, వ్యాధులను ప్రస్తావించడాన్ని ఏమనాలని సజ్జల ప్రశ్నించారు. చర్మ వ్యాధులను ప్రాణాంతక వ్యాధులన్నట్టు ప్రచారం చేశారన్నారు. పొలిటికల్ లైఫ్ గురించి డాక్టర్లు మాట్లాడటం చూస్తే కామెంట్ చేయక తప్పదన్నారు. కోర్టు వైద్యం చేయించుకోమని బెయిల్ ఇస్తే.. అంబులెన్స్‌తో బయట తిరగమని డాక్టర్లే చెపుతున్నారన్నారు. చంద్రబాబు జైల్లో ఉండాలని మేమేం కోరుకోవట్లేదని.. చంద్రబాబు లోపల ఉంటే మాకేం లాభం లేదన్నారు. చంద్రబాబు బయటకి వచ్చి సంజాయిషీ చెప్పుకోవాల్సిన అవసరం ఉందన్నారు. చంద్రబాబు చేసిన స్కాం ఈ వంకలతో పక్కకి పోతోందన్నారు. పొలిటికల్ అవసరానికి సూడో మెడికల్ వ్యవహారం చేస్తున్నారని అందరూ గమనించాలని సజ్జల కోరారు. కంటికి ఆపరేషన్ చేయించుకున్న తర్వాత రాజకీయ సమావేశాలు పెడుతున్నారని సజ్జల ఆరోపించారు. కంటికి శస్త్రచికిత్స చేయించుకునేందుకు బెయిల్ పొంది రాజకీయ భేటీలు నిర్వహించారు. చంద్రబాబుకు రెగ్యులర్ బెయిల్ వచ్చుంటే ఆయన ఏం చేసినా మేం అడగం. ఇప్పుడు కంటికి శస్త్రచికిత్స చేయకపోతే కళ్లు పోతాయని, చర్మవ్యాధులకు చికిత్స చేయకపోతే గుండె ఆగిపోతుందన్నట్టు నానా యాగీ చేసి బెయిల్ తెచ్చుకున్నారు' అంటూ సజ్జల విమర్శలు చేశారు. కాంగ్రెస్ నేతలు ఓపెన్‌గా టీడీపీ తమతో ఉందని చెపుతున్నారని.. ఒకేసారి ఎంతమందితో సంసారం చేస్తారని విమర్శలు గుప్పించారు. పురంధేశ్వరి చంద్రబాబు అజెండా మాట్లాడుతుందని ఆయన ఆరోపించారు. చంద్రబాబు, పవన్‌కి ఉన్నది ఏపీ ప్రజలను మరోసారి మోసం చేయగలమనే బరితెగింపు మాత్రమేనన్నారు. ప్రభుత్వం, జగన్‌లపై ఆరోపణలు చేస్తే వాటిపై ప్రశ్నలకు సమాధానం చెప్పక్కర్లేదనే బరితెగింపు అని ఆరోపించారు. ఇలాంటివి చూసినప్పుడు సహజంగానే ఏదో ఒకటి అంటారు. ఏదైనా అంటే మాత్రం బుద్ధుడు అంతటివాడ్ని పట్టుకుని మాటలు అంటారా అని కోపాలు వస్తాయని సజ్జల వెటకారం చేశారు. టీడీపీ, జనసేన మేనిఫెస్టో కమిటీ భేటీపైనా సజ్జల విమర్శలు గుప్పించారు. మేనిఫెస్టో కోసం రెండు దేశాల అగ్రనాయకులు లాగా కూర్చున్నారని విమర్శించారు. ప్రజలకు చెవుల్లో క్యాలిఫ్లవర్ పెడుతున్నారా మీ మేనిఫెస్టోతో అంటూ ఎద్దేవా చేశారు.

## ప్రచారంలో మారుతున్న వ్యూహాలు

- కొత్త ఎత్తుగడలతో ముందుకు సాగుతున్న బిఆర్ఎస్
- ప్రముఖులను ఇంటర్వ్యూలు చేస్తున్న కెటిఆర్
- పాజిటివ్ ప్రచారం పొందేలా సరికొత్త ఎత్తుగడలు




**హైదరాబాద్,నవంబర్16 :** ఎన్నికల ప్రచారం దగ్గర పడుతున్న కొద్దీ బిఆర్ఎస్ వ్యూహాలు మారుస్తూ దూసుకుపోతోంది. కెసిఆర్, కేటీఆర్,హరీష్ రావులు ప్రచరాన్ని వేడెక్కిస్తున్నారు. కొత్త తరహా ఇంట ర్వ్యూలతో ప్రజల్లో ఆలోచన కలిగేలా చేస్తున్నారు. తమ భావజాలాన్ని ప్రజల అభిప్రాయంగా మార్చుకునే ప్రయత్నంలో ఉన్నారు. ప్రధాన సమస్యలను పక్కన పెట్టి కేవలం కాంగ్రెస్ వల్ల నష్టం జరగుబోతోందన్న భావవ్యాప్తిని పెంచారు. కాంగ్రెస్ వస్తే కరెంట్ ఉండదన్నది ప్రధాన ఆరోపణగా తీసుకున్నారు. ధరణి లేకుంటే రైతుబంధు రాదన్న భయాలు కలిగిస్తున్నారు. తెలంగాణ అస్థిరతకు కటురలు సాగుతున్నాయని, కెసిఆర్ చేతుల్లోనే తెలంగాణ సురక్షితమని ప్రచారం సాగిస్తున్నారు. తాజాగా రాబోయేది మళ్లీ ప్రాంతీయ పార్టీల పెత్తనమేనని, అందులో బిఆర్ఎస్ భాగస్వామ్యం ఉండబోతోందని ప్రకటిస్తున్నారు. మొత్తంగా ఇప్పుడు వ్యూహాలు మారుస్తూ ప్రచారంలో ముందుకు సాగుతున్నారు. కెటిఆర్ గంగవ్వతో ముచ్చట్లు కాగేనే జయప్రకాశ్ నారాయణ్‌తో చర్చ పెట్టి సెటిలర్లు, మేధావుల ఆలోచనలకు దగ్గర చర్చను నడిపారు. ఇకపోతే యువతోల మాత్రం భరోసా నింపలేక పోతున్నారు. బిఆర్ఎస్ ప్రచారం ద్వార చదువుకున్నవారిలో ముఖ్యంగా తెలంగాణ యువతలో బహిరంగ చర్చకు దారితీస్తున్నాయి. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో సిరి సిల్లకు మూడేండ్లలోనే రైలును తీసుకొస్తానని కెటిఆర్ హామీ ఇచ్చాడు. దాని గురించి ఇప్పటివరకు కేంద్ర ప్రభుత్వాన్నిగానీ, రైల్వే మంత్రినిగానీ కలవనేలేదు. అసలు ఆ ముచ్చటనే ఇంతవరకు తియ్యలేదు. ఈ మధ్య వేములవాడ సిట్టింగ్ అభ్యర్థికి సీటును ఇవ్వకూడదని పార్టీ నిర్ణయించి నప్పుడు కెటిఆర్ ఆ స్థానం నుంచి పోటీ చేసి, సిరిసిల్ల స్థానాన్ని పద్మ శాలి వర్గం వారికి కేటాయిస్తే బాగుండేది. ఇటువంటి కీలక సమయం లోనే రాజకీయ నాయకుల నిజస్వరూపం బయట పడుతుంది. అంటే, బయటికి మాత్రం రాజకీయంగా బీసీలు బలపడాలని అంటారు. కానీ, అటువంటి అవకాశం వచ్చినప్పుడు మాత్రం వారే రాజకీయాలు చేస్తారు. పద్మశాలీలు ఎన్నో సంవత్సరాల నుంచి రాజకీయంగా బలహీనమయ్యారు. కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ ఉద్యమానికి చేసిన సేవలకు గుర్తింపుగా, రాష్ట్రంలో పద్మశాలీలు అధికంగా ఉన్న స్థానాలను వారికే కేటాయించాలని కోరు కుంటున్నారు. అయితే, ఎన్నో తరాల నుంచి అధికారంలోనున్న అగ్రవర్ణాలవారికి తెలుసు, రాజకీయ బలం నిజానికి ఎంత శక్తిమంతమై నదో. అందుకే వారు బీసీలకు అన్నీ ఇస్తారు. కానీ, రాజకీయ సాధికారత మాత్రం ఇవ్వరు. ఎన్నికల ప్రచారంలో ఎంతో బిజీగా ఉండే కేటీఆర్ ఈ మధ్య పనిగట్టుకొని గంగవ్వ 'మై విలేజ్ షో' టీమ్‌ని పొలాల్లో కలిసి, వారితో సరదాగా మాట్లాడుతూ, చికెన్ వండి, వడ్డించి, తిని వచ్చాడు. రాజకీయాల్లో నూతన ఒరవడి అని, నాయకుడంటే ఇలా పల్లె జనాలతో కలిసిపోవాలని బీఆర్ఎస్ పార్టీ వారు పొగడ్తలతో ముంచెత్తారు. కానీ, కేటీఆర్ ఈ వీడియో చేసే బదులు ఉస్మానియా యూనివర్సిటీకి వెళ్ళి నిరుద్యోగులతో ఇంతే సమయాన్ని వెచ్చించి వారి సమస్యలు అడిగి తెలుసుకొని, ఆత్మహత్యలకు పాల్పడవద్దని భరోసానిస్తే ఎంతో బాగుండేదని నిరుద్యోగులు, యువత భావిస్తున్నారు. మేధావులతో సమాలోచనలు చేసి రోజు రోజుకూ తీవ్రమౌతున్న నిరుద్యోగ సమస్య నుంచి ఎలా బయటపడాలో ఒక సమగ్ర ప్రణాళిక రూపొందించి, బీఆర్ఎస్ మేనిఫెస్టోలో పెట్టించడానికి చొరవ చూపితే ఇంకా బాగుండేదంటున్నారు. తెలంగాణ ఏర్పాటైతే దళితుడే ముఖ్యమంత్రి అని పదే పదే చెప్పిన కేసీఆర్ యావత్ తెలంగాణ సమాజాన్ని, దళిత వర్గాన్ని మోసం చేసి తను ముఖ్యమంత్రిగా, తన కొడుకును మంత్రిగా చేసి అధికారాన్ని అనుభవిస్తున్నాడన్న భావన ఇప్పుడు కాంగ్రెస్ ప్రచారంలో సాగుతోంది. కేంద్రంపై నిందలు వేయడమే కార్యాచరణగా పెట్టుకున్న కేసీఆర్, తెలంగాణను అభివృద్ధిలో ముందుకు నడిపించలేకపోయాడన్న విమర్శలకు సమాధానం చెప్పడం లేదు. . మరోవైపు బీఆర్ఎస్ మళ్ళీ అధికారంలోకి వస్తే టీఎస్పీఎస్సీను కేటీఆర్ ప్రక్షాళన చేస్తాననడం హాస్యాస్పదంగా ఉంది.

## కాంగ్రెస్ కావాలా కరెంట్ కావాలా?

(మొదటిపేజీ తరువాయి)



ఉండేదని.. బీఆర్ఎస్ పాలన లో కరెంట్ సమస్య, తాగు నీటి సమస్యలు పరిష్కరించుకున్నామని స్పష్టం చేశారు. వికారాబాద్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ రోడ్ షోలో ఆయన పాల్గొని పార్టీ అభ్యర్థికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వికారాబాద్ నియోజకవర్గ ప్రజలు నాలుగు విషయాలను ఆలోచించాలని కేటీఆర్ కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో వికారాబాద్‌లో ఎవరైనా చనిపోతే.. స్నానం చేయడానికి నీళ్ల కోసం కరెంటు లేదని గుర్తు చేశారు. రేవంత్ రెడ్డికి 24 గంటల కరెంట్ కనిపించడం లేదన్న మంత్రి.. కాంగ్రెస్ నాయకులంతా వికారాబాద్ వచ్చి కరెంటు తీగలు పట్టుకొని చూడాలన్నారు. తెలివి తక్కువ హస్తం నేతల చేతుల్లో రాజ్యం పెట్టొద్దన్న కేటీఆర్.. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం కరోనా వల్ల, కాంగ్రెస్ కేసుల వల్లే జాప్యం అవుతుందని స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే ఎన్నికలు రాగానే కాంగ్రెస్, బీజేపీలు ప్రజలను ఆగమాగం చేస్తాయని కేటీఆర్ విమర్శించారు. ఓటు వేసేటప్పుడు ప్రజలు ఆలోచించాలని సూచించారు. హస్తం పార్టీకి ఇప్పటికే 11 ఛాన్సులు ఇచ్చారని.. అయినా మళ్లీ ఇప్పుడొచ్చి ఒక ఛాన్సు అడుగుతున్నారని ఎద్దేవా చేశారు. 11 అవకాశాలిచ్చినప్పుడు ఏం చేయలేని దద్దమ్మలకు, మరో ఛాన్స్ ఎందుకివ్వాలని నిలదీశారు. కరెంటు కావాలో.. కాంగ్రెస్ కావాలో వికారాబాద్ ప్రజలు ఆలోచించుకోవాలన్నారు.కేసీఆర్ పాలనలో 24 గంటల కరెంట్ ఇస్తున్నాం. కరెంట్‌పై రేవంత్‌కు అనుమానం ఉంటే విద్యుత్ తీగలను పట్టుకోవాలి. కరెంట్‌పై మాట్లాడే అర్హత కాంగ్రెస్ నేతలకు లేదు. గత కాంగ్రెస్ హయాంలో తాగునీటి సమస్య ఉండేది. బీఆర్?ఎస్ పాలనలో కరెంట్ సమస్య, తాగు నీటి సమస్యలు పరిష్కారం అయ్యాయి. ఓటు వేసేటప్పుడు ప్రజలు ఆలోచించాలి. కాంగ్రెస్‌కు 11 ఛాన్సులు ఇచ్చారు.. మళ్లీ ఇప్పుడొచ్చి మళ్లీ ఒక ఛాన్సు అడుగుతున్నారు. కరెంట్ కావాలో.. కాంగ్రెస్ కావాలో ప్రజలు ఆలోచించుకోవాలని అన్నారు. డిసెంబర్ తర్వాత 4 కొత్త పథకాలు వస్తున్నాయని.. కోడళ్లందిరికి రూ.3 వేల సాయం అందిస్తామని కేటీఆర్ పేర్కొన్నారు. తెల్లరేషన్ కార్డుదారులందరికీ సన్నబియ్యం ఇస్తామని తెలిపారు. ప్రతి కుటుంబానికీ రూ.5 లక్షల జీవిత బీమా, రూ.400కే గ్యాస్ సిలిండర్ ఇస్తామన్నారు. తెలంగాణకు ఉన్న ఏకైక గొంతు కేసీఆర్ అని.. ఆయనను ఓడించేందుకు కాంగ్రెస్ దండుపాళ్యం బ్యాచ్ బయల్దేరిందని ఎద్దేవా చేశారు. కర్ణాటకలో కాంగ్రెస్‌ను గెలిపించి రైతులు బాధపడుతున్నారన్న కేటీఆర్?.. మనం ఆ తప్పు చేయొద్దని, డిసెంబర్ 3న కేసీఆర్‌ను గెలిపించుకుందామని పిలుపునిచ్చారు.

# అడుగు దూరంలో ప్రపంచ కప్పు !

నిజంగా ప్రపంచకప్ గెలిచినంత ఆనందంలో దేశ ప్రజలు ఉన్నారు. మనకెప్పుడూ సెమీస్ గండం ఉంటోంది. వరుసగా గత రెండు సెమీస్‌లు న్యూజిలాండ్ చేతిలో ఓటమి చెందడంతో మళ్లీ అదే సీన్ రిపీట్ అవుతుందా అన్న భయం కలిగింది. కానీ రోహిత్ సేన ఉమ్మడి పోరాటం చూస్తే..నిజంగానే కప్పు గెలిచి నంత ఆనందం కలగక మానదు. అంతేనా అంటే..ఈ మ్యాచ్ ఎన్నో రికార్డులను సొంతం చేసుకుంది. మాటల్లో వర్ణించలేని అద్భుతం జరిగిందనే చెప్పాలి. వాంఖేడ్ స్టేడియంలో కోహ్లీ తన 50వ శతకాన్ని బాదాడు. సచిన్ 49వ సెంచరీని అధిగమించేందుకు ఆయన సమక్షంలోనే ఈ సెంచరీ బాదడం ఓ విశేషం. ఇలా 50 శతకాలతో కోహ్లీ రికార్డు సృష్టించాడు. న్యూజిలాండ్‌పై గెలవడం ద్వారా గత రెండు వరల్డ్ కప్‌ల తలరాతను మార్చారు. బౌలర్ షమీ ఏడు వికెట్లు పడగొట్టి మరో రికార్డు సృష్టించాడు. ఈ మ్యాచ్‌లో కోహ్లీ, శ్రేయస్‌లతో పాటు న్యూజిలాండ్ ఆటగాడు మెకల్స్‌న్ కూడా సెంచరీతో అలరించాడు. ఇలా పరుగుల వరద పారడంతో ప్రేక్షకులు ఎక్కడలేని అనుభూతిని పొందారు. వన్డేల్లో సచిన్ అత్యధిక సెంచరీల రికార్డును బద్దలు కొడుతూ కోహ్లి శిఖరాగ్రంపై రారాజుగా కూర్చున్న తీరు ఓ అద్భుతం!తన ప్రదర్శనపై నెలకొన్న సందేహాలకు బ్యాట్‌తోనే సమాధానమిస్తూ శ్రేయస్ మరో మెరుపు శతకంతో జట్టును తిరుగులేని స్థితికి చేర్చిన వైనం మరో అద్భుతం! తన కసిని ఇంకా పెంచుతూ, బంతిని మరింత పదునెక్కిస్తూ కివీస్ బ్యాటింగ్ ఆర్డర్‌ను ఒంటిచేత్తో కూల్చి.. ఓ వన్డేలో ఏడు వికెట్లు పడగొట్టిన తొలి భారత బౌలర్‌గా షమి రికార్డులకెక్కిన దృశ్యం మహాద్భుతం! ఈ అద్భుతాలన్నీ ఒక్కటైతే.. ఏమవుతుందన్నది రోహిత్ సేన గెలచి చూపింది. బ్యాటింగ్‌లో కోహ్లి, శ్రేయస్ శతకాలతో చెలరేగిన వేళ.. బంతితో షమి విజృంభించిన తరుణాన.. టీమ్ఇండియా సగర్వంగా వన్డే ప్రపంచకప్ తుది పోరులో అడుగుపెట్టింది. ఇక కప్పుకు అడుగు దూరంలో నిలిచింది. మన దేశంలో క్రికెట్ అంటే పిచ్చి. గల్లీ నుంచి ఢిల్లీ దాకా అందరూ క్రికెటర్లే. ఈ ఆటకు ఉన్నంత ఆదరణ మరే క్రీడకు ఉండదు. అలాంటిది వరల్డ్ కప్ మహా సంగ్రామం అంటే మాటలా! వరల్డ్ కప్ సాధించాలని.. విశ్వవిజేతగా నిలవాలని ప్రతి జట్టుకు ఉంటుంది. కానీ, అన్ని జట్లకు ఆ అవకాశం దక్కదు. 48 ఏళ్ల వన్డే ప్రపంచ కప్ చరిత్రలో భారత జట్టు ఇప్పటివరకూనాలుగు సార్లు ఫైనల్స్ చేరింది. అందులో రెండింట విజయం సాధించగా.. మరొక దానిలో రన్నరప్‌తో సరిపెట్టుకుంది. 1983లో తొలిసారి సెమీస్‌కు అర్హత సాధించిన టీమిండియా.. ఫైనల్‌లో వెస్టిండీస్‌ను ఓడించి తొలిసారి ప్రపంచకప్‌ను ముద్దాడింది.2003లో సెమీస్‌లో కెన్యాపై భారీ విజయాన్ని అందుకున్న భారత జట్టు.. ఫైనల్‌లో మాత్రం ఆస్ట్రేలియా చేతిలో ఓటమి పాలైంది. 2011లో సెమీస్‌లో దాయాది పాకిస్తాన్ ను మట్టికరిపించిన టీమిండియా.. ఫైనల్‌లో శ్రీలంకను ఓడించి రెండోసారి విశ్వవిజేతగా అవతరించింది. ధోనీ సారథ్యంలో ఈ అపూర్వ విజయం అందుకోవడంతో రెండోసారి జగజ్జేతగా నిలిచాం. 12 ఏళ్ల అనంతరం మరోసారి భారత జట్టు వరల్డ్ కప్ ఫైనల్స్‌లో అడుగు పెట్టింది. ఈసారి మన ప్రత్యర్థి ఎవరో గురువారంజరిగే ఆస్ట్రేలియా – దక్షిణాఫ్రికా మ్యాచ్ తో తేలనుంది. ఈ జట్లలో విజయం సాధించిన జట్టే.. మన ఫైనల్ ప్రత్యర్థి కానుంది.అయితే ఈ వవిజయం అంత తేలిగ్గా దక్కలేదు. ప్రతికూల పరిస్థితులు తప్పలేదు. ప్రత్యర్థి సులువుగా తలవంచలేదు. అయినా పోటీ ఉంటేనే కదా మన సత్తా తెలిసేది. సవాలు ఉంటేనే కదా గెలుపు విలువ పెరిగేది. అందుకే ఈ పోరు చిరస్మరణీయంగా ఈ విజయం నిలిచిందనే చెప్పాలి. ఛేజింగ్‌లో న్యూజిలాండ్ ఓ దశలో గెలుపు ఖాయం అన్నరీతిలో చెలరేగి ఆడింది. స్టేడియంలో కూర్చున్న వారికి, టీవీల ముందు అతుక్కున్న వారికి కూడా ముచ్చెమటలు పట్టించారు. మొత్తంగా మాయ జరిగిందన్న రీతిలో షమీ బౌలింగ్ మాయ చేయడంతో కప్పుకు మరొక్క అడుగే మిగిలింది. ఆదివారం అహ్మదాబాద్‌లోనూ గెలిచేస్తే ప్రపంచకప్‌కు మూడో ముద్దు పెట్టొచ్చు! వన్డే ప్రపంచ కప్ 2023లో భారత జట్టు వరుసగా పదో విజయాన్ని అందుకొని.. ఫైనల్‌లో అడుగుపెట్టింది. కప్ కొట్టేందుకు ఒకే ఒక్క అడుగు దూరంలో నిలిచింది. ఇలా బుధవారం వాంఖడే వేదికగా న్యూజిలాండ్‌తో జరిగిన సెమ్ఫీ÷నైల్ పోరులో బ్యాటింగ్‌లో కోహ్లీ, అయ్యర్.. బౌలింగ్‌లో షమీ వీరోచితంగా పోరాడారు. బ్యాటింగ్‌లో అందరూ రాణించినా.. బౌలింగ్‌లో మాత్రం షమీ వీరోచితంగా పోరాడాడు. ఒకానొక సమయంలో కివీస్ కెప్టెన్ కేన్ విలియమ్సన్(69), డారిల్ మిచెల్(134) మ్యాచ్‌ను తమవైపు తిప్పుకునే ప్రయత్నం చేసినా.. షమీ వారిని దెబ్బకొట్టాడు. ఒకే ఓవర్‌లో కేన్ విలియమ్సన్ (69), టామ్ లాథమ్ (0)ను ఔట్ చేసి మ్యాచ్‌ను మలుపుతిప్పాడు. ఆపై కూడా కట్టుదిట్టమైన బంతులేస్తూ న్యూజిలాండ్ బ్యాటర్లను పెవిలియన్ దారి పట్టించాడు. నిజంగా ఇది షమీ షో అని చెప్పాల్సిందే. ఓ వైపు సిరాజ్ పరుగులు భారీగా ఇస్తున్నా.. షమీ మాత్రం తన వంతుగా కంట్రోల్ చేస్తూనే వచ్చాడు. వరుస విరామాల్లో వికెట్లు తీస్తూ భారత శిబిరంలో ఆనందం నింపాడు. ఈసారి జరిగే ఫైనల్ 140 కోట్ల మంది ఆశలకు ప్రతిరూపం రోహిత్ శర్మ సారథ్యంలోని భారతజట్టు ఆ కలను నెరవేరుస్తుందా లేదా అనేది నవంబర్ 19న తేలనుంది. న్యూజిలాండ్‌పై విజయంతో దేశవ్యాప్తంగా సంబురాలు అంబరాన్నంటాయి. మ్యాచ్ ముగియగానే భారత క్రికెట్ అభిమాను లు వీధుల్లోకి వచ్చి.. జయహో భారత్.. జై భారత్.. అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కొన్నిచోట్ల టపాసులు కాలుస్తూ ఆనందాన్ని పండగగా చేసుకున్నారు. మరోసారి దీపావళి వచ్చిందేమో అన్నట్లుగా దేశం మొత్తం ఆనందంలోకి వెళ్లిపోయింది. అందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఫైనల్స్‌కు చేరిన భారత్ క్రికెట్ జట్టుకు అందరూ శుభాకాంక్షలు చెబుతున్నారు. వీధుల్లో పెద్ద ఎత్తున సంబరాలకు దిగారు కుర్రోళ్లు.. ఈసారి కప్ భారత్ దే అంటూ కేరింతలు కొట్టడం కొసమెరుపు.

# సర్ప పూజకు ఉద్దిష్ట మైనది నాగుల చవితి



(రామ కిష్టయ్య సంగన భట్ల)
94405 95494

కార్తీక శుక్ల పక్ష చవితిని "నాగుల చవితి" అని పిలుస్తారు. ఇది సర్పపూజకు ఉద్దిష్టమైన దినం. కార్తీక శుద్ధ చవితి నాడు నాగవ్రతం చేయాలని చతుర్వర్గ చింతామణి చెపుతున్నది. శ్రీనాధుని శివరాత్రి మహాత్మ్యంలో ఇలా వర్ణింప బడినది. "చలి ప్రవేశించు నాగుల చవితి నాడు, మెరయు వేసవి రథసప్తమీ దివసమున, అచ్చ సీతు ప్రవేశించి బెచ్చు పెరిగి, మార్గశిర పౌష మాసాల మధ్యవేళ". పై గీతాన్ని బట్టి నాగుల చవితి కార్తీక మాసంలో వస్తుందని అర్ధమవు తున్నది. నాగులు, గరుడులు, వానరులు, రాక్షసులు, అసురులు వీరంతా వేరువేరు జాతుల వారంటారు మానవ శాస్త్రజ్ఞులు. అస్సాం దక్షిణ భాగంలో ఉన్న నాగాయ్ కొండలలో ఇప్పటికీ నాగజాతి వారున్నారు. నాగులకు, ఆంధ్రులకు ప్రాచీన కాలమునుండి విశేష సంబంధముంది. భారతావనిలో అనేక ప్రదేశాలలో నాగజాతి వారున్నట్లు చరిత్ర చెపుతున్నది. కాశ్మీర రాజులు తాము కర్కోటక నాగ రాజు సంతతి వారమని చెప్పుకునే వారు. నాగపూరు రాజన్యులు తాము పుండరీక నాగరాజు సంతతికి చెందిన వారమని ప్రకటించు కునే వారు. ఆంధ్రులూ నాగజాతి వారనే వాదన కూడా లేకపోలేదు. బౌద్ధ ధర్మమంటే నాగులకు ఆనురక్తి ఉన్నట్లు, బుద్ధునికి పరమ భక్తులై నాగులు బౌద్ధాన్ని ఆదరించి, అవలంబించారని బౌద్ధ వాఙ్మ యంలో అనేక గాథలు తెలుపు తున్నాయి.ఏలాపత్ర నాగుడు, ముచిలింద నాగుడు మొదలైన వారు బౌద్ధ గాథలలో ప్రసిద్ధులు. దిక్కులను పాలించే లోకపాలకులకు, నాగులకు సంబంధమున్నట్లు బౌద్ధుల విశ్వాసం. అమరావతి, నాగార్జున కొండతో పాటు అవిభక్త కరీంనగర్ జిల్లాలోని ప్రాచీనమైన ధూళికట్ట తదితర ప్రాంతాలలో బౌద్ధ శిల్పాలలో నాగరాజుల, నాగి మల చిత్రాలున్నాయి. ప్రాచీనాంధ్రులు నాగులను కటి ప్రదేశం నుండి పైభాగమంతా మనిషి రూపంలో, క్రింది భాగమంతా సర్ప రూపాలలో చెక్కారు. నాగరాజు చిత్రాలకు తలపైన ఐదు పడగలుంటాయి. నాగినికి ఒక్కటే పడగ. భారతావనిలో నాగపూజ ఆదినుండీ ఆచరణలో ఉంది. గౌతముడు తన గృహ్య సూత్రాలలో పేర్కొనగా యజ్ఞ మంత్రాలలో నాగుల స్తుతి పేర్కొనబడింది. నాగశిలలు, నాగ కల్లులూ, ప్రతిమలు ప్రతి చోట దర్శన మిస్తాయి. పుట్టిన బిడ్డలు చని పోతుంటే సంతానం నిలవడానికి నాగ ప్రతిష్ఠలు చేయడం ఆరాధిం చడం ఆచారంగా ఉంది. పాములు భూమి అంతర్భాగమందు నివసిస్తూ భూసారాన్ని కాపాడే ప్రాణులుగా సమస్త జీవకోటికి "నీటిని" ప్రసాదించే దేవతలుగా తలచేవారు. ఇవి పంటలను నాశనంచేసే క్రిమికీటకాదులను తింటూ, పరోక్షంగా "రైతు" కు పంటనష్టం కలగకుండా చేస్తాయి. అలా ప్రకృతి పరంగా అవి మనకు ఎంతో సహాయ పడుతూ ఉంటాయి. ఆదినుండీ ఆంధ్రులు, నాగారాధకులుగా ఉన్నారు. "నన్నేలు నాగన్న నాకులమునేలు, నాకన్న వారల, నాయింటి వారల, అప్తుల మిత్రుల, నందరను నేలు, పడగ దొక్కిన, పగ వాడనుకోకూ, నడుము దొక్కిన నావాడను కొనుమూ తోక తొక్కిన తొలగుచు పొమ్ము, ఇదిగో! నూక నిచ్చెదను మూకను నాకిమ్ము, పిల్లల మూకను నాకిమ్ము" అని నాగేశ్వరుని ప్రార్థించడం అనవాయితీగా ఉంది. ఐదు తలల పాములను వెండితో గాని, మట్టి తోనైనా చేసి పూజించడం ఆచారం. చెవిలో చీము పట్టినా, వినపడక పోయినా, చెవులను బంగారు, వెండితో చేయించి శివాలయాలకు సమర్పించడం పరిపాటిగా ఉంది. అనంత, వాసుకి, శేష, పద్మనాభ కంబల, కర్కోటక, అశ్వతర, ధృతరాష్ట్ర, శంఖపాల, కాళీయ, తక్షక, పింగళి అని 12రకాల సర్పాలను ఒక్కొక్క నెలలో పూజించడం ప్రాచీన సాంప్రదాయంగా ఉండేది. ప్రపంచంలో శాస్త్రవేత్తలకు తెలిసిన దాదాపు అన్ని రకాల పాములున్న దేశం భారత దేశమే. మానవుని మానసిక శక్తికి హిందూదేశంలో పాము చిహ్నంగా ఉంది. మానసిక శక్తికి వేదాంత పరిభాషలో కుండలినీ శక్తి అని పేరు. నిస్సంగుల తపస్సు అంతా ఈ కుండలినీ శక్తిని లేపుటకే. కుండలినీ శక్తిని గ్రీకు భాషలో "స్పీరిమా" అంటారు. స్పీరిమా అంటే సర్ప వలయం. కుండలినిని సర్పంటైన్ గా పిలుస్తారు. శరీరమనే పుట్టకు తొమ్మిది రంధ్రాలు ఉంటాయి. వాటినే నవరంధ్రాలు అంటారు. మానవ శరీరంలో నాడులతో నిండివున్న వెన్నెముకను ' వెన్నుబాము' అని అంటారు. మూలాధారం నుండి సహస్రారము వరకు వెన్నెముక మధ్యనుండి సర్పాకారముగ కుండలినీ శక్తి అనబడు సుషుమ్నా నాడిని లేవ జూపడమే నాగపూజ ప్రధాన ఉద్దేశమని విజ్ఞుల భావన. కుండలినీ శక్తి మూలాధార చక్రంలో "పాము" ఆకారమువలెనే వుంటుందని "యోగశాస్త్రం" చెబుతోంది. ఇది మానవ శరీరంలో నిదురిస్తున్నట్లు నటిస్తూ... కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలనే విషాల్ని గ్రక్కుతూ, మానవునిలో ' సత్వగుణ' సంపత్తిని హరించి వేస్తూ ఉంటుందని అందుకు నాగుల చవితి రోజున ప్రత్యక్షంగా విష సర్పపుట్టలను ఆరాధించి పుట్టలో పాలు పోస్తే మానవునిలో ఉన్న విషసర్పం కూడా శ్వేతత్వం పొంది, అందరి హృదయాలలో నివసించే ' శ్రీమహావిష్ణువు నకు తెల్లని ఆదిశేషువుగా మారి శేషపాన్పుగా మారాలని కోరికతో చేసే సత్కర్మనే నాగుపాము పుట్టలో పాలు పోయుటలోగల అంతర్యమని భావన.



# బిఆర్ఎస్‌ది తెలంగాణతో పేగుబంధం

## కాంగ్రెస్‌ను చూస్తే ఊసరవెల్లికి కూడా సిగ్గే

## రైతుబంధు లాంటి పథకాలను వద్దంటున్న కాంగ్రెస్

## కోరుట్ల ప్రచారంలో విమర్శలు గుప్పించిన కవిత



**కోరుట్ల,నవంబర్16 :** కాంగ్రెస్ పార్టీని చూస్తే ఊసరవెల్లి కూడా సిగ్గుపడుతుందని, ఆ పార్టీ నాయకులు అన్ని రంగులు మార్చుతారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, జగిత్యాల జిల్లా పరిషత్ చైర్ పర్సన్ దావ వసంత, బీఆర్ఎస్ అభ్యర్థి కల్వకుంట్ల సంజయ్ తో కలిసి ఆమె వెల్లుల్ల గ్రామం, ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ' ప్రభుత్వాలు వస్తుంటాయి. పోతుంటాయి. కానీ తెలంగాణ ప్రజలతో బీఆర్ఎస్ పార్టీది పేగు బంధం. తెలంగాణను పుట్టించింది, రైతు బంధు, బీడీ కార్మికులకు పెన్షన్లు, కల్యాణ లక్ష్మిని ప్రారంభించింది సీఎం కేసీఆర్' అని పేర్కొన్నారు. 'ఎన్నికలప్పుడే రాహుల్ గాంధీ ఢిల్లీ నుంచి వస్తారు. అందుకే ఆయనకు నేను 'ఎలక్షన్ గాంధీ 'అని పేరు పెట్టాను. ఆయన మొహబ్బత్ కా దుకాణ్ (ప్రేమను పంచుతాం) అని హిందీలో అంటే హిందీ రాని రేటెంత రేవంత్ రెడ్డి రాహుల్ దుకాణ్ అంటున్నారని దుకాణం తెరిచి సీట్లన్ని అమ్ముకున్నారని' వ్యాఖ్యానించారు. వచ్చేది సీఎం కేసీఆర్ ప్రభుత్వమేనని ధీమాను వ్యక్తం చేశారు. కేంద్రంలో బీజేపీతో ఒక్క అణాపైసా లాభం జరిగిందా అని ప్రశ్నించారు. తెలంగాణను ఆంధ్రలో కలిపిన పాపం కాంగ్రెస్ పార్టీదేనని ఆరోపించారు. 1969లో తెలంగాణ కావాలని అడిగితే 369 మందిని కాంగ్రెస్ కాల్చిచంపిందని, మనల్ని కష్టపెట్టిన వారికి ఓటేస్తే మోసపోతామని అన్నారు. కేసీఆర్ బీమా పథకాన్ని బీజేపీ నాయకులు అవహేళన చేస్తున్నారని, అటువంటి బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు మనకు అవసరమా అని ప్రశ్నించారు. మంచి చేస్తున్నవాళ్లను కాదని ఇతరుల వైపు చూడవద్దని కోరారు. సీఎం కేసీఆర్ కంటే గొప్పగా ఆలోచన చేసేవారు, పనిచేసేవారు ఎవరూ లేరని స్పష్టం చేశారు. రైతులను అవమానించే రేవంత్ రెడ్డి రైతుల గురించి ఏం ఆలోచన చేస్తారని అన్నారు. ధరణిని బంగాళా ఖాతంలో వేస్తామని, రైతు బంధు రాదని, ధాన్యం కొనుగోలు డబ్బులూ రావని స్పష్టం చేశారు. తెలంగాణ వస్తే కరెంట్ రాదని ఉమ్మడి రాష్ట్రం చివరి ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి అన్నారని, అలాంటి అపోహలను పటాపంచలు చేసి దేశంలోనే తెలంగాణను కేసీఆర్ అగ్రగామిగా నిలిపారన్నారు. తప్పుడు పార్టీకి ఓటేస్తే కరెంటు రాదని, కాంగ్రెస్ పాలిస్తున్న కర్నాటకలో అదే పరిస్థితి నెలకుందని గుర్తు చేశారు. పేద ప్రజల పట్ల ఆలోచన, రైతన్నల బాగు కోసం కృషి చేస్తున్న బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేయాలని పిలుపునిచ్చారు. నీళ్లు, నిధులు, నియామకాలు అన్న నినాదాన్ని సీఎం కేసీఆర్ పూర్తిగా సాకారం చూస్తున్నారని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా 73 లక్షల ఎకరాలకు నేరుగా సాగునీరు అందిస్తున్నామని, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ప్రాజెక్టు పూర్తయితే మరో 50 లక్షల ఎకరాలకు నీళ్లు అందుతాయని వివరించారు.




## సాహితీ ప్రేమికులకు ప్రత్యేకం

'ప్రజా మంటలు" తెలంగాణ జాతీయ దినపత్రికలో రేపటి నుండి ప్రతి రోజు, " నేటి కథ" శీర్షికన ఒక కథను ప్రచురించనున్నామని తెలుపుట కు సంతోషిస్తున్నాం. రచయితలు తమ కథలను mantalukathalu@gmail.com కు పంపవచ్చు...

–ఎడిటర్

# టామీ...సోనీ..!



సోంపూర్ అనే గ్రామంలో చరణ్ అనే విద్యార్థి ఉండేవాడు. తను ఆరవ తరగతి చదువుతున్నాడు. పాఠశాల నుండి ఇంటికి వచ్చిన చరణ్ స్కూల్ బ్యాగును ఇంట్లో వేసి స్నేహితులతో కలిసి మైదానంలోకి ఆడుకోవడానికి వెల్లాడు.చీకటి పడేంతవరకు ఆడుకొని తిరిగి ఇంటికి వచ్చే క్రమంలో దారిలో రోడ్డు దాటుతున్న ఒక తల్లికుక్క కారు కింద పడి ప్రాణాలు కోల్పోతుంది. అక్కడ ఉన్నటువంటి మున్సిపాలిటీ వారు తల్లి కుక్క ను తీసుకెళ్తారు. దాని పక్కనే ఉండి దుఃఖిస్తున్నటువంటి చిన్న కుక్కపిల్లను చూసి ఇంటికి తెచ్చుకుంటాడు చరణ్. చరణ్ తల్లి ఆ కుక్క పిల్లను చూస్తుంది." అరేయ్ చరణ్.. ఈ కుక్కపిల్లను ఎక్కడినుంచి తెచ్చావు? దీనిని ఎందుకు తీసుకొచ్చావు? ఇల్లంతా పాడు చేస్తుంది "అని తల్లి చరణ్ ను కోపగించుకుంటుంది." అమ్మా! నేను ఆటలాడుకుని వస్తుంటే తల్లి కుక్క రోడ్డుపై చనిపోయింది. ఇది ఒంటరిగా ఉంటే చూసి తీసుకొచ్చాను. నీకు తెలుసు కదా నాకు కుక్క పిల్లలు ఉంటే చాలా ఇష్టం అని. దీన్ని నాతో పాటు మన ఇంట్లోనే ఉంచుకుంటానమ్మా.. ప్లీజ్ అమ్మా!" అని తల్లిని బతిమిలాడాడు చరణ్.తల్లికి ఇష్టం లేకపోయినా కొడుకు మీద ప్రేమతో సరే అని ఒప్పుకుంది.చరణ్ దానికి ముద్దుగా టామీ అని పేరు పెట్టాడు.తనతో పాటు పాఠశాల వద్దకు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చేది టామీ. సాయంత్రం పాఠశాల నుండి వచ్చిన చరణ్ తో కలిసి మైదానంలో ఎగిరి గంతలు వేసేది టామీ. ఒకరోజు చరణ్ కు జ్వరం రావడంతో తన చెల్లి సోనీ ఒంటరిగా పాఠశాలకు బయలుదేరింది.అలవాటు ప్రకారంగా సోనీతో పాటు టామీ కూడా బయలుదేరింది. పక్క సందులో నుండి కుక్కల గుంపు సోనీ మీదికి వస్తాయి. అక్కడే ఉన్న టామి ఆ కుక్కలను ధైర్యంగా ఎదిరిస్తుంది. ఆ తామీతో పోరాడలేక కుక్కలు పరుగందుకుంటాయి. పాఠశాలకు వెళ్లిన సోనీ సాయంత్రం తిరిగి ఇంటికి వచ్చి జరిగిన సంగతి అంతా చెబుతుంది." ఈరోజు టామీ నా ప్రాణాలు కాపాడింది అమ్మ. ఉదయం నేను పాఠశాలకు వెళ్లేటప్పుడు కుక్కలు నాపై దాడి చేశాయి. టామీ వాటిని అక్కడి నుంచి తరిమేసింది. అది లేకుంటే నేను చాలా ప్రమాదంలో పడే దానిని అని టామీని దగ్గరికి తీసుకుని ఒళ్లో కూర్చోబెట్టుకుంది సోనీ. ఆ రోజు నుండి తల్లి కూడా టామీ ని ప్రేమగా చూసుకోవడం మొదలుపెట్టింది.చరణ్,సోనీ చాలా సంతోషించారు.

**రచన: భూక్యా గణేష్, 10వ తరగతి**

# ఎన్నికల్లో సాంకేతికత ఫలించేనా !




ఎన్నికల సంఘం వినియోగించే ఆధునిక సాంకేతికత రాజకీయ నాయ కుల ఆగడాలకు కళ్లెం వేసేనా ! ఓటు హక్కు ఉన్న వారికి దిక్సూచి అయ్యేనా ! అయితే ప్రజాస్వామ్యలో ఓటింగ్ పద్దతి గాడిలో పడినట్టే. ఎన్నికల నియమాలకు తిలోదకాలిచ్చి ఇష్టా రాజ్యము గా వ్యవహరించే నాయకులకు సీ విజిల్ యాప్ తో ముక్కు తాడు వేసినట్లే. ఓటర్లను ప్రలోభాలకు గురి చేసినా నిబంధనను పాటించక పోయినా దానికి సంబంధించిన వీడియోల ను చిత్రాలను యాప్ లో నమోదు చేస్తే రెండు గంటల వ్యవధిలోనే చర్యలు తీసుకునే వెసలుబాటు కల్పించడం గొప్ప విషయం అయినా దీని గురించి ప్రజలలో అవగాహన లేదు.పబ్లిసిటీ అంతకన్నా లేదు. దీనిపై ఎన్నికల సంఘం దృష్టి సారించి సోషల్ మీడియా ద్వారా విస్తృతంగా ప్రచారం చేపట్టవలసిన అవసరం ఉంది.అనుమతులు లేకుండా సభలు సమావేశాలు జరిపి న వారి పై ప్రభుత్వం చర్యలు తీసుకున్న దాఖలాలు కనబడవు ప్రధాన ఎన్నికల అధికారి నిర్లక్ష్యం వహించిన అధికార పార్టీ ఒత్తిడికి లొంగి పోయినా ఫలితాలు శూన్యం. కొత్తగా వచ్చిన సువిధ యాప్ తో ఎన్నికల బరి లో దిగిన వారు కార్యాలయానికి వెళ్ళకుండానే సభలు నిర్వహించడానికి అనుమతుల కు అవకాశం కల్పించింది .48 గంటల ముందు ఈ యాప్ లో నమోదు చేయవలసి ఉంటుంది. పోలీస్ రెవెన్యూ ఎన్నికల సంఘం అధికారులకు సువిధ యాప్ లో లాగిన్ సౌకర్యం కూడా కల్పించబడిన ది.. నిభందనలు నియమావళికి అనుగు ణముగా ఉంటేనే అనుమతులు మంజూరు చేయడం విరుద్ధముగా ఉంటే తిరస్కరించడం.కారణాలు సైతం చెప్పడం ద్వారా కొత్త విధానానికి నాంది పలికింది ఎన్నికల సంఘం తీసుకొంటున్న చర్యలు అద్భుతముగా ఉన్న అమలు కు నోచుకుంటా యా అన్నదే అనుమానం . ఓటును ఎలా సద్వినియోగం చెయ్యాలి దాని యొక్క విలువ ఏంటి మొదలైన విషయాల గురించి ప్రజలలో అవగాహన కల్పించాలి ." ఓటు పిచ్చి వాడి చేతిలో రాయి "అయితే ప్రజాస్వామ్యం కుప్పకూలి పోతుంది. దీనిని తీవ్రముగా పరిగణించి ఆచి తూచి సమర్ధవంతమైన అభ్యర్థి కి ఓటు వేయవలసిన అవసరం ఉంది.అభ్యర్థి నేరచరిత్ర ఆస్తుల వివరాలు తెలుసుకోవడానికి ఎన్నికల సంఘం మరో అడుగు ముందు వేసి " నో యువర్ కాండిడేట్ కె.వై సి" ప్రత్యేక వెబ్సైట్ ను రూపొందించడం ముదావహం . నామినేషన్ సందర్భముగా దాఖలు చేసిన ప్రమాణ పత్రాలను ఇట్టి వెబ్సైట్ లో చూసే సౌకర్యం కల్పించారు . ఇది కాకుండా నలుబై శాతం పైగా వైఫల్యం ఉన్న వారికి ఎనుబై ఏండ్లకు పై బడిన వారికి ఇంటి వద్దనుండే ఓటింగ్ లో పాల్గొనడానికి ఈ సీ మొదటి సారి అవకాశం కల్పించడం గమనించదగిన విషయం. సెల్ ఫోన్ లో యాప్ ను డౌన్ లోడ్ చేసుకొని మొబైల్ నంబర్ సహాయముతో రిజిస్టర్ చేసుకొని. ఓ టి పి ఆధారముగా పాస్ వర్డ్ క్రియేట్ చేసుకోవచ్చుపోటీ చేసే అభ్యర్థుల కు వాహనాల వాడుకం కూడా కట్టుదిట్టం చేయడం శుభ పరిణా మం. సుగం యాప్ ద్వారా మాత్రమే అనుమతులు తీసుకోవాలి. రెండు వాహ నాల కన్న ఎక్కువ వాడు కో దల్చుకుంటే అనుమతి తప్పని సరి లేని యెడల వాహనాలు సీజ్ చేయబడు తాయి. ఎలక్షన్ లలో దొరికే నగదు మద్యము డ్రగ్స్ బహు మతులు ఎప్పటి కప్పుడు ఆయా సంస్థలకు అప్పగించడానికి డబ్బును బ్యాంక్ లో డిపాజిట్ చేయడంతో పాటు ఐటి శాఖను సకాలములో అప్రమత్తం చేయడానికి ఎలక్షన్ సీజర్ మేనేజ్మెంట్ సిస్టం అనే యాప్ ను తీసుకొని రావడముతో అభ్యర్థి ఆటలు సాగనివ్వకుండా చేయడం ప్రాధాన్యత సంతరించుకొంది . దీనితో పాటు "ఎలక్ట్రానికల్లీ ట్రాన్స్మిటెడ్ పోస్టల్ బ్యాలెట్ సిస్టం" ప్రవేశ పెట్టడము తో పోస్టల్ బ్యాలెట్ జారీ ప్రక్రియ పారదర్శక మగా నిర్వహించ వచ్చు.ఓటర్లకు సహాయకారిగా ఉండేందుకు మై ఓటర్ హెల్ప్ లైన్ యాప్ ను కూడా ప్రవేశ పెట్టీ ప్రత్యేకతను చాటుకున్నారు. సెల్ ఫోన్ లో డౌన్ లోడ్ చేసుకొని ఓటర్ కార్డ్ నంబర్ నమోదు చేస్తే ఏ పోలింగ్ కేంద్ర ములో ఓటు వేసే అవకాశం ఉందో వివరాలు తెల్సుకోవచ్చు. జాబితా లో పేర్లు ఉన్నాయా లేదా అన్న విషయం తెల్సు కోవచ్చు.ఎన్నికల దీపావళి లో నోట్ల కట్టలను గుట్టలుగా వెదజల్లే అవకాశం లేక పోవచ్చు. ఎన్నికల సంఘం మొదటి సారిగా ఫైనాన్షియల్ ఇంటెలిజెన్స్ యూనిట్స్ ఏర్పా టు చేయడంతో ఆర్థిక అవకతవలను అరికట్ట వచ్చు .అభ్యర్థి ఆస్తులు ఆదాయం అప్పుల చిత్రాల విశ్లేషణ ప్రక్రియ కూడా చేపట్టడం తో అభ్యర్థి ఆగడాలకు కళ్లెం వేసినట్లే అవుతుంది.ఐ టి వారిని రంగం లోకి దించి ఎన్నికల ఖర్చు కేసులు ఆస్తుల పై డేగ కన్ను వేసింది. ఎన్ని కల కమీషన్ గట్టి నిఘా ఏర్పాటు చేయడంతో అభ్యర్థుల్లో ఆందోళన ప్రారంభమైంది.. నగదు వస్తు రూపేణా పంపకాలు చేయాలంటే జంకుతున్నారు. గత ఎన్నికలను దృష్టి లో పెట్టుకొని పకడ్బందీ చర్యలు చేపట్టడముతో ఎన్నికలు సక్రముగా జరిగే అవకాశాలు కనబడుతున్నా యి. ఏది ఏమైనా ఓటర్ల లో నీతి నిజాయితీ ఉండి ఓటును సద్వినియోగంచేసినప్పుడేప్రజాస్వామ్యం బతికి బట్ట కడుతుంది. చట్టాలు నిబంధనలు కఠిన తరం చేసినప్పటికీ ఫలితం శూన్యమే . ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వం లో అవినీతి పెచ్చు పెరిగితే ఆకలి కేకలు అంబరం అంటితే పాలకుల తో పాటు ఓటు వేసిన వారిది కూడా తప్పే ఎందు కంటే అగ్ని కి ఆజ్యం పోసింది ఓటర్లే కావడం విశేషం ఓటు మన భవిత కు పునాది .ఇప్పటికైనా ఓటు హక్కు గలవారు ఆధునిక సాంకేతిక ను ఉపయోగించి ఓటును సద్వినియోగం చేసుకోవాలి "గొర్రెల మందకు తోడేలు ను మాత్రం కాపలా పెట్ట వద్దు. "ఆ మంచి రోజులు వస్తాయని ఆశిద్దాం.

**పూసాల సత్యనారాయణ**
**హైదరాబాద్, 9000792400**

## దండారీ ఉత్సవాల్లో పాల్గొన్న బిఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి డా. సంజయ్ కుమార్



**బీర్ పూర్ నవంబర్ 16 (ప్రజామంటలు):** మండలంలోని చిత్ర వేణి గూడెం గ్రామంలో దీపావళి పండుగ సందర్భంగా నిర్వహించే దండారీ సంబరాల్లో ముఖ్యఅతిథిగ పాల్గొని ఆదివాసీ దేవతలకు ఆదివాసీల సాంస్కృతి సంప్రదాయలతో ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే అభ్యర్థి డా. సంజయ్ కుమార్. ఈ సందర్భంగా సంజయ్ కి ఆదివాసీ ప్రజలు సాంస్కృతి సంప్రదాయంతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో గ్రామ, మండలం ప్రజాప్రతినిధులు,ఆదివాసీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.


## బిఆర్ఎస్ అభ్యర్థి సతీష్ కుమార్‌కు పూలమాలలతో అడుగడుగునా నీరాజనం పలికిన ప్రజలు



**సైదాపూర్ నవంబర్ 16 (ప్రజామంటలు):** సైదాపూర్ మండల్ లోని గ్రామాల్లో బొమ్మకల్, అమ్మనగుర్తి, గుండ్లపల్లె, గోడిశాల మొదలగు గ్రామాల్లో పర్యటించి, బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి సతీష్ కుమార్, బిఆర్ఎస్ పార్టీ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత చేసినటువంటి అభివృద్ధి పనులను ఒక్కొక్కటిగా మండల ప్రజలకు వివరిస్తూ ఇకమీద రాష్ట్రంలో ప్రభుత్వం మళ్లీ మూడవసారి ఏర్పడితే అసంపూర్ణంగా మిగిలినటువంటి అభివృద్ధి పనులను, కార్యక్రమాలను సంపూర్ణంగా పూర్తి చేయడానికి కృషి చేస్తానని, ఈ ప్రభుత్వం మనదేశంలో తెలంగాణలో ఒక్కటే రాష్ట్రంలో ఉందని వేరే రాష్ట్రాలలో వేరువేరు ప్రభుత్వాలు ఏర్పడిన కూడా ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలో సాధించినటువంటి అభివృద్ధి పనులు ఇతర రాష్ట్రాల్లో లేవని, కెసిఆర్ ఒక్కరి తోనే తెలంగాణ లో మళ్లీ బంగారు తెలంగాణ రాష్ట్రం పునరుద్ధరణ చేయాలని, అసంపూర్ణంగా మిగిలి ఉన్న పనులను పూర్తిస్థాయిలో సంపూర్ణం చేసి చూపిస్తారని, కచ్చితంగా ఒక్క కేసీఆర్ తోనే తెలంగాణ రాష్ట్రం పునర్వైభవం స్థితికి చేరి అభివృద్ధి నెలకొల్పుతోందని ఘంటాపరంగా జేజేల ద్వానాలతో ప్రసంగాన్ని కొనసాగించారు. ప్రచారంలో బిఆర్ఎస్ కార్యకర్తలు, పలు నేతలు, వివిధ గ్రామాల సర్పంచులు ఉప సర్పంచులు, ఎంపీటీసీలు, వార్డు సభ్యులతో గ్రామాలలో బిఆర్ఎస్ ఎన్నికల ప్రచారాన్ని విజయవంతం చేశారు.

# చిరు వ్యాపారస్తులకు తైబజార్ రద్దు చేయిస్తాము

### కోరుట్ల కాంగ్రెస్ అభ్యర్థి నరసింగరావు



**కోరుట్ల నవంబర్ 17 (ప్రజామంటలు):** కోరుట్ల ఎమ్మెల్యేగా తనను గెలిపిస్తే కోరుట్ల మెట్పల్లి మున్సిపాలిటీల పరిధిలోని చిరు వ్యాపారస్తులకు తైబజార్ రద్దు చేయిస్తామని కోరుట్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి జువ్వాడి నర్సింగరావు అన్నారు. కోరుట్ల పట్టణంలో జరిగిన చిరు వ్యాపారస్తుల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతూ.... ఈ రెండు మున్సిపాలిటీల పరిధిలో చిరువ్యాపారస్తులను ఇబ్బందులకు గురి చేస్తూ తైబజార్పేరున అధిక డబ్బులు వసూల్ చేస్తున్నారని అన్నారు. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తేవెంటనే ఈ తైబజార్ విధానం రద్దుచేస్తాము అని హామీ ఇచ్చారు కోరుట్లలో గతంలో జువాడి రత్నాకర్ రావు చేసిన అభివృద్ధి తప్ప ప్రస్తుతం ఉన్న ఎమ్మెల్యే 10 సంవత్సరాలలో ఏ ఒక్క అభివృద్ధి కార్యక్రమం చేయలేదని కేవలం తన కుటుంబ అభివృద్ధి కోసం తన కొడుకు ఎమ్మెల్యే టికెట్ పెంచుకోవడం కోసమే తన పదవి కాలం అంతా గడిపాడని అన్నారు. అభివృద్ధి తనకు ఒక్కసారి అవకాశం ఇవ్వాలని అభివృద్ధి అంటే ఏమిటో చూపిస్తామని అన్నారు. చేతి గుర్తు పై ఓటు వేసి తనను అత్యధికమెజారిటీ తో గెలిపించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. అంతకుముందు మాట్లాడిన సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు జువ్వాడి కృష్ణారావు మాట్లాడుతూ.... కల్వకుంట్ల విద్యాసాగర్ రావు నియోజకవర్గాన్ని అభివృద్ధిలో వెనక్కి తీసుకెళ్లాడని గతంలో జువ్వాడి రత్నాకర్ రావు మంత్రిగా పనిచేసిన కాలంలో కోరుట్ల నియోజకవర్గంలో నిర్మించినన్ని ఇల్లు తెలంగాణలోని ఏ నియోజకవర్గంలో కూడా నిర్మించలేదని ఆ సమయంలో కోరుట్ల నియోజకవర్గం అభివృద్ధిలో ప్రథమ స్థానంలో నిలిచిందని కానీ నేడు 119 నియోజకవర్గాల్లో చిట్టచివర ఉన్నది అన్నారు. నియోజకవర్గం అభివృద్ధిలో చివరి స్థానానికి చేరుకుందని దీనికి కారకుడు కూడా ప్రస్తుత ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు అసమర్థతనే కారణమని అన్నారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల పట్టణ చిరు వ్యాపారుల సంఘం అధ్యక్షుడు షాహేద్ మహమ్మద్ షేక్, కోరుట్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొంతం రాజం, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పెరమాండ సత్యనారాయణ గౌడ్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తిరుమల గంగాధర్ ఉపాధ్యక్షుడు నయీమ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్ట్స్ కళాశాలలో ఘనంగా జాతీయ పత్రిక దినోత్సవం



**హన్మకొండ నవంబర్ 16 (ప్రజామంటలు):** జిల్లా లోని కాకతీయ విశ్వవిద్యాలయం ఆర్ట్స్ అండ్ సైన్స్ (సుబేదారి) కళాశాలలోని జర్నలిజం కళాశాల జర్నలిజం విభాగం అధిపతి డాక్టర్.ఆర్. ఆదిరెడ్డి అధ్యక్షతన జాతీయ పత్రిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కళాశాల అర్థశాస్త్ర విభాగం అధ్యాపకుడు, రాష్ట్ర బీసీ సంఘం కన్వీనర్ డాక్టర్ శేషు మాట్లాడుతూ.... ప్రజాస్వామిక వ్యవస్థలో పత్రికా, మీడియా రంగాలు చాలా కీలకమైన పాత్రను పోషిస్తాయని. పత్రికలు సమాజానికి జవాబుదారితనంగా పనిచేయాలన్నారు. నేటి ఆధునిక ప్రపంచంలో పత్రికా వ్యవస్థ ప్రపంచవ్యాప్తంగా ఎంతో ఉన్నతంగా ఎదుగుతుందని, గన్ పవర్ కంటే -పెన్ పవర్ చాలా గొప్పది అన్నారు. ఈ కార్యక్రమంలో డా. ఆదిరెడ్డి మాట్లాడుతూ.... ప్రజాస్వామిక వ్యవస్థకు నాలుగో స్తంభంగా వెలుగొందుతున్న పత్రిక మీడియా వ్యవస్థ సమాజంలో బాధ్యతాయుతంగా పనిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పత్రికా స్వేచ్ఛ కేవలం పత్రిక యాజమాన్యాలు తమ సొంతం అనుకోకుండా పత్రికా వ్యవస్థలో పనిచేస్తున్న ప్రతి కార్మికునికి స్వేచ్ఛ ఉండే విధంగా యాజమాన్యాలు వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. అయితే నేటి ఆధునిక ప్రజాస్వామిక పత్రికలు వాస్తవికతను వార్త రూపంలో పేర్కొనకపోవడం సమాజానికి నష్టం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డా. హరికుమార్, డా. ఐలేశ్వర్, డా. రాంబాబు జర్నలిజం విభాగం విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఈ ఎన్నికల్లో "కొప్పులకు తగిన మూల్యం" తప్పదు

**బుగ్గారం జి.పి.లో తాజాగా రూ.16,163-00 లు రికవరీ**

**రికవరీల మొత్తం రూ.4,58,924 లు అయినా సర్పంచ్ నో - సస్పెండ్**

**అధికారుల అవినీతికి అద్దం పడుతున్న వైనం**

**సర్పంచ్ ని కాపాడుతున్న మంత్రి "కొప్పుల ఈశ్వర్"**

**ఎన్నికల్లో తగిన మూల్యం చెల్లించుకోనున్న "మంత్రి కొప్పుల"**




**బుగ్గారం నవంబర్ 16 (ప్రజామంటలు):** జగిత్యాల జిల్లా బుగ్గారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో జరిగిన దుర్వినియోగం సొమ్ము నుండి తాజాగా మరో రూ.16,163-00 లు రికవరీ అయ్యాయని ఉద్యమ కారుడు చుక్క గంగారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికీ మొత్తం రూ.4,58,924-00 లు రికవరీ చేసిన అధికారులు సర్పంచ్ ని సస్పెండ్ చేయకపోవడం శోషణీయమని అన్నారు. జిల్లా ఉన్నతాధికారులు కూడా అవినీతికి పాల్పడి ఉంటారని అనడానికి ఈ రికవరీల చరిత్రనే అద్దం పడుతుందని ఆయన ఆరోపిస్తూ పలు అనుమానాలను వ్యక్తం చేశారు. బుగ్గారం జి.పి. లో కోటికి పైగా నిధులు దుర్వినియోగం జరిగితే చర్యలు తీసుకోవాల్సింది పోయి సాక్షాత్తు తెలంగాణ రాష్ట్ర సంక్షేమ శాఖల మంత్రి కొప్పుల ఈశ్వర్ తన బాధ్యతలను, ప్రజల సంక్షేమాన్ని మరిచి దొంగలను కాపాడుతున్నాడని చుక్క గంగారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. దుర్వినియోగమైన సొమ్ము రికవరీ కాకుండా, సర్పంచ్ ని, ఇతర బాధ్యులను సస్పెండ్ చేయకుండా మంత్రి కొప్పుల ఈశ్వర్ కాపాడుతున్నాడని చుక్క గంగారెడ్డి ఆరోపించారు. బుగ్గారం జి.పి. నిధుల దుర్వినియోగం పట్ల ప్రస్తుతం జరుగుతున్న ఈ అసెంబ్లీ ఎన్నికల్లో కొప్పుల ఈశ్వర్ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని ఆయన హెచ్చరించారు.

## యాదవ సంఘం అధ్యక్షుడు పోతరబోయిన లింగమూర్తి

### ఆధ్వర్యంలో కాంగ్రెస్ చేరిన బావుపేట యాదవ సంఘం



**ఎల్కతుర్తి నవంబర్ 16 (ప్రజామంటలు):** ఎల్కతుర్తి మండలంలోని బావు పేట్ గ్రామంలో యాదవ కులస్తులు మొత్తం కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు యాదవ సంఘం అధ్యక్షులు పోతారబోయిన లింగమూర్తి, మర్రి పైడయ్య, నాయకులు మేకల సమ్మయ్య, మర్రి శ్రీధర్ (మాజీ) వార్డ్ సభ్యులు, మర్రి రాజేందర్, సబ్బు వెంకటేశ్వర్లు, సబ్బు ఐలయ్య, యాదవ సంఘం యూత్, ఎడ్ల కుమార్, బాషిక రాకేష్, పోతరబోయిన రాజు, ఏళ్ళవుల రాజు, ఎడ్ల రవీందర్, నన్నెబోయిన సారయ్య, మేకల రవీందర్, ఎలబోయిన నాగరాజు, పోతరబోయిన దేవేద్ర, బాషిక మోహన్, పోతరబోయిన తిరుమల యాదవ సంఘం, మహిళ నాయకురాల్లు: మ్యాకల. సుగుణ, పోతరబోయిన. బుచ్చమ్మ, బాషిక. పోచమ్మ, బాషిక. పద్మ, ఎడ్ల రాజమ్మ, కన్నేవెని, ఎల్లమ్మ కాంగ్రెస్ పార్టీలో చేరారు.



## చింతలపల్లిలో జోరుగా దూసుకెళుతున్న కారు ప్రచారం

**ఎల్కతుర్తి నవంబర్ 16 (ప్రజామంటలు):** హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలంలోని చింతలపల్లి గ్రామంలో హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీష్ బాబు గెలుపు కోసం కారు గుర్తుకు ఓటు వేయమని ఇంటింట ప్రచారం జోరుగా చేస్తున్న సురేష్ బిఆర్ఎస్ నాయకులు యువకులు చురుకుగా పాల్గొన్నారు. మండలంలో ఎప్పుడూ ప్రథమ స్థానంలో ఉంటూ హుస్నాబాద్ ఎమ్మెల్యేకు మండలంలోని 19 గ్రామాల కన్నా చింతలపల్లి నుండి భారీ మెజార్టీ ఇస్తామని తెలిపారు. ఈ ప్రచారంలో సర్పంచ్ అనిత రాజు, ఎంపీటీసీ రజిత రవీందర్, మాజీ సర్పంచ్ రాజేశ్వరరావు, సుధాకర్ రావు గ్రామ శాఖ ప్రెసిడెంట్ శివాజీ, మాజీ ప్రెసిడెంట్ రమేష్, వార్డ్ మెంబర్ అనిల్, క్రాంతి, డెంగు రమేష్, శివశంకర్, కార్తీక్, శ్రీనివాస్, నసూర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు సతీమణి ప్రచారం



**మెట్ పల్లి నవంబర్ 16 (ప్రజామంటలు):** మెట్ పల్లి 3వ వార్డులో ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు సతీమణి కల్వకుంట్ల సరోజిన మ్మ తనయుడు బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కల్వకుంట్ల సంజయ్ ని ఎమ్మెల్యేగా గెలిపించాలని ప్రచారం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ....60 ఏళ్ల కాంగ్రెస్ పరిపాలనలో చేయనిది 10 సంవత్స రాల్లో కెసిఆర్ అభివృద్ధి చేశారని నియోజకవర్గంలో కల్వకుంట విద్యాసాగర్ రావు అభివృద్ధి పనులు చేశారని ఇప్పుడు తన కుమారుడిని ఎమ్మెల్యేగా గెలి పించాలని కోరారు. ఈ కార్యక్రమ ంలో మున్సిపల్ చైర్మన్ రానావేణి సుజాత సత్యనారాయణ, కౌన్సిలర్ బర్ల మధులత రమేష్, ఏనుగందుల వనజ, పూజాగిరి లక్ష్మి, ధ్యావనపల్లి వరలక్ష్మి, కో ఆప్షన్ గైని లావణ్య నాయకులు ధ్యావతి అరుణ నారాయణ, జియా, జరుపుల భారతి, గజం రవి, ఓజల శ్రీనివాస్, అరిసెల మురళి, బర్ల దివాకర్, జగదీశ్వర్, శేఖర్, అర్జున్, పలువురు నాయకులు, మహిళలు, పాల్గొన్నారు.

# మారుతున్న రాజకీయ సమీకరణలు

### మంథనిలో చతుర్ముఖ పోటీ

### విజయం వైపు బహు జనుల అడుగులు

### ప్రత్యామ్నాయ నాయకునిగా చల్ల నారాయణరెడ్డి



**భూపాలపల్లి ప్రతినిధి నవంబర్ 16 (ప్రజామంటలు):** మంత్రపురి రాజకీయాలు రోజురోజుకు మలుపులు తిరుగుతున్నాయి. గత ఎన్నికలకు భిన్నంగా ఈ అసెంబ్లీ ఎన్నికలు సాగుతున్నాయి. ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ రాజకీయాలు రాడకందయంలో పడుతున్నాయి. రాజకీయ విశ్లేషకుల అంచనాలకు కూడా అందడం లేదు. తొలిసారి మంథని బరిపై చతుర్ముఖ పోటీ నెలకొంది. ఈ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు అందరూ ప్రజలకు చిరుపరిచితులే కానీ బీఎస్పీ అభ్యర్థి చల్లాకు నాలుగు దశాబ్దాల సుదీర్ఘ రాజకీయ అనుభవం, ప్రజాసేవలో నిరంతరం ఉండే తత్వం ఆయనకు బలాన్ని చేకూర్చే అంశాలుగా మారనున్నాయి. బహుజన్ సమాజ్ పార్టీ ద్వారా మంథనిలో శాసనసభ నియోజకవర్గ అభ్యర్థిగా రంగంలోకి దిగిన చలనారాయణరెడ్డి రోజు రోజుకు బలం పుంజుకుంటున్నారు. ఆయన రాకతో మంథని రాజకీయ ముఖచిత్రం ఉన్నపలంగా మారిందని చెప్పాలి. ఎన్నో రోజుల నుంచి తిష్ట వేసుకున్న ఇక్కడి ఇరు పార్టీల నాయకులు కాసింత కలవరానికి గురయ్యారని నిక్కచ్చిగా చెప్పవచ్చు. ప్రచారంలో ప్రతి మండలంలో ఆయనకి ప్రజలు స్వచ్ఛందంగా వచ్చి ప్రచారం నిర్వహించడం ఒక గొప్ప పరిణామం. ఏనుగు ను ప్రజలకు పరిచయం చేస్తూ మండలాల వారిగా నియోజకవర్గంలో విస్తృతంగా ప్రచారం జరుగుతుంది. ఇదంతా గమనిస్తున్న అధికార పార్టీ నాయకుడు, ఇక్కడ ఎమ్మెల్యేగా అధికారంలో ఉన్న నాయకుడు ఇద్దరు కూడా చలనారాయణరెడ్డిని ఎదుర్కోవడానికి ఎత్తుకు పైఎత్తులు వేస్తున్నారు. 40 సంవత్సరాల సుదీర్ఘ రాజకీయ అనుభవమున్న చల్ల నారాయణరెడ్డి వాటిని తేలికగానే అధిగమి స్తున్నారు. ఇరు పార్టీల నాయకుల పరిపాలన చూసి విసిగిపోయిన ప్రజలు కొత్త నాయకత్వాన్ని కోరుకుంటున్నట్టు స్పష్ట మౌతోంది. ఇలాగే ప్రజల్లోకి దూసుకెళ్తే గనక చల్ల నారాయణరెడ్డి కి తిరుగులేదని చెప్పాలి. మంథని ప్రజలకు కూడా ఒక మంచి నాయకుడిని ఎన్నుకోవడానికి సరైన సమయం అని చెప్పొచ్చు. మంథనిలో కుటుంబ పాలనను చూసి విసిగిపో యిన జనాలు ఆ కుటుంబాన్ని వద్దనుకుంటున్నాయి. ఇలాంటి తరుణంలో ప్రజలకు ఒక ప్రత్యామ్నాయ శక్తిగా చల్ల నారాయణరెడ్డి కనబడుతున్నాడనేది విశ్లేశకుల అంచనా. బహుజనుల అభ్యున్నతి కోసం అహర్నిశలు కష్టపడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సారథ్యంలో బహుజన వర్గాలైన కులాల కోసం ఎన్నో ఏళ్లుగా కష్టపడ్డా చల్ల నారాయణ రెడ్డి బహుజన్ సమాజ్ పార్టీలో చేరి బహుజన కులాలైన బీసీ,ఎస్సీ ,ఎస్టీ కులాలకు దగ్గరయ్యారు. సబ్బండ వర్గాలు ఆయనకు గ్రౌండ్లో బ్రహ్మరథం పడుతున్నాయి. గుడిసె లేని గ్రామాలను చూడడమే తన లక్ష్యం అంటూ, గుడిసెలు లేని నియోజకవర్గంగా మంథని చేస్తానంటూ, అభివృద్ధి అంటే ఏంటో మాటల్లో కాదు చేతల్లో చేసి చూపిస్తానని సవాలు విసురుతూ ముందుకు సాగుతున్నారు. శాసనసభ్యునిగా పోటీలో ఉంటానని ప్రకటించిన తర్వాత ఏ పార్టీ నుండి కూడా నారాయణరెడ్డి కి టికెట్ రావొద్దు అని ఇరుపార్టి ల నాయకులు చేసిన పైరవీలు బెడిసి కొట్టి బహుజన్ సమాజ్ పార్టీని ఎంచుకొని టికెట్ దక్కించుకున్న చల్ల నారాయణ రెడ్డి కి మంథని ప్రజల మధ్యన కలిసి నడిచిన విధానం, ఇన్నాళ్లు వాళ్ళకి కష్టం వచ్చినా, సుఖం వచ్చిన మంచి చెడుకు తానై నడిచిన ఆయన మనస్తత్వం ప్రజల మనసులు గెలిచింది. ఇన్నాళ్లు ఆయన చేసిన ప్రజా పోరాటాలు, ప్రజల పక్షాన నిలిచే తత్వం, అందరినీ కలుపుకు పోయే నైజం ఈ ప్రాంతంలో ఆయనని బలమైన నాయకునిగా నిలిపాయి. ఆ ఇద్దరి నాయకులకు దీటుగా, సమర్ధుడిగాఆ బలమంతా కూడగట్టుకొని, ప్రజా ఆశీర్వాదంతో ముందుకెళుతు న్నాడని చెప్పవచ్చు.

## బిఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసిన చిగురుమామిడి జడ్పిటిసి గీకురు రవీందర్



**చిగురుమామిడి నవంబర్ 16 (ప్రజామంటలు):** కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం జడ్పిటిసి సభ్యులు గీకురు రవీందర్ మరియు మండల పార్టీ ఆవిర్భావ అధ్యక్షులు గునుకుల రాజేశ్వర్ రెడ్డిలు బి అర్ ఎస్ పార్టీకి, పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఈ సందర్భంగా కరీంనగర్ ప్రెస్ భవన్లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో జెడ్పీటీసీ సభ్యులు మాట్లాడుతూ పార్టీ ఆవిర్భం నుండి పని చేస్తూ రెండు సార్లు మండల కేంద్ర సర్పంచ్ గా, సింగిల్ విండో డైరెక్టర్ గా, ప్రస్తుతం జెడ్పీటీసీ సభ్యునిగా ఆదరించి ఆశీర్వదించిన మండల ప్రజలకు పాదాభివందనం తెలిపారు. 15 సంవత్సరాలు మండల పార్టీ అధ్యక్షునిగా తనకు సహకరించిన కార్యకర్తలకు ధన్య వాదాలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకోసం పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగానికి రాజీనామా చేసి 22 సంవత్సరాల కాలం ఉద్యమం కోసం, పార్టీ నిర్మాణానికి కృషి చేసిన తగిన గుర్తింపు లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీలో నిస్వార్థమైన, నిఖార్సుగా పనిచేసిన ఉద్యమ కారులకు కనీస గుర్తింపు, గౌరవం దక్కడం లేదు. ఉద్యమ ద్రోహులకు, పారచ్యూట్ లీదర్లకు, భజన పరులకు, చెంచగిరి చేసేవాళ్లకు ప్రాధాన్యం ఉందన్నారు. బి అర్ ఎస్ లో కార్లు, ఖద్దరు, కరెన్సీ ఉన్నవాళ్లే రాజ్యమేలుతున్నారని, దళిత బహుజన నాయకులకు స్థానం లేదన్నారు. ఉద్యోగాలు లేని నిరుద్యోగ యువత, మహిళా పావలా వడ్డీరుణాలు లేక నిర్వీర్యం అవుతుందన్నారు. రైతు బంధు, రుణమాఫీ పథకాలు లోపభయిష్టమైనవన్నారు. మండలంలో ఒక్క డబుల్ బెడ్ రూం నిర్మాణం కాలేదని, బిసి బంధు చేతివాటం అని, దళిత బంధు ఊసే లేదన్నారు. అభివృద్ధి విషయంలో పక్క నియోజక వర్గాలు సత్వర అభివృద్ధి సాదించాయని, గౌరవెల్లి ప్రాజెక్ట్ పూర్తికాక పోవడానికి, సమగ్ర అభివృద్ధి సాధించక పోవడానికి స్థానిక నాయకుని అసమర్థత కారణమన్నారు. ఈ ఎన్నికల్లో బి అర్ ఎస్ పార్టీ తెలంగాణ పోరాటంలో భాగస్వామ్యులైన సబ్బండ కులాలు, సకల జనులు మరో సామాజిక, ప్రజాస్వామ్య తెలంగాణకు నడుం బిగించాలన్నారు.

## కోరుట్ల ఎమ్మెల్యే అభ్యర్థికి మద్దతుగా

### ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, జెడ్పీ చైర్ పర్సన్ దావ వసంత ప్రచారం




**కోరుట్ల నవంబర్ 16 (ప్రజామంటలు):** కోరుట్ల నియోజకవర్గం ఎన్నికల ప్రచారానికి వచ్చిన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కు జెడ్పీ చైర్ పర్సన్ దావ వసంత స్వాగతం పలికి నియోజక వర్గంలోని మెట్ పల్లి మండల బండలింగాపూర్, వెల్లుల్ల గ్రామాలలో ఎన్నికల ప్రచారంలో బి.అర్.ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సంజయ్, మాజీ ఎమ్మెల్యే విద్యాసాగర్ రావులతో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ మండల ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

prajamantalau daily pages (17-11)_times of varha main (13-2).qxd 11/17/2023 6:21 AM Page 5



## తెలుగు సాహితీరంగంలో ఐదు దశాబ్దాల పాటు నిర్విరామ కృషిచేసిన

# ‘నిజాం వెంకటేశం’



**కుడిఎడమల తేడా లేకుండా**
**అందరినీ ఆదరించిన అభినవ రాయలు**
**సాహితీకారులను నిరంతరం ప్రోత్సహించిన**
**ఆధునిక భోజరాజు నిజాం స్మారక సభ విశేషాలు**







నిజాం వెంకటేశం స్మారక సాహిత్య పురస్కారాల సభ సికింద్రాబాద్‌లోని పద్మారావు నగర్ బెల్వెడేర అపార్ట్‌మెంట్ ప్రాంగణం లో జరిగింది. 14 నవంబర్ నిజాం వెంకటేశం గారి 75వ జన్మదినం సందర్భంగా ఈ పురస్కారాల సభ ఏర్పాటు చేయడం జరిగింది. సాహిత్య విమర్శలో విశేష కృషి చేసిన వారు పంపిన రచనల నుంచి మూడు గ్రంథాలను ఎంపిక చేసి పురస్కారాలను అందజేయడం జరిగింది. యువకవి పురస్కారానికి ఒకరిని, ప్రోత్సాహక పురస్కారానికి మరొకరిని ఎంపిక చేయడం జరిగింది. పురస్కార గ్రహీతలకు తలా ఐదువేల రూపాయల నగదు బహుమతితో పాటు మొమెంటోతో, శాలువతో సత్కరించడం జరిగింది. ఈ సందర్భంగా బి.ఎస్. రాములు గారు రచించిన ‘జీవనగమనం’ రెండు సంపుటాలతో పాటు ‘నాగశాల’ కథల సంపుటిని, ‘కథలబడి’ తదితర ఎనిమిది గ్రంథాలను అవార్డు గ్రహీతలకు బహూకరించారు. ఈ సమావేశాన్ని బి.ఎస్. రాములు, ఎ. గంగారెడ్డి, ఆడెపు లక్ష్మీపతి, డా॥ వింజమూరి సూర్యప్రకాష్, ఎం. శంకరయ్య, నిజాం ప్రశాంత్ కలిసి సంయుక్తంగా నిర్వహించారు. వేదికపై వీరితోపాటు జూకంటి జగన్నాథం, సిహెచ్‌వి. ప్రభాకర్‌రావు పల్పంచుకున్నారు. ఈ సాహిత్య సభకు విచ్చేసినవారిలో ప్రముఖ సాహితీవేత్తలు నిజాం వెంకటేశం చిరకాల మిత్రులు ఎందరో ఉన్నారు. డెబ్బై యేళ్ళ మిత్రుడు నరాల వెంకటేశం, సాహితీవేత్త రిటైర్డ్ బ్యాంక్ మేనేజర్ బి. నర్సన్, లేబర్ కమిషనర్ రిటైర్డ్ సమ్రాట్ అశోక్, అడ్వకేట్ గుండేటి గంగాధర్, సుప్రసిద్ధ సాహితీవేత్త కూర చిదంబరం, సంపత్ రెడ్డి, వాడ్రేవు చినవీరభద్రుడు, బొమ్మదేవర నాగకుమారి, ఈనాడు డిప్యూటి ఎడిటర్ శ్రీనివాస్, ప్రొఫెసర్ ఏకు తిరుపతి, డా॥ పత్తిపాక మోహన్, తులసి సంపత్ కుమార్, స్కై ఫౌండేషన్ వ్యవస్థాపకులు సంజీవ్ కుమార్, పావని, ఆర్యవేశ్య సంఘం నాయకులు శ్రీనివాస్, శంకరయ్య తదితరులు హాజరైనవారిలో ఉన్నారు.

కుటుంబ సభ్యులు శ్రీమతి నిజాం మాధవి, నిజాం ప్రశాంత్, నిజాం సంధ్య, నిజాం ఆదిత్య, సమత ఈ సభ విజయవంతం కావడంలో అన్నీ తామై ఏర్పాట్లను నిర్వహించారు. ఉదయం 11:45 గం॥లకు నిజాం వెంకటేశం గారి చిత్రపటానికి పూలమాల వేసి జ్యోతి ప్రజ్వలన చేసి సభను ప్రారంభించారు. జ్యోతి ప్రజ్వలనలో డా॥ వింజమూరి సూర్యప్రకాష్, బి.ఎస్. రాములు, ఆడెపు లక్ష్మీపతి, ఎ. గంగారెడ్డి, కూర చిదంబరం, నిజాం మాధవి, నిజాం ప్రశాంత్ పాల్గొన్నారు. సభను ప్రారంభిస్తూ, ‘అందరి ఇల్లు’ ఫేం డా॥ వింజమూరి సూర్యప్రకాష్ నిజాం వెంకటేశంగారితో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేశారు. గత పదిహేను సంవత్సరాలుగా ‘అందరి ఇల్లు’తో, స్ప్రెడ్డింగ్ లైట్‌తో, పుస్తకాల పరిచయం కార్యక్రమాలతో అన్నిట్లో ఎలా చురుకుగా నిజాం వెంకటేశం సహకరించేవారో పేర్కొన్నారు. నిజాం వెంకటేశంకు సాహిత్యంతో పాటు సామాజిక సేవా రంగం, రాజకీయాలు, సాంస్కృతిక సేవా రంగం తదితర అనేక విషయాల్లో తెలియని విషయం లేదంటూ వందల మందికి నిరంతరం స్ఫూర్తినిచ్చేవారని, ఆయా గ్రూపులతో నిమిత్తం లేకుండా, అందరితో స్నేహం, సహకారం చేయూత కొనసాగించేవారని పేర్కొన్నారు. మన కాలంలో మహా మనీషిగా, మనకు ఆదర్శప్రాయుడుగా, మార్గదర్శకంగా నిలిచారని అన్నారు. రిటైర్డ్ ఇంజినీర్ ఎ. గంగారెడ్డి 60 సంవత్సరాలుగా నిజాం వెంకటేశంతో తమకున్న అనుబంధాన్ని, ఆత్మీయతను గుర్తుచేసి కన్నీరు పెట్టుకున్నారు. నిజాం వెంకటేశం పలు రంగాల్లో కృషి చేశారని పేర్కొన్నారు. 1980లో జూకంటి జగన్నాథం సహకారంతో ‘దిక్సూచి’ అనే వచన కవిత్వం బులెటిన్‌ని 12 సంచికలు వెలువరించారని పేర్కొన్నారు. 1982లో బి.ఎస్. రాములు, జూకంటి జగన్నాథం, అల్లం రాజయ్య, ఆర్.కె., ఎ. గంగారెడ్డి గార్లతో కలిసి ‘భూమి’ కథల సంపుటిని, ‘బతుకుపోరు’ నవలను, ‘బొగ్గుపొరల్లో’, ‘అడవిలో వెన్నెల’ కథా సంకలనాలను ప్రచురించారు. జగిత్యాల, కరీంనగర్, సిరిసిల్ల, ఫిలిం సొసైటి నిర్మాణంలో పాల్గొని ఉత్తమ చిత్రాల ప్రదర్శన ఏర్పాటు చేసి, ఉత్తమ అభిరుచులను పెంపొందించడానికి కృషి చేశారు.









నిజాం వెంకటేశం పుట్టినరోజు 14 నవంబర్ 1948. 1963లో హెచ్.ఎస్.సి. పాసయ్యారు. 1966లో పాలిటెక్నిక్ పూర్తి చేశారు. నవంబర్ 1968లో ఉద్యోగంలో జాయినయ్యారు. పెద్దపల్లి, జగిత్యాల, పోడూరు, మెట్‌పల్లి, సిరిసిల్ల ప్రాంతాల్లో ఉద్యోగం చేసి 1997లో రిటైరయ్యారు. 1966లో మాధవితో పెళ్లి జరిగింది అని పేర్కొన్నారు. నిజాం వెంకటేశం సాహితీవేత్తగా, సాహిత్య పోషకులుగా, ఉద్యమశీలిగా, విద్యుత్ ఇంజినీర్‌గా రిటైరైన తర్వాత నిరంతర కృషీవలుడుగా, నడుస్తున్న గ్రంథాలయంగా, బెల్వడేర్ అపార్ట్‌మెంట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడుగా, ఆర్యవైశ్య సంఘాల రాష్ట్ర కార్యదర్శిగా, అలిశెట్టి ప్రభాకర్, జూకంటి జగన్నాథం, నలిమెల భాస్కర్, బి.ఎస్. రాములు, కవి శివారెడ్డి, సృజన మాసపత్రికకు అనేక సేవలు అందించి, వారి ఎదుగుదలకు కృషి చేశారు. స్నేహశీలి అయిన నిజాం వెంకటేశం కరీంనగర్ భోజుడు గా ధాతృత్వం అందించారని, అనువాదకుడుగా అనేక రచనలు వెలువరించారని, ‘మంటలు’ పత్రికలో ‘ఈవారం మీతో నేను’ అనే శీర్షిక నిర్వహించారని, సాహిత్య సమీక్షకుడుగా నిజాం వెంకటేశం చేసిన ప్రసంగాలు ఉత్తమ అభిరుచిని పెంపొందించాయని, ఇండియాటుడె ప్రచురించిన ప్రముఖుల గురించి రిటైర్డ్ ఇంజినీర్స్ అసోసియేషన్‌లో చేసిన ప్రసంగాలు గొప్ప కాంట్రిబ్యూషన్ అని పేర్కొన్నారు. సిద్ధ సమాధియోగ, అడ్వాన్స్ మెడిటేషన్ కోర్స్, ప్రాణిక్ హీలింగ్ కోర్స్ నేర్చి, ప్రచారం చేసి ఎందరికో ఆరోగ్య విషయాల్లో తోడ్పడ్డారు. ప్రకృతి వ్యవసాయం గురించిన అనేక పుస్తకాలను వందలాది కాపీలు కొని పలువురికి పంచారు. సాహితీవేత్తలకు ఎవరికి ఏ పుస్తకం అవరమో జాడ తీసి కొనుక్కొని వచ్చి వారికి అందించేవారని, ఇలా నిజాం వెంకటేశం కృషి దశాబ్దాల తరబడి కొనసాగిందని, వారి కృషి చరిత్రాత్మకమైందని పేర్కొన్నారు. 70 యేళ్ల సామాజిక పరిణామాల్లో ఒక విద్యార్థిగా, ఒక కొడుకుగా, భర్తగా, తండ్రిగా, ఉద్యోగిగా, సాహితీవేత్తగా, అనువాదకుడిగా, స్నేహశీలిగా, సాహిత్య పోషకుడుగా, ఎంటర్‌ప్రెన్యూర్‌గా నిజాం వెంకటేశం జీవితమంతా వందలాది జీవితాలు, స్నేహాలు, ఉద్యమాలు, విద్యుత్ ఉద్యోగ సంఘాలు మొదలైనవి ఎన్నో పెనవేసుకొని కొనసాగాయని ఎ. గంగారెడ్డిగారు సంక్షిప్తంగా వివరించారు.

నిజాం వెంకటేశం స్మారక పురస్కారానికి వచ్చిన రచనల నుంచి ఎంపిక చేసిన విధానాన్ని ఆడెపు లక్ష్మీపతి వివరించారు. ఈ ఎంపికలో బి.ఎస్. రాములు, ఆడెపు లక్ష్మీపతి, ఎ. గంగారెడ్డి, కోడం పవన్ కుమార్, సిహెచ్‌వి. ప్రభాకర్‌రావు పాల్గొన్నారు. అనేక వడపోతల తర్వాత వీటిని ఎన్నిక చేయడం జరిగిందని పేర్కొన్నారు. అన్ని ప్రక్రియలమీద సాహితీ విమర్శ చేసిన గ్రంథాలు తమ పరిశీలనకు రాలేదని పేర్కొన్నారు. అందువల్ల ప్రక్రియల వారీగా ఎన్నిక చేయడం జరిగింది. అందుకుగాను పురస్కారాలను ఒకటికి బదులుగా మూడు ప్రక్రియలకు ఇవ్వడం జరిగింది. కవితా విమర్శకు ఒకటి, కథా విమర్శకు ఒకటి, స్త్రీల సాహిత్యం విమర్శకు ఒకటి ఎంపిక చేసి తలా ఐదు వేల రూపాయలు పురస్కారం నిర్ణయించడం జరిగింది. అలా పదివేల రూపాయల పురస్కారంకు బదులుగా ముగ్గురికి కలిపి పదిహేనువేల రూపాయల పురస్కారం అందించడం జరిగింది. దీనికి తోడుగా ఇంటర్ విద్యార్థి కవితా పుస్తకం వేయడం ఆసక్తి కలిగించి ప్రోత్సాహక బహుమతిగా ఎంపిక చేయడం జరిగింది అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ‘భరిణ’ స్త్రీల సాహిత్యం పై వచ్చిన సాహిత్య విమర్శ గ్రంథానికిగాను ప్రొఫెసర్ డా॥ వి. త్రివేణిగారికి, ‘తెలంగాణ కథా వర్తనం’ గ్రంథానికిగాను డా॥ ఎం. దేవేంద్ర గారికి , ‘శతారం’ కవిత్వ విమర్శనా వ్యాసాల సంపుటికి గోపగాని రవీందర్‌గారికి, ‘చంద్రుడు లేని ఆకాశం’ కవితా సంపుటికి గజ్జెల రామకృష్ణ గారికి ఐదు వేల రూపాయల చొప్పున నగదు, మొమెంటో, శాలువాతో సాహితీవేత్తలు పలువురు సత్కరించారు. ఇంటర్మీడియట్‌లోనే కవితా పుస్తకం వెలువరించిన శీర్పి చంద్రశేఖర్‌కు ‘కాలుతున్న వెన్నెల’ కవితా సంపుటికి ప్రశంశాత్మక బహుమతి అందజేయడం జరిగింది. పురస్కార గ్రహీతలు తమ స్పందనని తెలియజేశారు. ఈ పురస్కారం మాకు ఎంతో స్ఫూర్తి అని, మా కర్తవ్యాన్ని పెంచిందని అవార్డు గ్రహీతలు పేర్కొన్నారు. బి. నర్సన్, సమ్రాట్ అశోక్, గుండేటి గంగాధర్, కె. సంజీవగౌడ్, డా॥ పత్తిపాక మోహన్, బొమ్మదేవర నాగకుమారి, ప్రొఫె సర్ డా॥ ఏకు తిరుపతి, ఆర్యవైశ్య సంఘం ప్రముఖులు, సిహెచ్‌వి. ప్రభాకర్‌రావు, తులసి సంపత్ కుమార్, డా॥ వింజమూరి సూర్యప్రకాష్, జూకంటి జగన్నాథం, స్కై ఫౌండేషన్ సంజీవ్ మొదలైన సాహితీవేత్తలు, సాహితీ మిత్రులు పాల్గొని సభను విజయవంతం చేశారు. ఈ సందర్భంగా పలువురు సాహితీమిత్రులను, ఆత్మీయులను శాలువా మొమెంటోలతో సత్కరించారు. నిజాం వెంకటేశం కుమారుడు నిజాం ప్రశాంత్ వందన సమర్పణతో సభ ముగిసింది. భోజనానంతరం సాహితీమిత్రుల మధ్య ఆత్మీయ కలయికలు, ఫోటోల సెషన్ కొనసాగింది.

---

## ఎస్.ఆర్. యూనివర్సిటీ వ్యవసాయ కళాశాల విద్యార్థులచే రైతులకు అవగాహన సదస్సు



**ఎల్కతుర్తి నవంబర్ 16 (ప్రజామంటలు):** ఎల్కతుర్తి మండల దామెర గ్రామంలో వ్యవసాయ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా గురువారము ఎస్.ఆర్. విశ్వవిద్యాలయం వ్యవసాయ కళాశాల విద్యార్థులు గ్రామంలోని రైతులకు పిఆర్ఏ నిర్వహించారు. ఇందులో భాగంగా సోషల్ మ్యాప్ రిసోర్స్ మ్యాపు వేసి లేక చిత్రము నేలలో రకాలు వివిధ రకాల పంటల గురించి చాట్స్ పై చిత్రాలు వేసి రైతులకు అవగాహన చేసి వివరించారు. ఈ కార్యక్రమంలో ఏవో రాజ్ కుమార్ ఏ ఈ ఓ కళ్యాణి సర్పంచ్ రవీందర్ రెడ్డి పంచాయతీ కార్యదర్శి గణపతి, ఎస్.ఆర్. విశ్వవిద్యాలయం అధ్యాపకులు శ్రీకర్ రెడ్డి, సాయి దివ్య, డాక్టర్ విజయ్, విద్యార్థులు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ సుచిత్ కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థినిలు, డి. కీర్తి, అమృత, శర్వాణి, బి. సుస్మిత, జి. మనిషా, వీ. లయ, బి. పూజిత నిర్వహించారు. ఈ కార్యక్రమం విజయవంతం చేసినందుకు గాను విద్యార్థినీలు అధ్యాపకులను వ్యవసాయ కళాశాల ఏఓ, ఏఈఓ పంచాయతీ కార్యదర్శి సర్పంచులకు డాక్టర్ జి. భూపాల్ రాజు అభినందిస్తూ గ్రామ సర్పంచికి రైతులకు గ్రామస్తులకు కృతజ్ఞతలు తెలిపారు.

## కాంగ్రేస్ అభ్యర్థి జీవన్ రెడ్డికి ప్రజల విరాళాలు


**జగిత్యాల నవంబర్ 16 (ప్రజామంటలు):** జగిత్యాల నియోజకవర్గ0 కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తాటిపర్తి జీవన్ రెడ్డికి ప్రజలు ఎన్నికల ఖర్చుల కోసం విరాళాలు అందిస్తూ అభిమానాన్ని చాటుకున్నారు. నియోజకవర్గంలో చిన్న పిల్లలు తమ కిడ్డి బ్యాంకులో దాచుకున్న డబ్బులు, పేరెంట్స్ చిన్న చిన్న అవసరాలకు ఇచ్చిన డబ్బులను దాచుకుని జీవన్ రెడ్డికి విరాళాలు ఇస్తూ నాయకుడిపై ఉన్న అభిమానాన్ని చాటుకుంటున్నారు. గురువారం ఎన్నికల ప్రచారానికి వెళ్లిన జీవన్ రెడ్డికి మంగళ హారతులతో స్వాగతం పలుకుతూనే తమకు తోచినంత జగిత్యాల అర్బన్ మండలం నర్సింగపూర్ గ్రామానికి చెందిన మద్దెల ఈశ్వరమ్మ వెయ్యి రూపాయలు, గడ్డం భూమరెడ్డి 50 వేలు, వంజరిపల్లె గ్రామంలో లవంగా లచ్చ 5 వేల రూపాయలు విరాళంగా జీవన్ రెడ్డికి అందించారు. అలాగే ప్రజలకు అందుబాటులో ఉండి, కష్ట సుఖాల్లో పాలుపంచుకుంటున్న మీకు ఓటు వేసి గెలిపిస్తామంటూ జీవన్ రెడ్డిని అన్నివర్గాల ప్రజలు ఆశీర్వాధిస్తున్నారు.

## సైకో పోవాలి... సరైనోడు రావాలి...

**తెలంగాణ ఉద్యమాకారులు అన్నం ప్రవీణ్**



**జమ్మికుంట నవంబర్ 16 (ప్రజామంటలు):** జమ్మికుంట మండలంలోని పెద్దంపల్లి గ్రామంలో అన్నం ప్రవీణ్ బృందం గడుప గడుపకు చేరుకొని కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన 6 గ్యారంటీల ప్రచారం నిర్వహించడం జరిగింది. కాంగ్రెస్ అభ్యర్థి ఒడితల ప్రణవ్ గారి ఘన విజయానికి ఆరు గ్యారంటీలే కీలకంగా ఉన్నాయని, ప్రజలంతా 6 గ్యారంటీలతో తమకు ఎంతో లబ్ది చేకూరుతుందని సంతోషం వ్యక్తం చేస్తున్నారని అన్నం ప్రవీణ్ తెలియజేశారు. ప్రజా జీవితాల్లో వెలుగులు నింపేందుకు కాంగ్రేసు పార్టీ తీసుకున్న నిర్ణయాలను ప్రజలంతా స్వాగతిస్తున్నారని కాంగ్రేస్ అభ్యర్థి వొడితల ప్రణవ్ గారికి ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపిస్తామని తెలంగాణ ఇచ్చిన పార్టీ కాంగ్రేస్ పార్టీకి అండగా ఉంటామని ప్రజలంతా స్వచ్ఛందంగా మద్దతు పలుకుతున్నారని ప్రవీణ్ తెలియజేశారు. ఈ కార్యాక్రమంలో తెలంగాణ ఉద్యమాకారులు అన్నం ప్రవీణ్, నాయకులు ఏబూషి అజయ్, బిజిగిరి శ్రీకాంత్, దొడ్డే భాస్కర్, కిశోర్, ఇటుకాల గణేష్, పచ్చిమట్ల బాను, పొనగంటి కార్తీక్, గణేష్, ఆకుల సాయి,తదితరులు పాల్గొన్నారు.



## ధరూర్ క్యాంపు వాకర్స్ అసోసియేషన్ మద్దతు కోరిన ఎమ్మెల్యే అభ్యర్థి డా. సంజయ్‌కుమార్



**జగిత్యాల నవంబర్ 16 (ప్రజామంటలు):** జగిత్యాల దరూర్ క్యాంపులోని కోదండ రామాలయం వద్ద వాకింగ్ చేస్తున్న జగిత్యాల దరూర్ క్యాంపు వాకర్స్? అసోసియేషన్ వాకర్స్? ను ఎమ్మెల్యే డా. సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ ఎల్. రమణలు కలిసి జగిత్యాల పట్టణంలో చేసిన అభివృద్ధి, అందించిన కార్యక్రమాలను వాకర్స్కు వివరిస్తూ కారు గుర్తుకు ఓటు వేయాలని ఓటు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..... పట్టణ వాసులు శారీరకంగా పటిష్టంగా ఉండేందుకు పట్టణంలో పలు ప్రాంతాల్లో ఓపెన్ జిమ్ములు ఏర్పాటు చేశామని, పార్కులను అభివృద్ధి చేశామని, జగిత్యాల పట్టణాన్ని అన్ని రంగాల్లో అన్ని పట్టణాల కంటె ఎక్కువగా అభివృద్ధి చేశామన్నారు. జగిత్యాల పట్టణంలో సరైన విధంగా క్రీడా ప్రాంగణాలు లేవని, కేవలం ఒకే ఒక్క స్టేడియం ఉండేదని, దీనిని దృష్టిలో ఉంచుకొని పట్టణంలో పలు ప్రాంతాల్లో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేశామన్నారు. జిల్లా కేంద్రంలోని యావర్ రోడ్డును 993మీ. మేర విస్థరించి కొత్తగా రోడ్డు వేయించామని, అదేవిధంగా రూ. 1.76కోట్లతో విస్థరించిన రోడ్డుపై అండర్ గ్రౌండ్ డ్రైనేజీని సైతం నిర్మించామని, త్వరలో జగిత్యాల పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో అండర్‌గ్రౌండ్ వ్యవస్థను రూపొందిస్తామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఎల్. రమణ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హాయాంలో చేసిన అభివృద్ధి కండ్ల ముందు కనబడుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేయాల్సిన పనులన్నీ బాధ్యతగా చేపట్టామన్నారు. జగిత్యాల జిల్లాగా చేయడమే కాకుండా జిల్లా కేంద్రాన్ని అద్భుతంగా అభివృద్ధి చేశామన్నారు. జీవన ప్రమాణాలకనుగుణంగా అభివృద్ధి, మౌళిక సదుపాయాల కల్పన చేశామన్నారు. కార్యక్రమాలు చేపట్టామన్నారు. శాంతి భద్రతల పరిరక్షణ బాగుంటేనే అభివృద్ధి సాధ్యమవుతుందని, దీనికకనుగుణంగానే ప్రభుత్వం పనులు చేపట్టిందన్నారు. నిరంతరం అందుబాటులో ఉండి అభివృద్ధికి అహర్నిషలు పాటుపడుతున్న ఎమ్మెల్యే డా. సంజయ్‌కుమార్‌ను మరోసారి గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో దరూర్ క్యాంపు వాకర్స్? అసోసియేషన్ సభ్యులు, వాకర్స్?, స్థానికులు పాల్గొన్నారు.

prajamantalau daily pages (17-11)_times of varha main (13-2).qxd 11/17/2023 6:21 AM Page 6





బీర్పూర్ మండలం కండ్లపల్లి గ్రామానికి చెందిన బిజెపి నాయకులు దోసరపు మహేష్, గణేష్ వారి మిత్రులు 12 మంది బిఆర్ఎస్ పార్టీ అభివృద్ధి సంక్షేమ పథకాలకు ఆకర్షితులై గ్రామ సర్పంచ్ రవి ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీలో చేరగా కండువా వేసి ఆహ్వానించిన శాసనసభ్యులు డా. సంజయ్ కుమార్ పాల్గొన్న లైబ్రరీ చైర్మెన్ డా. చంద్రశేఖర్ గౌడ్

## గోల్డెన్ విజన్ మోడల్ స్కూల్ విద్యార్థుల ఔదార్యం



**జగిత్యాల నవంబర్ 16 (ప్రజామంటలు):** చిలుకవాడలో గల గోల్డెన్ విజన్ మోడల్ స్కూల్ విద్యార్థులు ఎండి హెచ్ డబ్లూఎస్ అనాథ పిల్లల ఆశ్రమానికి విరాళాలు సేకరించి రూ. 10,500 అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ తాటిపాముల శ్రీనివాస్, అనాధాశ్రమ ప్రతినిధులు అధ్యాపక పాల్గొని విద్యార్థులను అభినందించారు.

## కోతకు గురైన రోడ్డు, పట్టించుకోని నాయకులు



**మెట్ పల్లి నవంబర్ 16 (ప్రజామంటలు):** మెట్ పల్లీ మండలం రంగారావుపేట్ తాండ లోని ఇప్ప దేవుడు రోడ్డు గత ఏడాది క్రితం అకాల వర్షాలకు కోతకు గురైన రోడ్డు అత్యంత ప్రమాదకరంగా మారింది. అధికారులకు గ్రామస్తులు ఎంత మొరపెట్టుకున్న పట్టించుకున్న నాథుడు లేడు. ఎన్నికలవేళ నాయకులు అదే రోడ్డుపై ప్రయాణిస్తున్నారు. కానీ ఏ ఒక్క నాయకుడు దీన్ని పట్టించుకున్న పాపాన పోలేదు అని గ్రామస్తులు మాట్లాడుకుంటున్నారు. కోరుట్ల నియోజకవర్గ బీఎస్పీ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పుదారి నిశాంత్ కార్తికేయ పర్యటనలో భాగంగా ఆ రోడ్డును చూసి ఆగి మాట్లాడారు. గత సంవత్సరం నుండి ప్రమాదకరమైన రోడ్డు మీద ప్రయాణిస్తున్న ప్రజలను పట్టించుకోవడంలో ఎమ్మెల్యేలు ఎంపీలు విఫలమయ్యారన్నారు.

## జగిత్యాల ఎమ్మెల్యే అభ్యర్థి డా. సంజయ్ కుమార్ కు మద్దతుగా

### జెడ్పీ చైర్ పర్సన్ దావ వసంత, ఎమ్మెల్యే సతీమణి రాధిక ఇంటింటి ప్రచారం



**జగిత్యాల నవంబర్ 16 (ప్రజామంటలు):** జగిత్యాల రూరల్ మండల హన్మాజిపెట్, కన్నాపూర్ గ్రామాలలో జగిత్యాల ఎమ్మెల్యే అభ్యర్థి డా. సంజయ్ కుమార్ కు మద్దతుగా ఇంటింటా ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహించిన జెడ్పీ చైర్ పర్సన్ దావ వసంత, ఎమ్మెల్యే సతీమణి రాధిక. ఈ కార్యక్రమంలో గ్రామ మండల ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.




గురువారం జగిత్యాల పట్టణంలోని స్థానిక అంగడి బజార్ లో ప్రచారం నిర్వహించిన జగిత్యాల నియోజకవర్గం భారతీయ జనతా పార్టీ జగిత్యాల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ బోగ శ్రావణి.

# గౌరవెల్లి ప్రాజెక్టు విషయంలో ముఖ్యమంత్రి వైఫల్యం

### ప్రాజెక్టు పూర్తి చేయడానికి చొరవ చూపని స్థానిక ఎమ్మెల్యే సతీష్

### హుస్నాబాద్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, మాజీ ఎంపి పొన్నం ప్రభాకర్



**హుస్నాబాద్ నవంబర్ 16 (ప్రజామంటలు):** గౌరవెల్లి ప్రాజెక్టు విషయంలో ముఖ్యమంత్రి వైఫల్యం చెందాడని, ముమ్మాటికీ స్థానిక ఎమ్మెల్యే సతీష్ అసమర్థుడే అని హుస్నాబాద్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, మాజీ ఎంపి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రచార కార్యక్రమం లో భాగంగా పొన్నం ప్రభాకర్ గురువారం అక్కన్న పేట్ మండలం లోని జనగాం, గౌరవెల్లి, బోడిగ పల్లె, రేగొండ, మల్చేరువు తండా, మసి రెడ్డి తండా, కపూర్ నాయక్ తండా, నందారం గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పొన్నం మాట్లాడుతూ.... 2014 లో అధికారం లోకి రాగానే కుర్చీ వేసుకొని కూర్చొని ప్రాజెక్టు పూర్తి చేస్తామని మాట ఇచ్చిన ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రాజెక్టు ను పూర్తి చేయటం లో విఫలం అయ్యారని అన్నారు. ముఖ్యమంత్రి కి సన్నిహితంగా ఉండే స్థానిక ఎమ్మెల్యే సతీష్ అసమర్థత వల్ల ప్రాజెక్టు పూర్తి చేయలేక పోయారని అన్నారు. మెట్ట ప్రాంత మైన ఈ ప్రాంతానికి సాగు నీరు అందించాలనే ఉద్దేశంతో తమ భూములను త్యాగం చేసిన రైతులకు చివరికి సంకెళ్లు పడ్డాయని అన్నారు. రైతులను అరిగొస పుచ్చుకున్న ఈ ప్రభుత్వాన్ని గద్దె దించాలని గౌరవెల్లి ప్రజలను పొన్నం కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాం లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజ శేఖరరెడ్డి ,చొరవ తో ఫౌండేషన్ వేసి 70 శాతం ప్రాజెక్టు పనులు పూర్తిచేసుకున్నప్పటికి, పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రాజెక్టు పూర్తి పూర్తి చేయక పోవటం బిఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యమేనని అన్నారు. ప్రాజెక్టు నిర్మాణ కెపాసిటీ పెంచి, 2013 భూ సేకరణ చట్టం అమలు చేయకుండా, పోలీసులతో దౌర్జన్యంగా దాడులు చేపించి బలవంతంగా భూములు లాక్కొని, స్థానిక ఎమ్మెల్యే రైతుల పట్ల దురుసుగా ప్రవర్తించారని అన్నారు. తాను ఎమ్మెల్యే గెలిచి, కాంగ్రెస్ పార్టీ అధికారం లోకి రాగానే ప్రాజెక్టు నుండి కాలువల ద్వారా నీటిని అందించి, ఈ ప్రాంతాన్ని సశ్య శ్యామలం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మంజుల రెడ్డి, సీపీఐ సిద్ధిపేట జిల్లా కార్యదర్శి మంద పవన్, సింగిల్ విండో చైర్మన్ శివయ్య, అక్కన్నపేట్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు జంగ పల్లి అయిలయ్య, సీపీఐ మండల కార్యదర్శి కొమ్ముల భాస్కర్, అక్కన్న పేట్ సర్పంచ్ సంజీవ రెడ్డి, గుడాట్ పల్లి సర్పంచ్ బద్దం రాజీ రెడ్డి, సింగిల్ విండో వైస్ చైర్మన్ లు ఎగ్గిడి అయిలయ్య, ముకుంద రెడ్డి, డైరెక్టర్ లు బండి కుమార్, కాంగ్రెస్, సీపీఐ పార్టీ, టీజేఎస్ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

# అభివృద్ధిలో తెలంగాణ దేశానికే రోల్ మోడల్

### సనత్ నగర్ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్



**సికింద్రాబాద్ నవంబర్ 16 (ప్రజామంటలు):** అభివృద్ధిలో దేశానికే తెలంగాణ రాష్ట్రాన్ని రోల్ మోడల్ గా తీర్చిదిద్దిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్ కు దక్కుతుందని సనత్ నగర్ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. గురువారం మోండా డివిజన్ బండి మెట్, జైన్ భవన్, సజ్జన్ లాల్ స్ట్రీట్, టకారా బస్తీ, పాట్ మార్కెట్ ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బండి మెట్, ఆదయ్య నగర్ లలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాలను మంత్రి ప్రారంభించారు. ప్రచారంలో మంత్రికి ప్రతి ఇంటా పూలమాలలు వేసి మంగళ హారతులు పట్టి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాతనే రాష్ట్రంలో, సనత్ నగర్ నియోజకవర్గంలో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు అయ్యాయని చెప్పారు. 50 సంవత్సరాలలో జరగని అభివృద్ధి గడిచిన తొమ్మిదిన్నర సంవత్సరాల లో జరిగిందని తెలిపారు. సనత్ నగర్ లో ఎవరు ఊహించని స్థాయిలో రూ. 1400 కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేసినట్లు చెప్పారు. గతంలో రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ ఎంతో అస్తవ్యస్తంగా ఉండి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ సహకారంతో అనేక అభివృద్ధి పనులు చేపట్టి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించామని అన్నారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు జరగాలని ప్రజలు కోరుకుంటున్నారని, తిరిగి బీఆర్ఎస్ ప్రభ్యత్వమే అధికారంలోకి వస్తుందని ఆనిఅన్నారు. మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 400 రూపాయలకు వంట గ్యాస్ సిలెండర్, రేషన్ పై సన్నబియ్యం పంపిణీ వంటి కార్యక్రమాలు జరుగుతాయని అన్నారు. అదేవిధంగా పేదల కోసం మరో లక్ష డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను నిర్మిస్తామని చెప్పారు. మంత్రి వెంట మాజీ కార్పొరేటర్ ఆకుల రూప, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు ఆకుల హరికృష్ణ, నాయకులు తలసాని స్కైలాబ్ యాదవ్, నాగులు, రాములు, జయరాజ్, సత్యనారాయణ, మహేష్, అమర్ ఉన్నారు. సాయంత్రం బన్సీలాల్ పేట డివిజన్ లోని భోలక్ పూర్ చౌరస్తాలోని నర్సింహా సైకిల్ స్టాండ్, ఎవర్ గ్రీన్ అసోసియేషన్, ఆరోగ్య సూపర్ మార్కెట్ ప్రాంతాల్లో మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్ ఎన్నికల ప్రచార పాదయాత్రను నిర్వహించారు. పాదయాత్రలో కార్పొరేటర్ హేమలత, నాయకులు గుర్రం పవన్ కుమార్ గౌడ్, ఎల్.వెంకటేశన్ రాజు, బాలరాజ్ యాదవ్, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అన్ని రాష్ట్రాల చూపు తెలంగాణ వైపే

### ఉస్మానియా విద్యార్థి జెఏసి చైర్మన్ భాస్కర్




(రామ కిష్టయ్య సంగన భట్ల)

**ధర్మపురి నవంబర్ 16 (ప్రజామంటలు):** ప్రస్తుత ఎన్నికల్లో దేశంలోని రాష్ట్రాల చూపు తెలంగాణ పై ఉన్నదని, ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా పరిపాలన సాగిస్తున్న కేసీఆర్ నేతృత్వంలోని భారాస అభ్యర్థులను గెలిపించుకునే బాధ్యత ఓటర్లపై ఉందని ఉస్మానియా విద్యార్థి జెఏసి చైర్మన్ మాందాల భాస్కర్ అన్నారు. గురువారం ధర్మపురి శాసన సభ స్థానానికి పోటీ చేస్తున్న రాష్ట్ర సంక్షేమ శాఖల మంత్రి కొప్పుల ఈశ్వర్ కు మద్దతుగా ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్న సందర్భంగా ధర్మపురి క్షేత్రంలో మీడియా ప్రతినిధుల సమావేశంలో జెఏసి పాల్గొన్నారు. ఈ సమావేశంలో జేఏసి చైర్మన్ భాస్కర్ మాట్లాడుతూ.... వలస సీమాంధ్ర పాలకుల వివక్షకు గురైన తెలంగాణ ప్రజలు తమ అస్తిత్వం ఆత్మ గౌరవం కోసం, నీళ్ళు నిధులు నియామకాల కోసం కే సి ఆర్ నేతృత్వంలో ఉద్యమాలు చేపట్టి ప్రత్యేక రాష్ట్రం సాధించాక కాళేశ్వరం లాంటి ప్రాజెక్టులు కట్టి, సాగు నీరు పుష్కలంగా పొంది అధిక పంటలు పండించామని, నిధులు అధికంగా సమ కూర్చు కున్నామని, ఎన్నో ఉద్యోగ అవకాశాలు పొందానని వివరించారు. ఇతర రాష్ట్రాలలో లేని అభివృద్ధి సాధించి, పథకాల అమలులో అగ్రగామిగా నిలిచా మన్నారు. ధర్మపురి కి ప్రాతినిథ్యం వహిస్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్ అవినీతి రహిత మచ్చలేని నాయకుడని, భారీ మెజార్టీ తో గెలిపించాలని కోరారు. శాతవాహన విద్యార్థి జె ఏ సి చైర్మన్ చన్నమల్ల చైతన్య మాట్లాడుతూ... కొప్పుల ఈశ్వర్ తెలంగాణ ఉద్యమ సమయంలో కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. జాతీయ పార్టీలకు తిరిగి అవకాశం ఇస్తే తెలంగాణ ప్రజల ఆత్మ గౌరవం తిరిగి తాకట్టు పెట్టడం ఖాయ మన్నారు. డీసీఎంఎస్ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి ధర్మపురి జెడ్పీటీసీ అరుణ మార్కెట్ చైర్మన్ రాజేశ్ కుమార్ మున్సిపల్ చైర్ పర్సన్ సత్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

## 2వ వార్డు కౌన్సిలర్, బోజు రమాదేవి రవీందర్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం



**హుస్నాబాద్ నవంబర్ 16 (ప్రజామంటలు):** హుస్నాబాద్ మున్సిపల్ రెండో వార్డులో కౌన్సిలర్ బోజు రమాదేవి రవీందర్ ఆధ్వర్యంలో ప్రతి ఇంటింటికి తిరుగుతూ బిఆర్ఎస్ పార్టీ మేనిఫెస్టో వివరిస్తూ కారు గుర్తుకు ఓటు వేసి సతీష్ కుమార్ ని గెలిపించాలని కోరారు ఈ కార్యక్రమంలో సావుల స్వప్న, పెద్దపల్లి మంజుల, బోలుమల్ల రమ్య, పచ్చిమట్ల ప్రవళిక, ఉప్పుల రవళి, ఎర్రవెల్లి మమత, బత్తుల రక్షిత, బోల్లపెల్లి కనకవ్వ, బి.ఆర్.ఎస్ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## లష్కర్ లో హ్యాట్రిక్ కొట్టబోతున్నాం

### సికింద్రాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్



**సికింద్రాబాద్ నవంబర్ 16 (ప్రజామంటలు):** సికింద్రాబాద్ లో తమ పార్టీ విజయం ఖాయమని, హ్యాట్రిక్ సాధించానున్నామని, కాలనీలు, బస్తీలనే తేడాలు లేకుండా అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేశామని డిప్యూటీ స్పీకర్, సికింద్రాబాద్ బీ.ఆర్.ఎస్. అభ్యర్థి తీగుల్ల పద్మారావు గౌడ్ అన్నారు. సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా గురువారం బౌద్ధనగర్ డివిజన్ పరిధిలో ని వివిధ ప్రాంతాల్లో స్థానిక కార్పొరేటర్ కంది శైలజ తో కలిసి పద్మారావు గౌడ్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడకుండా రాజకీయాలకు అతీతంగా వివిధ ప్రాంతాలను అభివృద్ధి చేశామని, సికింద్రాబాద్ ను అభివృద్ధిలో నడుపుతున్నామని పద్మారావు గౌడ్ అన్నారు. 10 సంవత్సరాల కాలంలో తాము చేపట్టని పనులు లేవని, అన్ని మౌలిక వసతుల పై దృష్టి పెట్టమని తెలిపారు. విద్య, వైద్య రంగాలకు ప్రాముఖ్యతను కల్పిస్తూనే సంక్షేమ కార్యక్రమాల్లో సికింద్రాబాద్ ను అగ్ర భాగంలో నిలిపినట్లు పద్మారావు గౌడ్ పేర్కొన్నారు. డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి, కార్పొరేటర్లు రాసూరి సునీత రమేష్, లింగాని ప్రసన్న లక్ష్మి శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు. లలితానగర్, బ్యాంక్ కాలనీ, అంబర్ నగర్, బౌద్ధనగర్, రాఘవేంద్ర నగర్ తదితర ప్రాంతాల్లో పద్మారావు గౌడ్ పాదయాత్ర సాగింది. అన్ని ప్రాంతాల్లో స్థానికులు పద్మారావు గౌడ్ కు ఘనంగా స్వాగతం పలికారు. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికి, విజయ తిలకం దిద్దారు.

## చక్కర ఫ్యాక్టరీ తెలిపించాలని గజ్వేల్ లో జగిత్యాల జిల్లా రైతు నాయకుల నామినేషన్



**జగిత్యాల నవంబర్ 16 (ప్రజామంటలు):** ముత్యంపేట చక్కర ఫ్యాక్టరీ తెలిపించాలని, రైతుల సమస్యల పరిష్కరించాలని గజ్వేల్ లో సియం కేసిఆర్ పై నామినేషన్ వేశామని మామిడి నారాయణ రెడ్డి, బద్దం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. గురువారం జగిత్యాలలో ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా రైతు నాయకులు మామిడి నారాయణరెడ్డి మాట్లాడుతూ.... నామినేషన్ వేయడానికి ప్రధాన కారణం రాష్ట్రంలోని చక్కర ఫ్యాక్టరీ ని తెలిపించాలని. రైతులము తమ బాధ్యతగా బావించి గజ్వేల్ లో ముఖ్యమంత్రి కేసీఆర్ పై పోటిలో ఉండడం వల్ల రైతుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకపోయి జగిత్యాల జిల్లా లోని నిజాం షుగర్ ప్యారీలను తెరిపించాలని, పండించిన ప్రతి పంటకు మద్దతు ధరను ఇవ్వాలని ప్రభుత్వం కొనుగోలు చేయాలని, తాలు, తప్పతాలు పేరుతో 1 క్వింటలు 8 నుండి 10 కిలోల తరుగును తీస్తున్నరని అన్నారు. పండించిన పంట పై 50% శాతం అందంగా మద్దతు ధర నిర్ణయించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బద్దం శ్రీనివాస్ రెడ్డి, క్యాతం సాయి రెడ్డి, వంగ అశోక్ యాదవ్, కోల నారాయణ, ఎన్. తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

prajamantalau daily pages (17-11)_times of varha main (13-2).qxd 11/17/2023 6:21 AM Page 7



# కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించిన డా. సంజయ్ కుమార్

బీర్ పూర్ నవంబర్ 16 (ప్రజామంటలు):



బీర్ పూర్, నరసింహులపల్లే, కందేన కుంట, కండ్ల పల్లి, చర్లపల్లి, రంగసాగర్, మంగేల, కమ్మ నూరు గ్రామాలలో ఎన్నికల ప్రచారంలో భాగంగా కార్నర్ మీటింగ్‌లో పాల్గొని ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలను, బిఆర్ఎస్ పార్టీ అమలు చేయనున్న మ్యానీ ఫేస్టో ను వివరించి, కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని, మండలాన్ని, గ్రామాలను మరింత అభివృద్ధి చేస్తామని తెలుపుతూ ప్రజలను ఓటు వేయాలని అభ్యర్థించిన ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్. పాల్గొన్న లైబ్రరీ ఛైర్మెన్ డా చంద్ర శేకర్ గౌడ్. గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే కి మహిళలు, యువత ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మండల, గ్రామ ప్రజా ప్రతినిదులు, నాయకులు, కార్యకర్తలు, రైతులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# అక్కన్నపెట్ లో విస్తృత ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ శ్రేణులు



**అక్కన్నపేట్ నవంబర్ 16 (ప్రజామంటలు):** సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం చాపగాని తండాలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు మాలోతు శ్రీనివాస్ నాయక్ ఇంటింటా విస్తృత ప్రచారం నిర్వహించారు. చాపగాని తండా తో పాటు పెరుమాళ్ళ బండ తండా, తెల్లపలుగు తండాల్లో ఇంటింటికి తిరుగుతూ మహిళలతో ప్రచారం చేశారు. కాంగ్రెస్ అభ్యర్థి పొన్నం ప్రభాకర్ ను గెలిపించుకోవాలని ప్రజలను కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలందరికీ సంక్షేమ పథకాలను అందిస్తుందన్నారు. ఇంటింటా ప్రచారంలో కార్యకర్తలు గుగులోతు రాజేందర్, గుగులోతు తిరుపతి ( పవన్), గుగులోతు గణేష్, భూక్యా భీమా, రాజేందర్, గుగులోతు కోమరి, గుగులోతు మహేందర్, గుగులోతు మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# నైతిక బాధ్యతగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

## జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ భాష



**జగిత్యాల నవంబర్ 16 (ప్రజామంటలు):** ఓటు హక్కు వినియోగం నైతిక బాధ్యతగా భావించి ప్రతీ ఒక్కరు ఓటు వేయాలని జిల్లా ఎన్నికల అధికారిణి, కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా అన్నారు. గురువారం రోజున కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, నామినేషన్ వేసిన అభ్యర్థులకు ఎన్నికల పరిశీలకులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతీ ఒక ఓటరు విధిగా ఓటు వేయాలని, నైతిక బాధ్యతను గుర్తుంచు కోవాలని అన్నారు. ఎన్నికల ప్రచారం కోసం అవసరమైన మైక్, వాహనం వినియోగాలకు అనుమతుల కొరకు సువిధ యాప్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. ఇతర ప్రచార పత్రాలు, ఫ్లెక్సీ లు, పోస్టర్లు, ఆడియో, వీడియో, ఎల్ఈడి వాహనాలకు అవసరమైన అనుమతులకు నిర్ణీత ప్రోఫార్మా లలో ఎం.సి.ఎం.సి. నకు దరఖాస్తు చేసుకోవాలనీ తెలిపారు. ఎన్నికల సిబ్బంది మాడల్ కోడ్ ను ప్రభుత్వ యంత్రాంగం పకడ్బందీగా అమలు పరుస్తున్నారనీ తెలిపారు. జిల్లాలో సి విజిల్ యాప్ ను 30 వేల మంది డౌన్ లోడ్ చేసుకున్నారని, ప్రతీ అభ్యర్థి డౌన్ లోడ్ చేసుకోవాలని తెలిపారు. అభ్యర్థులు నామినేషన్ వేసినప్పటి నుండి ఖర్చులను నమోదు చేయాల్సి ఉంటుందని తెలిపారు. అభ్యర్థులకు హ్యాండ్ బుక్, ఖర్చులకు సంబంధించిన బుక్కులు ఇవ్వడం జరుగుతుందని, వ్యయాలకు సంబంధించిన రికార్డ్ లను మూడు సార్లు తనిఖీ చేయడం జరుగు తుందన్నారు. ఫిర్యాదులు చేయదలిస్తే 1950, టోల్ ఫ్రీ నెంబర్ కు తెలియజేయ వచ్చని అన్నారు. 80 ఏళ్లకు పైబడిన వయో వృద్దులు, 40 శాతం కన్నా ఎక్కువ ఉన్న దివ్యంగులకు హెూమ్ ఒటింగ్ కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈవీఎం కమీషనింగ్, మాక్ పోలింగ్ సమయంలలో రాజకీయ పార్టీల ప్రతినిధులు అందుబాటులో ఉండాలని తెలిపారు. ఓటర్లను ప్రలోభాలకు గురి చేయకూడదని అన్నారు. ఎన్నికల కమీషన్ నిబంధనలు పాటించాలని వివరించారు. పోలింగ్ కేంద్రాలకు 200 మీటర్ల లోపు ప్రచార కార్యక్రమాలు నిర్వహించ కూడదని, గుంపులు గుంపులుగా ఉండకూడదని తెలిపారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు అభ్యర్థి క్రిమినల్ కేసులకు సంబంధించిన వివరాలు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ల్లో నిర్ణీత గడువులోగా మూడు సార్లు ప్రచురించాలని అన్నారు. ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకునే సమయంలో ఎపిక్ కార్డుతో పాటు 12 రకాల ఫోటో గుర్తింపు కార్డుల లో ఏదైనా ఒక కార్డు వెంట తీసుకొని వెళ్ళాలని తెలిపారు. నేటి నుండి ఓటరు ఇన్ఫర్మేషన్ స్లీప్ లు, ఓటరు గైడ్ లను బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో కోరుట్ల నియోజక వర్గం సాధారణ పరిశీలకులు రాజీవ్ రంజన్ మీనా, జగిత్యాల, ధర్మపురి నియోజక వర్గాల సాధారణ పరిశీలకులు హెచ్. బసవ రాజేంద్ర, కోరుట్ల రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ ఎస్.రాజేశ్వర్, వివిధ పార్టీల ప్రతినిధులు, అభ్యర్థులు, నోడల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సంక్రాంతి బరిలో పలు సినిమాలు

## గుంటూరు కారం సహా పలు సినిమాల విడుదల

ప్రతి సంక్రాంతి పండుగ సినీ పరిశ్రమలో చాలా ముఖ్యమైనది. ఆ రోజునే చాలామంది నిర్మాతలు తమ సినిమాలను థియేటర్లలో విడుదల చేసి తమ తమ అదృష్టాలను పరీక్షించుకుంటూ ఉంటారు. ఈ క్రమంలో 2024 సంక్రాంతికి కూడా ఒకటి కాదు రెండు కాదు ఏకంగా డజన్ సినిమాల వరకు విడుదలకు సిద్ధమయ్యాయి. మళ్లీ ఇందులోనూ అందరూ పెద్ద స్టార్లు, బడా సంస్థల నుంచి భారీ బడ్జెట్‌తో వస్తున్నవే కావడం విశేషం. ముఖ్యంగా మహేశ్‌బాబు గుంటూరుకారం, రజనీకాంత్ లాల్ సలామ్, నాగార్జున నా సామిరంగా, వెంకటేశ్ సైంధవ్, విజయ్ దేవరకొండ ఫ్యామిలీ స్టార్, రవితేజ ఈగల్, ప్రశాంత్ వర్మ హనుమాన్, సుందర్ సీ అరణ్మై4 ,శివ కార్తికేయన్ అయలాన్, ధనుష్ కెప్టెన్ మిల్లర్, విజయ్ సేతుపతి హ్యాపీ క్రిస్మస్ వంటి సినిమాలు ఈ సంక్రాంతికి విడుదల చేయనున్నట్లు ఇప్పటికే మేకర్స్ ప్రకటించి ప్రమోషన్స్ కూడా ప్రారంభించారు. అయితే ఎన్నడూ లేని విధంగా 10,12 సినిమాలు పొంగల్ రిలీజ్‌కు సిద్ధం అవుతుండడంతో మేకర్స్, సినీ అభిమానుల్లో కాస్త కలవరం మొదలైంది. ఇన్ని సినిమాలు విడుదలైతే వాటికి థియేటర్లు దొరకడం, కలెక్షన్లు కావడం చాలా కష్టం అయ్యే పరిస్థితులు ఉండడంతో ఈ రేసులో నుంచి ఎవరైనా తప్పుకుంటారా లేదా అనే చర్చలు మొదలయ్యాయి. ఇందులో ఈగల్, హనుమాన్ సినిమాలు వాయిదా వేసుకుంటున్నారారని సోషల్ మీడియాలో వార్తలు వచ్చినా సదరు నిర్మాతలు ఖండించి మేము వెనకడుగు వేసేదే లేదని సినిమాను తప్పకుండా విడుదల చేస్తామంటూ ప్రకటించారు.

# వాహనాల తనిఖీలో పట్టుబడ్డ డబ్బులు పట్టుకున్న ఎల్కతుర్తి పోలీసులు




**ఎల్కతుర్తి నవంబర్ 16 (ప్రజా మంటలు) :**హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలంలోని సెంటర్లో ఎలక్షన్ సందర్భంగా వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమతి లేని డబ్బులు తరలిస్తుండగా పట్టుకున్న ఎల్కతుర్తి పోలీసులు సీఐ ప్రవీణ్ కుమార్ ఎస్సై గోదారి రాజ్ కుమార్ బస్టాండ్ కూడలి వద్ద తమ సిబ్బందితో వాహనాలు తనిఖీ చేస్తుండగా టీఎస్ 03%బ%80781 అనే వెహికల్ లో ఎలాంటి అనుమతులు లేని డబ్బులు 2 లక్షల 32వేల రెండు వందల 90 రూపాయలు పట్టుకోవడం జరిగిందని సిఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు ఇందులో పాల్గొన్నవారు ఎస్సై గోదారి రాజ్ కుమార్ కృష్ణమోహన్ సోమేశ్వర్ పాల్గొన్నారురోడ్డు భద్రతపై స్టూడెంట్స్ కు అవగాహన అవసరం

# ట్రాఫిక్‌ట్రైనింగ్ ఏసీపీ శంకర్ రాజు



**సికింద్రాబాద్ నవంబర్? 16 (ప్రజామంటలు):** : రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన అవసరమని బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ సెంటర్ ఏసీపీ శంకర్ రాజు అన్నారు. ఆయన గురువారం ఉస్మానియా మెడికల్ కళాశాలలో వైద్య విద్యార్థులకు ట్రాఫిక్ రూల్స్ పాటించడంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వాహన ప్రయాణంలో నిర్లక్ష్యం ప్రాణాంతకంగా మారుతుందన్నారు. రాష్ డ్రైవింగ్ మత్తు పదార్థాలు సేవించడం, డ్రంక్ అండ్ డ్రైవింగ్, సెల్ఫోన్ డ్రైవింగ్ వల్ల కలిగే అనర్థాలను విద్యార్థులకు ఆడియో విజువల్ రూపంలో చూపించారు. లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ చేయడం ఈవ్ టీజింగ్, ర్యాగింగ్ వంటి విషయాల పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శశికళ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కిరణ్మయి సుల్తాన్ బజార్ ట్రాఫిక్ సిఐ రాంబాబు, ఎంపీ హెచ్ఈఓ వేణుగోపాల్ గౌడ్, ఉపేందర్ రెడ్డి, సిసి అనిల్, గిరి బాబురావు తదితరులు పాల్గొన్నారు.

# టైగర్-3 కి మంచి రెస్పాన్స్

## ఖుషీలో సల్మాన్ ఖాన్

బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్ ఖాన్ టైగర్ ఫ్రాంఛైజీ సినిమాలకు క్రేజ్ ఎలా ఉంటుందో తెలిసిందే. ఇదే జోనర్‌లో వచ్చిన టైగర్ 3 మరోసారి ఈ క్రేజ్‌ను బాక్సాఫీస్‌ను రుచి చూపించింది. మనీశ్ శర్మ దర్శకత్వంలో సల్మాన్ ఖాన్ హీరోగా నటించిన చిత్రం టైగర్ 3. కత్రినాకైఫ్ ఫీ మేల్ లీడ్ రోల్ పోషించిన టైగర్ 3 దీపావళి కానుకగా నవంబర్ 12న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదలైంది.భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ చిత్రం ఆ అంచనాలకు ఏ మాత్రం తగ్గకుండా సక్సెస్‌ఫుల్‌గా స్క్రీనింగ్ అవుతూ టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా నిలుస్తోంది. టైగర్ 3 ఇప్పటివరకు గ్లోబల్ బాక్సాఫీస్ వద్ద రూ.271.50 కోట్లు వసూళ్లు రాబట్టింది. వీటిలో ఇండియా నుంచి రూ.180.50 కోట్లకు పైగా.. ఓవర్సీస్ నుంచి 59.50 కోట్లకుపైగా వసూళ్లు రాబట్టింది. సినిమాకు అద్భుతమైన రెస్పాన్స్ వస్తోన్న నేపథ్యంలో ప్రేక్షకులు, అభిమాన లోకానికి ధన్యవాదాలు తెలియజేశాడు సల్మాన్ ఖాన్. టైగర్ 3కి ప్రేక్షకులు, అభిమానుల నుండి వచ్చిన స్పందన పట్ల చాలా ఆనందంగా ఉంది. ప్రేక్షకులు టైగర్ 3 చిత్రానికి అద్భుతమైన ఓపెనింగ్స్ అందించారు. టైగర్ ఫ్రాంఛైజీ మూడో భాగం కూడా విజయవంతమైన కథను అందిస్తున్నందుకు నేను చాలా సంతోషంగా ఉన్నానంటూ తన ఎక్జయిట్‌మెంట్ తెలియజేశాడు సల్లూభాయ్. మరి రానున్న రోజుల్లో టైగర్ 3 నిర్మాతలకు ఇంకెన్ని వసూళ్లు తెచ్చి పెడుతుందనేది చూడాలంటున్నారు సినీ జనాలు. ఇప్పటికే టైగర్ 3 విషయమేంటంటే సల్లూభాయ్ కెరీర్‌లో రూ.100 కోట్ల గ్రాస్ సాధించిన 17వ సినిమాగా నిలిచింది. దీంతో ఏ ఇండియన్ స్టార్ హీరో నమోదు చేయని అత్యంత అరుదైన రికార్డును నెలకొల్పి టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగ్రా నిలుస్తున్నాడు సల్లూభాయ్. హిందీ, తమిళం, తెలుగు భాషల్లో గ్రాండ్‌గా విడుదలైన




టైగర్ 3లో అశుతోష్ రాణా, అనుప్రియా గోయెంకా, రిద్ధి డోగ్రా, అంగద్ బేడి కీలక పాత్రల్లో నటించారు. టైగర్ ఫ్రాంఛైజీలో ఏక్తా టైగర్, టైగర్ జిందా హై తర్వాత వస్తున్న సినిమా కావడం, అంచనాలకు టైగర్3 ఏ మాత్రం తగ్గకపోవడంతో అభిమానులు సంబురాలు చేసుకుంటున్నారు. ఉన్నాయి. టైగర్ 3 ఐమాక్స్ ఫార్మాట్‌లో కూడా విడుదలైంది. యశ్ రాజ్ ఫిలిమ్స్ బ్యానర్‌పై ఆదిత్యా చోప్రా తెరకెక్కించిన ఈ చిత్రానికి ప్రీతమ్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందించాడు.

# మై నేమ్ ఈజ్ జ్యోతి గా హన్సిక

## 'దేశముదురు' సినిమాతో తెలుగు చిత్రసీమలో అరంగేట్రం చేసిన హన్సిక

## అతి తక్కువ సమయంలోనే

అగ్రకథానాయికగా గుర్తింపు సొంతం చేసుకుంది. పలు సూపర్ హిట్ చిత్రాల్లో హీరోయిన్‌గా నటించిన ఆమె కథానాయికగా నటిస్తున్న లేడీ ఓరియెంటెడ్ చిత్రం 'మై నేమ్ ఈజ్ శృతి' శ్రీనివాస్ ఓంకార్ దర్శకత్వంలో వైష్ణవి ఆర్ట్స్ పతాకంపై బురుగు రమ్య ప్రభాకర్ నిర్మించారు. నవంబర్ 17న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతోన్న సందర్భంగా.. హీరోయిన్ హన్సిక ఈ సినిమా గురించి ఆసక్తికర విషయాలు చెప్పుకొచ్చారు. మేకిన్ మాఫియా ముప్పును స్పృశించే డార్క్ థ్రిల్లర్ చిత్రమిది. ఈ నేపథ్యంలో సినిమా చేయడం ఇదే తొలిసారి. నా పాత్ర ఇందులో ఓ ట్రాప్‌లో పడుతుంది. శృతి యాడ్ ఏజెన్సీలో పనిచేస్తోంది. ఆమె పాత్ర ఒక పోరాట యోధురాలులాగా ఉంటుంది. ఆత్మవిశ్వాసం ఎక్కువ. దేనికీ వెనకడుగు వేయదు. ఎలాంటి అడ్డంకులు వచ్చినా వాటిని దాటుకుంటూ వెళ్తుంది. అలాంటి శృతికి ఓ భయంకరమైన, అధిగమించలేదని సమస్య ఎదురవుతుంది? దాని నుండి శృతి ఎలా బయటపడింది అనేదే ఈ చిత్ర కాన్సెప్ట్. వ్యక్తిగతంగా నాకు ఇలాంటి చిత్రాలంటే ఇష్టం. మా అమ్మ డెర్మటాలజిస్ట్. ఈ సినిమా చేసే క్రమంలో నిజంగా స్కిన్ మాఫియా ఉందా? అని అమ్మను అడిగాను. తను కూడా ఎక్కడో ఇలాంటి ఘటన జరిగినట్లు చదివానని చెప్పింది. ఈ మాఫియా ద్వారా సామాన్యుడి జీవితంలో చీకటి వ్యాపిస్తుంది. ఈ సినిమా కోసం దర్శకుడు శ్రీనివాస్ ఓంకార్ పరిశోధన చేస్తున్న సమయంలో కొన్ని అనుకోని సంఘటనలను ఫేస్ చేశారు. ఇటువంటి సున్నితమైన అంశాన్ని టచ్ చేస్తూ.. సినిమా చేయడం సవాలుతో కూడుకున్న అంశం. ఊహించని ట్విస్ట్‌లతో.. చూస్తున్న ప్రతి ఒక్కరికీ థ్రిల్ ఇస్తుందీ సినిమా. ఇలాంటి థ్రిల్లర్ స్పేస్‌లో భాగమైనందుకు చాలా హ్యాపీగా అనిపించింది. ÷నైల్ అవుట్‌పుట్‌తో చూసి చాలా హ్యాపీ. సాంకేతికంగానూ ఈ సినిమా అందరికీ నచ్చుతుంది. బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ హైలెట్‌గా ఉంటుంది. ఈ ఫ్యామిలీ, ఫ్రెండ్లీ థ్రిల్లర్




ప్రతి కుటుంబాన్ని కదిలిస్తుంది. కొన్ని ప్రశ్నలను లేవనెత్తుతుంది. నేను ఇండస్ట్రీ కి వచ్చి 20 ఏళ్ళు అవుతుంది. ఇప్పటికి 50 చిత్రాల్లో నటించగా, ఇంకా భిన్నమైన పత్రాలు చేయాలనుంది. ప్రతి పాత్రను డ్రీం రోల్ గానే భావిస్తా. ప్రస్తుతం తమిళ చిత్రాలతో చాలా బిజీగా ఉన్నాను.. అందుకే నా తెలుగు ఫిల్మోగ్రఫీలో కొంత గ్యాప్ వచ్చింది. నా కెరీర్ విషయంలో ఎప్పుడూ బాధపడలేదు. అవకాశాలు ఉన్నా, లేకున్నా.. నేనిప్పుడూ ఇలానే ఉన్నాను. నటన పరంగా మాత్రం నేనింకా సంతృప్తి చెందలేదనే చెబుతాను.. ఇంకా ఎన్నో గొప్ప పాత్రలు చేయాలని ఉంది. నా కెరీర్ ప్రారంభంలో అల్లు అర్జున్, ప్రభాస్‌తో కలిసి పనిచేసినందుకు నేను గర్వపడుతున్నానని పేర్కొంది



రాయికల్ మండల్ మైతాపూర్ లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న బిఆర్ఎస్ నాయకులు

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL 2021/81092, PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com